# భాగవతగాథలు-మహిళలు

రచయిత

**ఆచార్య కె. సర్వోత్తమరావు**

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**

**2024**

# BHAGAVATHA GATHALU-MAHILALU

By
**Prof. K. Sarvottama Rao**

Editor
**Dr. Akella Vibhishana sarma**
Special Officer
Publications Division

T.T.D. Religious Publications Series No.1477
@ All Rights Reserved

First Edition : 2024

Copies : 500

Price :

Published by :
**Sri J. Syamala Rao,** I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati - 517 507

**D.T.P.**
Publications Division,
T.T.D, Tirupati

Printed at
**Tirumala Tirupati Devasthanam's Press**
Tirupati - 517 501

# ముందుమాట

సకల వేదాంతసారమే శ్రీమద్భాగవతం. వేదాంతం వృక్షమైతే దాని మధురఫలమే భాగవతం. ప్రస్థానత్రయంలోని సారాన్నంతా ఈ భాగవతంలో పొందుపరచడమైనది. "కృష్ణస్తు భగవాన్ స్వయం' అనే మూలసూత్రంపై శ్రీమద్భాగవతరచన జరిగింది. భాగవతంలో 12 స్కంధాలు శ్రీకృష్ణుని శరీరభాగాలుగా వర్ణించబడ్డాయి. ప్రథమ, ద్వితీయ స్కంధములు శ్రీహరికి పాదయుగళము. తృతీయ, చతుర్థస్కంధములు ఊరువులు. పంచమస్కంధము నాభిప్రదేశము. షష్ఠస్కంధము వక్షఃస్థలము. సప్తమ, అష్టమస్కంధములు రెండు బాహువులు. నవమస్కంధము కంఠము. దశమస్కంధము ముఖపద్మము. ఏకాదశస్కంధము లలాట ప్రదేశము. ద్వాదశస్కంధము శిరస్సు. భాగవత శ్రవణమాత్రముచేతనే మోక్షం సిద్ధిస్తుందనడానికి పరీక్షిత్తువృత్తాంతం ఉదాహరణం. ఇది ఒక అమృతకలశం వంటిది. దీనిని తనివిదీర ఆస్వాదించి ఆనందించడమే చదువరుల వంతు.

భగవంతుని అవతార లీలాగాథావైభవంగా చెప్పబడుతున్న భాగవతంలోని కొంతమంది మహిళల గురించి ఈ పుస్తకం వివరిస్తున్నది. ఎందరో మహిళామతల్లులు రామాయణ, భారతాలలోని స్త్రీపాత్రల స్వభావాలనుగురించి సామాన్యంగా అందరికీ తెలుసు. కాని భాగవతంలోని మహిళల గురించి తెలియదు. భాగవతంలోని మహిళల స్వరూప స్వభావాలు, వారి వ్యవహారశైలి, తమ అభిప్రాయాన్ని వ్యక్తీకరించే విధానాన్ని దృష్టిలో పెట్టుకొని ఇందులోని కథాంశాలను మహిళా దేవతలు, దివ్య మహిళలు, ప్రముఖపుర మహిళలు, ద్వారకాపుర మహిళలు, గ్రామీణ మహిళలుగా విభజించడమైనది. శ్రీలక్ష్మి, పార్వతి, యోగమాయ, చండిక, భూదేవి, సరస్వతి మొదలైనవారు మహిళా దేవతలుగా, అదితి, దితి, దేవయాని, దేవహూతి, సీత, సునీతి, సురుచి మొదలైనవారు

దివ్యమహిళలుగా, ఉత్తర, కుంతి, గాంధారి, ద్రౌపదులు ప్రముఖ పుర మహిళలుగా, కాళింది, నాగ్నజితి, దేవకి, భద్ర, మిత్రవింద, రుక్మిణి, సత్యభామలు ద్వారకాపుర మహిళలుగా వివరించడం జరిగింది.

ప్రముఖ సాహితీవేత్తగా, రచయితగా, ఉపన్యాసకునిగా పేరుపొందిన శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ విశ్రాంత ఆచార్యులు ఆచార్య కె.సర్వోత్తమరావుగారు 'భాగవతగాథలు – మహిళలు' గురించి ఎంతో చక్కగా, సామాన్యులకు అర్థమయ్యేలా రచించి తిరుమల తిరుపతి దేవస్థానానికి అందించారు.

ఈ మంచి గ్రంథాన్ని ఎంపిక చేసి చక్కగా ముద్రాపింపజేసిన ప్రచురణల విభాగం ప్రత్యేకాధికారి డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ గారికి శుభాభినందనలు.

భాగవతంలోని మహిళామణులను ఎంతో హృద్యంగా చిత్రించి, పాఠకుల హృదయాలలో చెరగని ముద్రవేసి ధన్యులను చేసిన విశ్రాంతాచార్యులైన సర్వోత్తమరావుగారికి ఆ దేవదేవుని ఆశీస్సులు లభించాలని, ఆకాంక్షిస్తున్నాను.

*సదా శ్రీవారి సేవలో...*

ఐ. శ్యామల రావు

**శ్రీకార్యనిర్వహణాధికారి**

తిరుమల తిరుపతి దేవస్థానములు,

తిరుపతి.

## ప్రణతి

భారతదేశమంతటా శ్రీమద్రామాయణానికి ప్రాచుర్యం ఎక్కువ. ప్రత్యేకించి ఔత్తరాహులు, తమిళులు రామాయణానికి ప్రథమస్థానం కల్పించారు. ఆపై మహాభారతానికి విస్తార ప్రచారం వుంది. తమిళులు, ఆంధ్రులు వైదికభారతాన్ని ప్రశంసిస్తారు. ఇక మూడవదయిన 'భాగవతం' పురాణవర్గంలో చేరినదయినా తెలుగులో బమ్మెరపోతన శ్రీమదాంధ్ర మహాభాగవతానికి తెలుగునాట అమితమయిన గౌరవం అందు కొంటున్నది.

తెలుగువారు భారతాన్ని అభిమానించినా పోతన భాగవతాన్ని కళ్ళకు అద్దుకొంటారు. 'సప్తాహ'మనే పేరుతో భాగవతకథాంశాలను రక్తితో భక్తితో వింటారు. రామాయణభారతోపన్యాసాలు జరిగేవేళ కారణాంతరాలవల్ల కొన్నిరోజులు వినకపోయినందుకు బాధపడరు. కాని భాగవతసప్తాహంలో తొలిరోజున వచ్చినవారు క్రమం తప్పకుండా ఏడు రోజులు హాజరవుతారు. మీదు మిక్కిలి పోతన భాగవతసప్తాహమంటే చెవియొగ్గి వింటారు. ఈ భాగవతంలోని స్తోత్రాలు మరి కుంతీభీష్ముల స్తుతులను విని తన్మయులవుతారు. భాగవతంలోని వివిధ పాత్రలు కళ్ళకు కట్టినట్టుగా ఉండడంతో ఆ పాత్రలలో తమ్ము ఊహించుకొంటారు. మరి దశమ స్కంధం సంగతి చెప్పపనిలేదు. బాలకృష్ణుని లీలలు భక్తకోటికి ఆనందం-పరమానందం కలిగిస్తాయి. నవరసభరితమహాకావ్యమయినా ప్రత్యేకంగా నవ విధభక్తిభేదాలకు భాగవతం ఒక పాదు.

ఎన్నో రకాలయిన విశిష్టతగల పోతనభాగవతాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం సరళగద్యానువాదసహితంగా జంధ్యాల పాపయ్య శాస్త్రిగారి సంపాదకత్వంలో ఐదు సంపుటాలుగా 1987లో ప్రచురించింది. ఈ సంపుటాలు ఏడు సార్లు పునర్ముద్రణం కావడం విశేషం అయినా

పోతనభాగవతానికి అర్థతాత్పర్యవిశేషాంశాలతో తి.తి.దే.వారు 2017వ సంవత్సరం ముద్రించారు. ఈ రెండు ప్రచురణలు విశేషాదరణం పొందాయి.

మహాభాగవతానికి సంబంధించి తి.తి.దే. గతంలో మరికొన్ని మహత్తర రచనలను సహృదయులకు అందచేసింది. ఇటీవల తి.తి.దే.వారు 'భాగవతంలో మహిళలు' అనే అంశంపై 100, 125 పుటల కనుగుణంగా ఒక పుస్తకం వెలువరించాలని భావించి ఆ పవిత్రకార్యాన్ని నాకు అప్పచెప్పారు. లోగడ నేను పంచమ స్కంధానికి వ్యాఖ్యాత కావడం కారణం కావచ్చు.

గతంలో పొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయంవారు 'ప్రాచీనాంధ్ర కవయిత్రుల స్త్రీస్వభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించినపుడు నా గ్రంథం ఉత్తమోత్తమంగా నిర్ణయించి ఐదువేల రూపాయలు బహూకరించారు. బహుశః 'భాగవతంలో మహిళలు' అనే గ్రంథరచనకు అది కూడా కారణం కావచ్చు.

భాగవతంలోని మహిళలు రామాయణ భారత మహిళలకంటె భిన్నమనస్తత్వం కలవారు. వీరిలో సాంసారికతత్త్వం ఎక్కువ. ఈ పురాణంలోని పాత్రలు జీవితం ఎలా గడిపినా మనసా ముక్తిని ఆకాంక్షించినవారే. పుత్రత్వంతో సదా వారి సంక్షేమం కోరినవారే. పుత్రాదుల మరణంతో కొందరు పొగిలినవారే. సవతుల మాత్సర్యం కారణంగా సతమతమయినవారు కొందరు. మరి అవివాహితులు, వివాహితులు కృష్ణప్రేమకు తపించినవారే. భగవత్పరమయిన చింతతో కాలం గడిపినవారే.

'భాగవతగాథలు-మహిళలు' అనే అంశంపై గ్రంథరచన చేయ వలసిందిగా కోరిన తిరుమల తిరుపతి దేవస్థానంవారికి నా కృతజ్ఞతలు.

**- కె.సర్వోత్తమరావు**

# ప్రస్తావన

ప్రపంచంలోని భాషలలో అతివిస్తృతమయినదీ, వైవిధ్యభరిత మయినదీ, ప్రాచీనమయిన వాఙ్మయం సంస్కృతంలోనే ఉంది. ఇలాంటి సంస్కృత వాఙ్మయంలో వేదాల తర్వాత పురాణాలకే సుప్రసిద్ధి. గజిబిజిగా వున్న వేదవాఙ్మయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి విభజించిన వ్యాసుడే 18 పురాణాలను 18 ఉపపురాణాలను సంతరింపజేశాడు. 18 మహాపురాణాలలో శ్రీమద్భాగవతం సర్వశ్రేష్ఠం. ఈ పురాణం గొప్పదనాన్ని స్కాంద, పద్మపురాణాలు ఘనంగా కీర్తించాయి.

శ్రవ్య దృశ్య కావ్యాదులకు లాక్షణికులు లక్షణాలను స్పష్టం చేసినట్లే పురాణాలకు కూడా పంచ లక్షణాలు చెప్పారు. ఇది సామాన్యపురాణాల లక్షణం. కాని భాగవతంలో పది లక్షణాలున్నాయి. అవే సర్గ–విసర్గ–వృత్తి–రక్ష–అంతరాలు–వంశం–వంశానుచరితం–సంస్థ–హేతువు–అపాశ్రయాలు. భాగవతానికి భగవంతునికి సారూప్యం ప్రకటిస్తూ భాగవతవైశిష్ట్యాన్ని నిరూపించినవారు కూడా లేకపోలేదు. వారి సమన్వయంబట్టి శ్రీకృష్ణపరమాత్మపాదాలనుండి మోకాళ్ళదాక ప్రథమ స్కంధం; కటిమొల పర్యంతం ద్వితీయ స్కంధం; నాభి (బొడ్డు) తృతీయ స్కంధం; ఉదరభాగం చతుర్థ స్కంధం; హృదయం పంచమ స్కంధం; కంఠం షష్ఠ స్కంధం; ముఖం సప్తమ స్కంధం; కన్నులు అష్టమ స్కంధం; బుగ్గలు, కనుబొమలు నవమ స్కంధం; బ్రహ్మరంధ్రం దశమ స్కంధం; మనస్సు ఏకాదశ స్కంధం ఆత్మ ద్వాదశ స్కంధం.

ప్రస్తుతం సంస్కృతభాషలో లభించే శ్రీమద్భాగవతంలో 12 స్కంధాలు, 335 అధ్యాయాలు, 18000 శ్లోకాలున్నాయి. విస్తారమయిన మహిమాన్వితమైన భాగవతం చతుశ్శ్లోకి భాగవతంగా, ఏకశ్లోకీ భాగవతంగా కూడా ప్రచారంలో ఉంది.

శ్రీమద్భాగవతాన్ని శ్రీమన్నారాయణుడే హయగ్రీవరూపంలో (భాద్రపదంలో) ఉపదేశించాడు. బ్రహ్మ నారదునికి, నారదుడు (కార్తికంలో) వ్యాసునికి, వ్యాసుడు సూతమహర్షికి, సూతమహర్షి శౌనకాది మునులకు ఉపదేశించాడు. అంతేగాక వ్యాసుడు (మార్గశీర్షంలో) శుకమహర్షికి, శుకమహర్షి పరీక్షిత్తునకు (మాఘమాసంలో) ఉపదేశించాడు. భాగవతం ఉపదేశాత్మకమయిన పరమార్థమేగాని మామూలు గ్రంథం కాదు. ఈ సత్యాంశాల కూర్పుకారణంగా గ్రంథం పేరు భాగవతమయింది. ఇలాంటి భాగవతాన్ని తెలుగులో బమ్మెరపోతన ఆంధ్రీకరించాడు. శిథిలమయిన భాగాలను బొప్పరాజు గంగన, ఏర్చూరి సింగన, వెలిగందెల నారయలు పూరించారు. తెలుగు భాగవతంలో 9005 పద్యగద్యాలున్నాయి. పోతన శ్రీధరీయవ్యాఖ్యానమనుసరించి కొన్ని భాగాలను పెంచాడని విమర్శకులంటారు. ఏది ఏమయినా ఆంధ్రదేశంలో బమ్మెర భాగవతానికున్నంత ప్రచారం భారతానికి లేదనడం సత్యాంశమే. పోతన జీవనవిధానం, పారమార్థికచింతన, ప్రజలు ఆకట్టుకొనేలా రచనాశైలి, సన్నివేశాల వర్ణనలలో దృశ్యచిత్ర సంధానాలు వివిధ ప్రార్థనలు ప్రత్యేకించి భాగవతంలో మహిళల చిత్రణలు అతివిశిష్టమయిన తెలుగుసాహిత్యంలో పోతరాజు, రామరాజు, త్యాగరాజులున్నారు గాని నాల్గవ రాజులేదని జంధ్యాల పాపయ్యశాస్త్రిగారి చమత్కారం.

పోతన భాగవతాన్ని కల్పతరువుగానే భావించాడు. 'లలిత స్కంధము, కృష్ణమూలము, శుకాలాపాభిరామంబు, మంజులతా శోభితము, సువర్ణసుమనస్సుజ్ఞేయము, సుందరోజ్జ్వలవృత్తము, మహాఫలంబు, విమలవ్యాసాలవాలంబునై వెలయున్ భాగవతాఖ్య కల్పతరువు' అన్నాడు. పోతన భాగవతానికి సంబంధించి వ్యాసాలు, పరిశోధనలు పుంఖానుపుంఖంగా వెలువడ్డాయిగాని 'భాగవతంలోని మహిళల' గురించి ప్రత్యేక గ్రంథం వెలువడినట్లు కనబడదు. ఈ కొరతను

తీర్చడానికోసం పోతన భాగవతాన్ని సరళవ్యాఖ్యానంతో ముద్రించిన తిరుమల తిరుపతి దేవస్థానంవారు ఈ శీర్షికన ప్రత్యేక రచనకు శ్రీకారం చుట్టడం చాల బాగుంది. ఇది ప్రశంసార్హమయిన పవిత్రకార్యం.

సంస్కృతంలో ప్రామాణికమయిన అమరంలో మనుష్యవర్గంలో

**"స్త్రీ యోషా దబలా యోషా నారీ సీమన్తినీ వధూః**
**ప్రతీపదర్శినీ వామా వనితో మహిళా తథా"** అని

సామాన్యంగా స్త్రీల పేర్లను తెలియజేసింది. మహిళాశబ్దానికి 'మహ్యత ఇతి మహిళా మహోపూజాయాం' ఆదరింవబడునది అని గురుబాలప్రబోధిక వివరణ ఇచ్చింది. ఆచార్య జి.ఎన్.రెడ్డిగారు కూర్చిన పర్యాయపదనిఘంటువులో మహిళాశబ్దానికి సుమారు వందకుపైగా శబ్దాలు కనబడుతున్నాయి.

శ్రీమద్రామాయణ భారతాదులలో ముఖ్యులయిన స్త్రీపాత్రల స్వరూపస్వభావాలే సామాన్యులకు తెలుసు. కాని భాగవతంలోని మహిళల స్వరూపస్వభావాలు సామాన్యులకు అంతగా తెలియవు. పరిశీలించగా భాగవతంలోని మహిళల నేపథ్యం వ్యవహారశైలి, స్వీయాభిప్రాయాన్ని వ్యక్తీకరించిన విధానం వినూత్నం ఈ దృష్టితో విమర్శనాత్మకపథంలో మహిళాదేవతలు (దేవతామహిళలు) దివ్యమహిళలు, పురమహిళలు గ్రామీణమహిళలు, మున్యాశ్రమహిళలు, ఇతరులనే విభాగంతో ఈ రచన చేయబడింది. ఆయా విభాగాలలో పాత్రల నామాలను అకారాదిక్రమం పాటింపబడింది.

* * *

## విషయసూచిక


| వరుస సంఖ్య | | పేజీ నెం. |
|---|---|---|
| | ముందుమాట | III |
| | ప్రణతి | V |
| | ప్రస్తావన | VII |
| **1.** | **మహిళాదేవతలు** | **1** |
| 1. | శ్రీలక్ష్మి | 1 |
| 2. | పార్వతి | 6 |
| 3. | యోగమాయ | 10 |
| 4. | చండిక | 11 |
| 5. | భూదేవి | 13 |
| 6. | సరస్వతి | 14 |
| **2.** | **దివ్యమహిళలు** | **16** |
| 7. | అదితి | 16 |
| 8. | కృతద్యుతి | 20 |
| 9. | దితి | 21 |
| 10. | దేవయాని | 25 |
| 11. | దేవహూతి | 29 |
| 12. | సతీదేవి | 32 |
| 13. | సీత | 35 |
| 14. | సునీతి / సురుచి | 36 |
| **3.** | **ప్రముఖ పురమహిళలు** | **39** |
| 15. | ఉత్తర | 39 |
| 16. | కుంతి | 44 |

| | | |
|---|---|---|
| 17. | గాంధారి | 47 |
| 18. | ద్రౌపది | 49 |
| 19. | హస్తినాపురవాసులు | 51 |
| **4.** | **ద్వారకాపుర మహిళలు** | **54** |
| 20. | కుబ్జ | 54 |
| 21. | జాంబవతీకల్యాణం | 56 |
| 22. | నాగ్నజితి | 57 |
| 23. | దేవకి | 59 |
| 24. | పూతన | 62 |
| 25. | భద్రావివాహం | 65 |
| 26. | మిత్రవింద | 65 |
| 27. | రుక్మిణివివాహం | 66 |
| 28. | వామాక్షి | 69 |
| 29. | సత్యభామ వృత్తాంతం | 72 |
| 30. | లక్షణా వివాహం | 75 |
| 19. | కాళింది | 77 |
| 31. | నరకుని చెఱశాలలోని రాజకన్యలు | 79 |
| 32. | మధురానగర ప్రవేశసందర్భంలో మహిళల సంరంభం | 80 |
| **5.** | **మున్యాశ్రమ మహిళలు** | **81** |
| **6.** | **గ్రామీణ మహిళలు** | **85** |
| 34. | బృందావనంలో పరిణిత బాల్యక్రీడ | 90 |
| 35. | విరహతప్తులయిన గోపికల ఆవేగం | 94 |
| 36. | కాళీయ కాంతామణులు | 96 |
| 37. | ఇతరములు | 98 |


* * *

# 1. మహిళాదేవతలు

## 1. శ్రీలక్ష్మి

దేవతాః దేవ ఏవ దేవతాః. దేహతా ఏవ దైవతా. దేవులే దేవతలు. దేవతలే దైవతములని గురుబాలప్రబోధిక వివరణ.

శ్రీమద్భాగవతంలో ఎందరో దేవతల స్వరూప స్వభావ వర్ణనలు, మహిమాతిశయ వర్ణనలున్నాయి. అయినా సనాతనధర్మం ముందుగా బ్రహ్మ, విష్ణు, పరమశివులను త్రిమూర్తులుగా పేర్కొనింది. కాని ఆ ప్రముఖదేవతల దేవేరులను గురించి చెప్పేవేళ సామాన్యులు కూడా లక్ష్మీ పార్వతి సరస్వతులని అంటారు. తెలుగులో ఆదికవి అయిన నన్నయ్య భారతాదిలో 'శ్రీవాణీగిరిజాశ్చిరాయ' అని సంస్కృతశ్లోకంతో రచన కొనసాగించాడు. ఏది ఏమయినా సర్వం లక్ష్మీప్రదం కావాలని 'శ్రీ'నే చెప్పడం జరుగుతోంది. అలాంటి లక్ష్మీదేవికి సంబంధించిన అనేకాంశాలు విష్ణుపురాణం, భాగవతపురాణాలలో సాధికారికంగా చెప్పబడ్డాయి. సంప్రదాయవాదులు ఈ రెండు పురాణాలనే ప్రామాణికంగా గ్రహిస్తారు.

శ్రీమద్భాగవతం 'అష్టమ స్కంధం' క్షీరసాగరమథన సన్నివేశంలో 'అప్సరసోదయం' తరువాత లక్ష్మీదేవి ప్రాదుర్భావం వర్ణితం. సిరి సాక్షాత్కారవైభవాన్ని పోతన

**'తొలుకారుమెఱుగుకైవడి**
**దళ తళ మని మేను మెఱయ ధగ ధగ మనుచున్**
**గలుముల నీనెడు చూపుల**
**జెలువంబుల మొదలి టెంకి సిరి పుట్టెన్'     (8-265)**

అని వర్ణించాడు. మూలంలో ఈ సందర్భంలోనే 'శ్రీరామా భాగవతపరా (8.8.81) అని వర్ణించింది. పుట్టింది మొదలు శ్రీహరిని రంజింపచేసే శ్రీదేవి భగవంతునియందు పరిపూర్ణమయిన అనురాగము కలదనే అర్థంలో వర్ణితం.

పోతన పాలకడలినుండి ఉద్భవించిన అప్సరాదుల ఆంగిక వైఖరికి ప్రాధాన్యమిచ్చాడు. కాని లక్ష్మీదేవి వర్ణనలో లక్ష్మిజన్మస్థానవైభవాన్ని కళ్ళకు కట్టించినాడు. ఆపై సిరివైభవాన్ని వర్ణించాడు. ఈ వైభవకీర్తనలో విశేషాంశాలున్నాయి.

లోకంలో పుట్టిన బిడ్డకు కొన్ని సంస్కారాలు చేయడం జనసామాన్యంలో ఉన్న ఆచారమే. ఆ దృష్టితో పోతన చుట్టూవున్నవారి చేతలను అభివ్యక్తం చేశాడు. 'పాలసముద్రంలోని పైకెగసే మీగడ మిసమిసలతో బ్రహ్మదేవుడు జాణతనమునఁ జేతుల జిడ్డువిడిచి యీ కొమ్మనొగిజేసినాడని' (8-) వర్ణించడంలో జన్మస్థానవైభవాన్ని ఉద్దీపితం చేసినట్లయింది. ఆపైన వైభవవర్ణనలు.

అమ్మవారి పవిత్ర స్నానానికి ఇంద్రుడే ముందు తొందరపడ్డాడు. కారణం ఇంద్రాదుల సంపద అంతా సముద్రంలో కలిసిపోయింది. లక్ష్మీదేవి అనుగ్రహం ప్రసరిస్తే సకలసంపదలు మరల తనకు హస్తగతమవుతాయనే దూరదృష్టి. కనుకనే ఇంద్రుడు 'మంగళస్నానం' చేయింతమన్నాడు. ముందుగా 'రత్నమయపీఠాన్ని' ఇంద్రుడే సమకూర్చాడు. సుమంగళాకారులయిన దేవతాస్త్రీలు పుణ్యాహస్నానానికి నదీతీర్థాదులతోడి కడవలను తెచ్చారు. భూదేవి రావి, మఱ్ఱి, మామిడి, మేడి, జువ్వి వృక్షాల పంచపల్లవాలను సమకూర్చింది. గోవులు పంచగవ్యాలను (పాలు, పెరుగు, నేయి, పేడ, మూత్రం) సిద్ధం చేశాయి. మరి నల్లటిమబ్బులు రకరకాల వాద్యాల సవ్వడులతో తమ హర్షాన్ని ప్రకటించాయి. సరిగ్గా ఇదే సమయంలో గంధర్వులు పాడగా,

గంధర్వకాంతలు నాట్యం చేశారు. దేవమునులు స్వరయుక్తంగా మంత్రాలు పఠించారు. ఆ సమయంలోనే దిగ్గజాలు పుణ్యజలపూరిత ఘటాలను తమ తొండాలతో ఎత్తి అమ్మవారికి అభిషేకం చేశాయి. ఆ సమయంలోనే తండ్రి సముద్రుడు ధారణకోసం 'పట్టుపుట్టము దోయి' ఇచ్చాడు. వరుణుడు సంతోషంతో వైజయంతీమాలను, విశ్వకర్మ కాంచనకేయూర కంకణ కింకిణీ కటకాదులను, పద్మభవుడు పాణిపద్మాన్ని, భారతీదేవి మంచి తారహారాన్ని ఇచ్చారు. మంగళ ప్రదమయిన సూక్తులను వేదాలు గానం చేశాయి. దిక్కులన్నీ ఏకముఖంగా 'ఎల్లలోకములకు ఏలికసానిగా రాణింపవమ్మా' అని మనసారా దీవించాయి. ఈ తతంగమంతా జరుగుతుంటే లక్ష్మీదేవి బ్రహ్మాండాలను ఆటల బొమ్మరింద్లుగా భావించింది. చతుర్దశ భువనాలను తన ఇంటి దొంతులుగా బ్రహ్మాది సురలను తన ఇంటి బొమ్మలుగా, కుంభినీ చక్రాన్ని బొమ్మపీటగా, సూర్యచంద్రుల కాంతుల్ని దీపకళికలుగా భావించిందట. అంతేగాదు తనకు సరస్వతీ, పార్వతీదేవేరులు ఇద్దరు ఆత్మసఖులుగా ఆదరించిందట. తదనంతరం లక్ష్మీదేవి మేఘసమూహంలోని మెఱపులాగా, తుమ్మెదల ఝుంకారాలతోడి కలువల పూదండ చేబట్టి దేవతల మధ్య నిలిచిందట. ఆ సందర్భంలో పోతన వర్ణన

**ఆ కన్నులు నా చన్నులు**
**నా కురు లా పిఱుఁదు నడుము నాముఖ మా న**
**వ్యాకారముఁగని వేల్పులు చీకాకు పడినఁరి (8.278)**

కాని ఒక్క హరిమాత్రం స్థిరమనస్కుడై నిలిచాడట. తదనంతరం లక్ష్మీదేవి దశ దిశలలోని యక్ష, రక్షస్సిద్ధ సాధ్య దివిజ గరుడ గంధర్వ చారణ ప్రముఖ నిఖిలాయుధాన్ని సూక్ష్మదృష్టితో బేరీజు వేసిందట.

పైన చెప్పిన అంశాలను ఒకమాలలో గుదిగ్రుచ్చినట్లు పోతన భాగవతాదిలో లక్ష్మీదేవి రూపగుణాదికాలను

**హరికిం బట్టపు దేవి, పున్నెముల ప్రో వర్థంపుc బెన్నిక్క, చం దురు తోcబుట్టువు, భారతీ గిరిసుతల్ తోనాడు పూcబోcడి తా మరలం దుండెడి ముద్దరాలు జగముల్ మన్నించు నిల్లాలు, భా సురతన్ లేములు వాపు తల్లి సిరి** అని స్మరించాడు. (1-11)

భాగవతంలోని లక్ష్మీదేవి కూడా ఎక్కడా నోరు విప్పకుండడం చిత్రం. ఈ సన్నివేశమంతా ఒక మౌనాశ్రిత మూగచలనచిత్రం.

ఈ వృత్తాంతంలో మహిళామాననీయగుణాలు ఆవిష్కృతం. తానేమో స్త్రీ...ఆశ్రయంలేక బతకడం సాధ్యంకాదు. తాను ఎవరిని ఆశ్రయించాలో తెలియక సకలదేవతలను ఓరగంట చూచింది. ఈ సందర్భంలో పోతన దిక్పాలుర లోపాలను చెప్పలేదు. కాని లక్ష్మికి ఆయా దేవతలలోని 'లోపాలు' కనబడ్డాయి. ఒకరి ఇంట సుమంగళత్వముండదు. ఒక ఇంట్లో సవతిపోరు. ఇంకొకచోట నిత్యవైభవం ప్రశ్నార్థకం. మరోచోట ఎపుడు సెగలే. ఇంకొకచోట చల్లదనమే. మరోచోట కారుణ్యరాహిత్యం. ఇంకొకచోట నిలుకడలేనితనం. మరోచోట అలసత్వం. కొన్నిచోట్ల కుమ్మరించిన కామం. కొన్నిచోట్ల క్రోధం. మరికొన్నిచోట్ల అరిషడ్వర్గాల కూటమి. ఇలాంటి దృశ్యాలను పసిగట్టిన సూక్ష్మగ్రాహిణి చివరకు 'నల్లనయ్య'ను చూసింది. ఈ మహానుభావుని వరిస్తే ఐదవతనం శాశ్వతం...రెండవది అగ్రమహిషిగా ఉండవచ్చు. సవతుల పోరు లేదు. అవిశ్రాంతవిభవంతో జీవనం. మరి స్వభావం శృంగార చందన శీలత్వం. కనుక కస్సుబుస్సులుండవు. పైగా నల్లనయ్య కరుణామూర్తి. నిలకడగల వ్యక్తి. అలసత్వం లేనివాడు. సాధురక్షకుడు అని తర్కించుకొని తన చేతిలోని పుష్పదామికాన్ని అతని మెడవేసిందట. ఆ సమయంలో లక్ష్మీదేవి హావభావాలను పోతన

**మోహరుచలవలన ముద్దియ తలయెత్తు**
**సిగ్గువలన బాల శిరము వంచు**

**నింతి వెలుఁగువలన నెత్తదు వంపదు**

**తనదు ముఖము ప్రాణదయితుఁజూచి (8.284)** అని వర్ణించాడు. ఆ సందర్భంలో హరి చూచిన సిరి చూడదట. సిరి చూచిన హరి చూడడట. మరోసారి సిరి హరిని చూచి సిగ్గుపడుతుందట. ఇలాంటి మహాలక్ష్మి బెరుకుచూపులను అర్థం చేసుకొన్న హరి సిరిని తన యురమున నిలిపినాడట. ఆ సమయాన సముద్రుడు కౌస్తుభాన్ని హరికి కానుకగా ఇచ్చాడు. దేవతలు ఆటపాటలతో తమ సంతోషాన్ని ప్రకటించారు. సర్వలోకపూజ్యులు విష్ణునామాంకితపద్యాలతో స్తుతిస్తూ పూలవానలు కురిపించారు. ఆ తల్లి వారిని చల్లని చూపులతో చూడగనే ప్రజలకు వైభవం, శుభం చేకూరాయి. ఆ సందర్భంలో రాక్షసులు లక్ష్మి తమకేసి చూడలేదని ఖిన్నులయ్యారట.

ఈ వృత్తాంతంలో గుర్తించదగ్గ అంశాలున్నాయి. 'పతిమెచ్చే చెలులకంటె సతిమెచ్చే చెలులు అదృష్టవంతులు'. ఒక స్త్రీ అలవోకగా తాను పెళ్ళాడరాదు. ఎదిరి గుణగణాలు పరిశీలించాలి. ముందువెనుకలు ఆలోచించుకోవాలి. లచ్చి పరిశీలనలో ఇంద్రుడు లోకాధిపతి కాని తన పదవికి ఎవరు ఎసరుపెడతారేమో అనే సదా భీతచిత్తుడు. కుబేరుడు ధనవంతుడు. కాని పిసినారి. పిసినారితో జీవితం అనేకరకాల ఇబ్బందులు లౌకికసంతోషాలకు దూరం. అగ్ని మంచివాడే. కాని ధగధగమనేవానితో సౌమ్యసంసారం హుళక్కి. వాయువు గొప్పవాడే. ఏం లాభం? ఇంటిపట్టుననే ఉంటాడనే నమ్మకంలేదు. ఇలా పరిశీలించాకనే వారిని తృణీకరించింది. ఇది వివాహమాడేవారికి ఉచితసలహా. భార్య గొప్పతనం, మంచితనాన్ని ఏ మగవాడయినా హృదయంలో దాచుకోవాలనే దృష్టితో శ్రీహరి వక్షఃస్థలనివాసానుగ్రహం ఇచ్చాడు.

ఈ సన్నివేశానికి సంబంధించి వైష్ణవుల వ్యాఖ్యానం మరింత ఆసక్తికరం, రసవత్తరం. అమృతమథనప్రయత్నం వెనుక మరో

పరమార్థముందట. విష్ణువు తనకు తగిన ఇల్లాలిని వెదకి స్వీకరించ డానికట! మరి దేవతలు మరల పోటీరాకుండడానికోసం ముందుగానే వారు కోరినవన్నీ సరేననడం, ఐరావతం, ఉచ్చైశ్రవాలు ముందుగానే ఇంద్రుడు స్వీకరించినవాడు కావడంవల్ల లచ్చిని తనకిమ్మని అడుగలేక పోయాడట. లోకంలో తెలివయిన వ్యక్తి తన మనసులోని ఆలోచనను ఎదుటివారికి తెలియక జాగ్రత్తపడుతూ కార్యసాధనకు ఎదుటివారిని వాడుకోవడమనే నైజం దేవతలలో హరికి దప్ప ఇతరులకు చేతకాదని వారి వ్యాఖ్యానం.

## పార్వతి

దేవతాగణంలో లక్ష్మీదేవి తరువాత ఎన్నదగిన దేవత పార్వతి. అమరకోశం పార్వతి శబ్దపర్యాయాలుగా ఉమా, కాత్యాయనీ, గౌరీ, కాళీ, హైమవతీ, ఈశ్వరీ, శివా, భవానీ, రుద్రాణీ, శర్వాణీ, సర్వమంగళ, అపర్ణా, దుర్గా, మృడానీ, చండికా, అంబికా, ఆర్యా, దాక్షాయణీ, గిరిజా, మేనకాత్మజాలాంటి నామాలను కూడా పేర్కొనింది. భాగవత కథాసన్నివేశాలలో ఉమ, హైమవతి, ఈశ్వరి, సర్వమంగళ, దుర్గ, చండికా అనేపేర్లు కనిపిస్తున్నాయి.

బమ్మెరపోతన భాగవతం ప్రథమ స్కంధంలో ఇష్టదేవతాస్తుతి చేస్తూ దుర్గాదేవిని

**అమ్మల గన్నయమ్మ, ముగురమ్మల మూలపుటమ్మ, చాల పె**
**ద్దమ్మ, సురారులమ్మ కడుపాఱడి పుచ్చినయమ్మ, తన్నులో**
**నమ్మిన వేల్పుటమ్మల మనమ్ముల నుండెడియమ్మ, దుర్గ, మా**
**యమ్మ, కృపాబ్ధి యిచ్చుత మహత్త్వకవిత్వ పటుత్వ సంపదల్**

అని పార్వతీదేవిని దుర్గారూపంగా భావించి చక్కటి పద్యం వ్రాశాడు.

ఆర్యామహాదేవి సౌమ్యరూపాలలో పార్వతి, ఉమ, హైమవతి, సర్వమంగళ నామాలు సుప్రసిద్ధం. బమ్మెరపోతన ప్రథమ స్కంధం నైమిశారణ్యవర్ణనలో అసంఖ్యాక ఉపమానాలను కూర్చాడు. వాటిలో 'నీలగళసభానికేతనంబునుం బోలె వహ్ని వరుణ సమీరణ చంద్ర రుద్ర హైమవతీ కుబేర వృషభ గాలవ శాండిల్య పాశుపత జటాపటల మండితంబై, అనే సుదీర్ఘసమాసంలో 'హైమవతీ' శబ్దాన్ని కూర్చాడు. ఈ సందర్భంలో 'హిమగిరితనయే హేమలతే' అనే కీర్తన అనుసంధానించదగ్గది. ఈ శబ్దంతో 'పార్వతి' పరిచితమయింది. పర్వతరాజు కుమార్తెగా పార్వతి నిత్యము స్మరణీయ. కాళిదాసు 'పార్వతీపరమేశ్వరౌ' అనియే ప్రయోగించాడు.

మూడవపేరు సర్వమంగళ. ఈ పేరు దేవతలచే ప్రార్థితుడయిన శివుడు హాలాహలాన్ని పానంచేసే ఘట్టంలో సాభిప్రాయంగా ప్రయుక్తం. అమృతసంపాదనకోసం బద్ధవిరోధులయిన దేవదానవులు కలిసికట్టుగా ఒక తాటిపై వచ్చి పాలసముద్రంలో మంథరపర్వతం కవ్వంగా, వాసుకి రజ్జువుగా చిలకడం మొదలెట్టారు. అల్లకల్లోలమయిన ఆ సముద్రమథన సమయంలో 'హాలాహలం' అగ్నిజ్వాలలతో బయలుపడింది. ఈ దృశ్యాన్ని చూచిన సురాసురులు వాసుకిని వదలిపెట్టి పారిపోయారు. ఆ విషాగ్నికి అడ్డంపోయి, నిలువరించి దానిబారినుండి జగత్తును కాపాడేవారు లేకపోయారు. చివరకు బ్రహ్మాదిదేవులు కైలాసానికి కదిలారు. అప్పుడు పరువెత్తుకొని వస్తున్న బ్రహ్మాదుల్ని ద్వారపాలకు లడ్డగించారు. అప్పుడు వారు ద్వారపాలకులను తొలగండని పక్కకు నెడుతూ లోపలికి వెళ్ళి పరమేశ్వరునితో శరణు శరణు అన్నారు. నిండుసభలో ఉన్న పరమేశుడు దేవతలకు వెంటనే దర్శనమిచ్చాడు. అపుడు ప్రజాపతి ముఖ్యులు 'మూడు మూర్తులకును, మూడు లోకములకును, మూడు కాలములకు మూలం నీవే, ఏకమాత్రంగా కనిపించే పరబ్రహ్మతత్త్వం నీవే' అని

పొగడుతూ హాలాహల విజృంభణం గూర్చి మనవి చేస్తూ 'నిఖిలలోకస్తుత్యా! నీకంటే ఒండెఱుంగము. నీకంటెం బరులు గావనేర్వరు జగముల్' అని శరణాగతి చేశారు.

ఆ సందర్భంలో శివుడు పార్వతికేసి చూస్తూ 'లోకులు పడుతున్న పరమదుఃఖం చూస్తున్నావా! విషాగ్నివిజృంభణం గురించి వింటున్నావా! ప్రభువయినవాడు ఆర్తులు బాధలను నివారించడం ప్రప్రథమ కర్తవ్యం. ప్రాణాలు నీటి బుడగల లాంటివి. ఉత్తములయినవారు ఇతరులను కాపాడడం కోసం తమ ప్రాణాలను కూడా త్యజించడానికి వెనకడుగు వేయరు. పరహితసాధనమే పరమధర్మం. యావత్ జగత్తు సంతోషించేలా నేను హాలాహలాన్ని దండించి 'మధుర సూక్ష్మ ఫలరసం' పానం చేసేలా త్రాగేస్తాను. ప్రాణికోటిని తప్పక రక్షిస్తాను' అన్నాడు. తన ప్రాణవల్లభుని మనసెరిగిన సతి 'దేవర చిత్తం' అంది. అమృతమథనం జరిగే చోటుకి పరమశివుడు వెళ్ళి హాలాహలాన్ని దండిస్తూ విషాగ్నిని ఒకచోట చేర్చుకొని ఒక ముద్దలాగా మార్చుకొని నేరేడుపండును తిన్నంత సులభంగా విలాసంగా ఆరగించాడు. చాలా చిత్రమేమిటంటే విషపానం చేసేవేళ శివుని శరీరానికి చెమటపట్టలేదు. కళ్ళు ఎఱ్ఱబడలేదు. చంద్రుడు కందిపోలేదు. ఆ వేడికి పాములు కదలిపోలేదు. చిచ్చరకన్నుగల శివునికే హాలాహలభక్షణం సాధ్యమయింది. ఈ దృశ్యాలను చూస్తున్న పార్వతి, విష్ణువు మహేంద్రాదులు మేలుమేలన్నారు. ఈ ఘట్టంలో పోతన 'ఉమ' శబ్దాన్ని వాడాడు. వద్దు అని తల్లిచే తపస్సుకు నిషేధింపబడడంవల్ల 'ఉమ' 'అవతీతి ఉమా అవరక్షణే'. రక్షించునట్టిది అనే అర్థంలో 'ఉమ' శబ్దప్రయోగం. విషవిజృంభణఘట్టంలోను ఆ తల్లి మగనిని ప్రోత్సహించి రక్షించింది.

ఈ సన్నివేశంలో ఎన్నో సందేశాలున్నాయి. ఈ సన్నివేశంలో గార్హస్థ్యముంది. లౌకికజీవితంలో గృహస్థుడైనవాడు ఎవడయినా సరే

సాహసకార్యానికి సంసిద్ధుడయిన వేళ భార్య అనుమతికోరాలనే ధార్మిక రహస్యముంది. ఈ నియమం నేడూ గృహాచారసంప్రదాయవిధిగా ఉంది.

రుక్మిణీదేవి వృత్తాంతకథనంలో ఆర్యామహాదేవి, ఈశ్వరీ శబ్దాలున్నాయి. రుక్మిణి అగ్నిద్యోతనుని ద్వారా తన గాఢ అనురాగాన్ని తెలియచేస్తూ వైవాహిక ఆచారాలలో ఒకటయిన గౌరీపూజకు తాను నగరు వెలువడి ఆర్యామహాదేవి గుడికి రాగలనని, ఆ సమయంలో నన్ను అవలీలగా వెంబడె వెంటబట్టుకొని వెళ్ళవచ్చని కూడా 'ఉపాయం' సూచించింది. అదేప్రకారం గౌరీపూజార్థం చెలికత్తెలు వెంటరాగా గుడిని చేరి అమ్మను

**నమ్మితి నా మనంబున సనాతులైన యుమామహేశులన్**
**మిమ్ముఁ బురాణదంపతుల మేలు భజింతు గదమ్మ! మేటి పె**
**ద్దమ్మ దయాంబురాశివి గదమ్మ హరిం బతి సేయు మమ్మ నిన్**
**నమ్మినవారి కెన్నఁడును నాశము లేదు గదమ్మ యీశ్వరీ!**
**(10.1.1744)**

అని ప్రార్థించింది. కావ్యాదిలోని 'దుర్గాస్తుతి' కూడా ద్విత్వమకారం ప్రాసాక్షరంగా 'మ్మ' నిలవడం గుర్తించదగ్గది. ఆపై రుక్మిణి 'ఇందుధర సుందరమందిరం' నుండి బయటికి వచ్చింది. ఈ పూజావిధానం నేటికీ సజీవంగా ఉంది.

హైందవస్త్రీలు ఏ కులంవారయినా సరే మంగళసూత్రానికి విలువ ఇస్తారు. తన మాంగల్యం తిరంగా ఉండాలని కోరుకొంటారు. పరమశివుడు హాలాహల విషభక్షణానికి సమ్మతించినవేళ పోతన వ్రాసిన పద్యం

**'మ్రింగెడువాడు విభుం డని**
**మ్రింగెడిదియు గరళ మనియు మేలని ప్రజకున్**

**్రమింగు మనె 'సర్వమంగళ'**
**మంగళసూత్రంబు నెంత మది నమ్మినదో!' (8.241)**

అమరకోశం గురుబాలప్రబోధికలో 'దుఃఖేన గమ్యత ఇతి దుర్గం', ప్రయాసము చేత పొందబడునది అనే వివరణ కనిపిస్తుంది. అష్టమ స్కంధంలో లక్ష్మీదేవి భారతీదుర్గలను ఆత్మసఖులుగా భావించిందనే ఉల్లేఖముంది. అలాగే స్యమంతకోపాఖ్యానంలో కృష్ణుడు గుహలోపలికి వెళ్ళి మరల రాకపోయేసరికి కృష్ణుని వెంటవచ్చినవారు ఏమీ తోచక నగరం చేరుకొని 'దుర్గాదేవినే' కొలిచినారట. అపుడా దేవి 'బాలామణితో మణితో హేలాగతి అంబుజేక్షణుడు వచ్చున్' వచించి వారిని సంతోషపెట్టింది. తమ సంతానానికి దుర్గానామకరణం చేయడం ఆంధ్రులలో ఎక్కువ. ప్రత్యేకించి కనకదుర్గ, విజయదుర్గ నామధేయాలు. అలాగే దశమ స్కంధంలో గోపికలు కాత్యాయనీవ్రతం ఆచరించినట్లు ఉల్లేఖముంది.

## యోగమాయ

భాగవతం దశమ స్కంధంలో 'యోగమాయ' ప్రసక్తివుంది. ఈ మాయ మహిళారూపమే. మహావిష్ణువు ఆనతిమేరకు దేవకీగర్భంలోని ఏడవ గర్భమయిన శేషాంశను పుచ్చుకొని రేపల్లెలో రుక్మిణీదేవి గర్భంలో ప్రవేశపెట్టిన మాయ యోగమాయ. ఆ తరువాత యశోదగర్భంలో తానే బిడ్డగా పుట్టింది. ఈ మాయ, సంపదలకు నిలయమని, కామదాయిని అని భాగవతంలో చెప్పబడింది.

విష్ణువు యోగమాయను పురమాయించడానికి కారణం కంసునివలన యాదవులకు ముప్పు ఏర్పడుతుందనే సూచనకోసమే. కనుకనే హరి యోగమాయాశక్తితో, 'నీవు గోపస్త్రీలు, గోపాలురున్న వ్రేపల్లెకు వెళ్ళు. వసుదేవుని భార్యలందరు బందీలయివున్నారు. కాని

ఒక్క వసుదేవుని భార్య రోహిణిమాత్రం వ్రేపల్లెలో ఉంది. ఆమె గుణగణాఢ్య. దేవకికడుపులోని నా శేషాంశతేజస్సును నీవు బయటికి తీసి నేర్పుగా రోహిణీగర్భంలో ప్రవేశపెట్టు. నేను నా అంశతో దేవకీదేవి కుమారునిగా జన్మిస్తాను. ఆ తర్వాత నీవు నందుని భార్య అయిన యశోదగర్భంలో పుడతావు' అని విశదంగా చెప్పాడు.

ఓ మాయాదేవి! నీవు చేసే సత్కార్యం వలన లోకంలో పూజింపబడతావు. కాశీక్షేత్రంలో నీవు 'దుర్గవు'. భద్రేశ్వరక్షేత్రంలో 'భద్రకాళివి'. వరాహశైలక్షేత్రంలో 'విజయవు'. మాతృకాక్షేత్రంలో 'వైష్ణవివి'. మానసక్షేత్రంలో 'కుముదవు'. అమరకుండక్షేత్రంలో 'చండికవు'. హస్తినాపురక్షేత్రంలో 'కృష్ణవు'. శ్రీశైలక్షేత్రంలో 'మాధవి'గా వెలుగొందుతావు. కన్యాకుబ్జక్షేత్రంలో 'కన్యకవు'. మాయానగరక్షేత్రంలో 'మాయవు'. సుపార్శ్వక్షేత్రంలో 'నారాయణివి'. రుద్రకోటిక్షేత్రంలో 'ఈశానవు'. బ్రహ్మక్షేత్రంలో 'శారదవు'. సిద్ధవనక్షేత్రంలో 'అంబికవు'.

"మాయావి' నిన్ను మానవులు భక్తితో సేవిస్తారు. కానుకలు సమర్పిస్తారు. బలులిచ్చి సంతృప్తిపరుస్తారు. భయభక్తులతో నిన్ను సదా సేవిస్తారు', అని వరమిచ్చాడు.

ఈనాటికి ఆయా క్షేత్రాలలో యోగమాయ మానవులకు ఆరాధ్యగా వెలుగొందుతోంది.

## చండిక

పార్వతి శబ్దానికి గల పర్యాయపదాలలో 'చండిక' ఒకటి. 'చండ్యతి కుప్యతీతి చండికా' కోపము గలది. 'చడి కోపనే' చండాసురుని చంపినది అని గురుబాలప్రబోధికలో వివరణ. భాగవతం పంచమ స్కంధంలో జడభరతుని కథలో చండికాదేవి ప్రస్తావన వుంది.

జడభరతుని కథలో మహిళల ప్రసక్తి నామమాత్రం. భరతవర్షాన్ని పాలించిన భరతుడు వృద్ధాప్యదశలో రాజ్యాన్ని కుమారుల కప్పగించి మునివృత్తి చేబట్టి అడవులకు చేరాడు. గండకీనదీతీరంలో మునివృత్తి హాయిగా గడుస్తూ వుంది. ఒకరోజు గండకిలో తానమాడబోతుండగా సింహగర్జనకు భయపడి పూర్ణగర్భ అయిన ఒక జింకభయంతో దూకబోయింది. అలా దూకడంలో గర్భవిచ్ఛిత్తి కలిగి కడుపులోని పిల్ల జారి నదిలో పడింది. తల్లి లేడి మరణించింది. ఈ దృశ్యాన్ని చూస్తున్న భరతుడు చలించాడు. లేడికూనను లేవనెత్తి ఆశ్రమం చేరుకొని శుశ్రూషలు చేయసాగాడు. ఈ శుశ్రూషలో జడభరతుడు తపోనియమాలు మరచాడు. కాని ఒకసారి ఆప్యాయంగా, మమతతో సాకిన లేడి పారిపోయింది. భరతుడు సర్వస్వం పోయినట్లు వగచినాడు. చివరకు జింక ఒకనాడు తిరిగి రానేవచ్చింది. అప్పటికే ముసలివాడయిన భరతుడు జింకను చూస్తూ మరణించడంవల్ల జింక కడుపులో పుట్టాడు. ఆపై పూర్వజన్మస్మృతిగల భరతుడు పులహాశ్రమం చేరుకొని ఎండిన ఆకులు తింటూ గడ్డిపరకలు మేస్తూ కొంతకాలానికి హరిణశరీరం వదలిపెట్టాడు. అతడే అంగిరసగోత్రుడయిన ఒక బ్రాహ్మణునికి ఆపై కుమారుడుగా పుట్టాడు. పూర్వస్మృతితో భరతుడు బంధవిముక్తికోసం ఉన్మత్తుడుగా, జడుడుగా, అంధుడుగా జనులకు కనిపిస్తుండేవాడు. మొదటి భార్యా కుమారులు భరతుని పొలం కాపరిగా పెట్టారు. భరతుడు తన్ను తిట్టినా కొట్టినా హింసించినా నిర్లిప్తంగా ఉండేవాడు.

జడభరతుడు పొలం కాపలా కాచే ప్రదేశానికి దగ్గర ఒక నగరం ఉంది. ఆ నగరాధిపతికి సంతానం లేదు. సంతానంకోసం చండికకు నరబలి ఇవ్వాలనుకొన్నాడు. భటులు అన్ని ఏర్పాట్లు చేశారు. కాని దురదృష్టవశమున 'నరబలి'కి సిద్ధమయినవాడు పారిపోయాడు. ఇలా ఉండగా వారి దృష్టికి 'భరతుడు' ఆనాడు. అతనినే నరబలిగా

ఇవ్వాలనుకున్నారు. చండికాలయానికి తీసుకువెళ్ళారు. అంతా సిద్ధమయింది. బలి ఇవ్వబోతుండగా చండిక జడభరతుని చూచింది. అతనిలోని విష్ణ్వంశను గుర్తించి బోయదొరమీద, అతని భటులమీదికి ఉరికి వారి తలలను ఖండించింది. తదనంతరం భరతుడు పొలం కాపలాకు వెళ్ళిపోయాడు. ఈ సందర్భంలో వర్ణితమయిన సీసపద్యం చండికావిహారాన్ని కళ్ళకు కట్టిస్తున్నది.

**సర్వభూతములకు సఖుడును బ్రహ్మభూ**
**తాత్ముఁడు నిర్వైర్యుఁడయిన బ్రహ్మ**
**సుతుని తేజంబంతఁ జూడ దుస్సహమైన**
**భయమంది వడకుచు భద్రకాళి**
**క్రోధంబు ముమ్మడి గొనఁగ హూంకారంబు**
**సలుపుచు నట్టహాసంబు సేసి**
**పాపాత్ములను దౌష్ట్యపరులును రాజస**
**తామస కర్మసంధానులగుచు**

**విప్రవరునట్లు హింసించు వృషలపతిని**
**భృత్య వర్గంబుతోఁ దలల్ పృథ్విఁ గూల్చి**
**యిపుడు వృషలాధిపతిని శిరమంది లీల**
**బాడి యాడుచు నందంద క్రీడసలిపె** **(1.134)**

## భూదేవి

భాగవతం దశమ స్కంధం ఉత్తరభాగంలో 202, 205 పద్యాలలో భూదేవి సంస్మరణముంది.

శ్రీకృష్ణుడు లోకకంటకుడయిన నరకాసురుని సంహరించాడు. నరకుడెవరో కాదు వరాహావతారంలో భూదేవికి జన్మించినవాడు. హిరణ్యాక్షుని జతగా పుట్టినవాడు కనుక అతనిలో రాక్షసత్వమే

ఆవహించింది. నరకసంహారంతో దేవతలు సంతోషించారు. ఆ సందర్భంలో నరకుని కుమారుడు భగదత్తుడు తన్ను కూడా సంహరిస్తారేమోనని భయపడ్డాడు. అపుడు భూదేవి దేవతలను వేడుకోవడానికంటె దేవాధిదేవుని వేడుకోవడం మంచిదనుకొంది. భూదేవి శ్రీకృష్ణునికి బంగారపు రత్నకుండలాలను, వైజయంతీ నామక రత్నమాలను, వరుణుడిచ్చిన తెల్లగొడుగును, ఒక మహారత్నాన్ని సమర్పించింది.

'స్వామి! నీవు దేవాధిదేవుడవు. సృజియించడానికి రజోగుణాన్ని, రక్షించడానికి సత్త్వగుణాన్ని, సంహరించడానికి తమోగుణాన్ని ధరిస్తావు. నీవే కాలమూర్తివి. ప్రధాన పురుషుడివి. నేను, వారి, వహ్ని, అనిల, ఆకాశ, భూతతన్మాత్రలు, ఇంద్రియాలు దేవతలు, మనస్సు, కర్త, మహత్త్వం, చరాచరవిశ్వం నీయందే పుట్టినవారం? అంటూ దైన్యంగా

**దయ నిటు సూడుమా! నరకదైత్యుని బిడ్డఁడు వీఁడు నీ దెసన్**
**భయమున నున్నవాఁడు గడు బాలుఁ డనన్యశరణ్యుఁ డార్తుఁ డా**
**శ్రయరహితుండు, దంద్రిక్రియ శౌర్యము నేరఁడు నీ పదాంబుజ**
**ద్వయిఁ బొడగాంచె భక్తపరతంత్రసువీక్షణ! దీనరక్షణా (10.2.204)**

ఈ సన్నివేశం స్త్రీ హృదయానికి స్పందనకు పరాకాష్ఠ. కొడుకును కన్నది కాని అతని చేతలు నచ్చలేదు కనుక నరకాసురసంహారం ఆమెకు అనంతదుఃఖాన్ని కలిగించలేదు. ఉన్న ఒక మనుమని రక్షించుకోవాలన్నదే ఆమె తపన. ఇదొక మహత్తరమయిన గుణము.

## సరస్వతి

పరీక్షిత్తు శుకమహర్షిని 'సర్వేశ్వరుడు ఏ శక్తుల సాయంతో బ్రహ్మేంద్రాది రూపాలను దాల్చి వినోదించాడు? ఈ జగత్తును ఏరీతిగా

సృష్టిస్తూ, రక్షిస్తూ సంహరిస్తున్నా?'దని ప్రశ్నించాడు. అందుకు శుకమహర్షి తన మనసులో భగవంతుని ప్రార్థించి ఇతరాంశాలతోబాటు సరస్వతికి సంబంధించిన వృత్తాంతం (2.67) చెప్పాడు.

భగవానుడు బ్రహ్మచేత సృష్టికార్యం జరగాలని ఆశించాడు. సరస్వతిని బ్రహ్మకడకు పంపాడు. ఆ తల్లి బ్రహ్మను పతిగానే భావించింది. లోకసామ్రాజ్యంలో బ్రహ్మను సృష్టినిపుణునిగా చేసింది అని ఒకచోట కథనం. రెండవ కథనం క్షీరసాగరమథనసన్నివేశంలో వరుణాదులు లక్ష్మికి ఉచిత వస్తువులను వారి వారి తాహత్తుకనుగుణంగా చదివిస్తుండగా భారతి ఆ సమయాన ఒక మంచి తారహారం ఇచ్చింది. ఇంతకంటె భాగవతకథలో సరస్వతి అస్తిత్వం కనబడదు. పోతన భాగవతం ఆదిలో ఇష్టదేవతాస్తుతిలో 'క్షోణితలంబునన్ నుదురు సోకగ మ్రొక్కి నుతింతు' అంటూ ఆ తల్లి అందచందాలను జోడించి 'తోయజాత భవచిత్త వశీకరణైకవాణికిన్' అని సభక్తికంగా చేతులు జోడించాడు.

* * *

# 2. దివ్యమహిళలు

మహావిష్ణువు అవతారాలను కీర్తించే గ్రంథం భాగవతం. భాగవతంలో భక్తికే ప్రాధాన్యం. భాగవతంలో ప్రస్తావితమయిన పాత్రలలో విభిన్నులెందరో ఉన్నారు. వారిలో దివ్యాంగనలు స్మరింపదగ్గవారు. అదితి, కృతద్యుతి, దేవయాని, సతీదేవి, సీత, సురుచి, సునీతలు ప్రముఖులు. వీరందరు దివ్యులు. దివివాసజులు. కనుక వీరిని దివ్యమహిళలుగా సంభావించడం సబబు. వీరి వృత్తాంతాలలో స్త్రీల మనస్తత్వం రకరకాలుగా ఆవిష్కృతం.

### అదితి

మహాభాగవతంలో గుర్తించదగ్గ దివ్యాంగనలలో 'అదితి' ఒకతె. ఈమె కశ్యపప్రజాపతి భార్య. అదితి సంతానమే దేవతలు. అదితి తన సంసారాన్ని భోగేచ్ఛతోగాక, యోగేచ్ఛతో గడపడంవలన తామసగుణ రహితులయిన దేవతలు జన్మించారు. దేవదానవుల యుద్ధంలో ఒకసారి జయం దేవతలది. మరొకసారి దానవులది. ఇలాంటివేళ దైత్యుల దురాగతాలను విని దేవతల తల్లి అయిన అదితి హడలిపోయేది.

ఒకసారి బలిచక్రవర్తి విజృంభణానికి తట్టుకోలేక దేవతలు పారిపోయారని కాందిశీకులయ్యారని తెలిసి తల్లిగా అదితి రోదించింది. ఇది లోకసహజం. అయినా దేవతలకు తండ్రి, తనకు పతియైన కశ్యపునితో తన మనోవ్యథను ప్రకటించుకోవాలని మనసులో అనుకున్నది. సరిగ్గా అదే సమయంలో తపస్సుకోసం అరణ్యప్రాంతాలకు వెళ్ళిన కశ్యపుడు రానే వచ్చాడు. చాలాకాలం తరువాత గృహసీమకు చేరుకొన్న కశ్యపుడు యజమానిగా 'అదితీ! బాగున్నావా! విప్రులు వేదాధ్యయనం సరిగా చేస్తున్నారా? దేవతార్చనలు సాఫీగా జరుగుతున్నాయి

కదా! కుమారులు ధర్మమార్గంలో నడుస్తున్నారా! మన ఇంటి సేవకులు తమ తమ విధుల్ని సక్రమంగా చేస్తున్నారా? మన ఇంటికి వచ్చే సుజనులకు ఎలాంటి అసౌకర్యము కలగలేదు గదా! యాచకులు మన ఇంటికి వచ్చి సంతృప్తులై పోతున్నారు కదా! అదితీ! నీ కోడండ్రు ఎదురు తిరగడం లేదు కదా! సౌమ్యులై వున్నారు కదా!' అని ప్రశ్నించాడు.

కశ్యపమహర్షి ప్రశ్నావళిని ఆకళించుకొన్న అదితి తన భర్తకు ఇక్కడ ఇటీవల జరిగిన సోదరుల మధ్య కలహాలు, దైత్యులు పడినబాధలు ఏవీ తెలియవని గ్రహించింది. ఆ కారణాన సమస్తమూ నివేదించాలనుకొంది.

'హృదయేశ్వర! ఇంటి సంగతులటుండనీ! అంతకంటె మీకు తెలియవలసిన అనేకాంశాలున్నాయి. దైత్యులు మీరు లేనివేళ రెచ్చిపోయారు. దేవేంద్రాది దేవతలతో కయ్యానికి కాలుదువ్వారు. పైగా మనల్ని అడిగేవారు ఎవరని దౌర్జన్యంతో అమరావతిపై దండెత్తి ఆధీనం చేసుకొన్నారు. మన పిల్లలు గుట్టకొకరు, పుట్టకొకరుగా చెదరిపోయి ఎక్కడెక్కడో దాక్కొన్నారు. చివరకు విధిలేక కొందరు అజ్ఞాతంలోకి వెళ్ళిపోయారు. దానవులకు విజయం దక్కడంతో దానవుల తల్లి, నా సవతి దితి నన్ను హేళనగా చూస్తున్నది. ఈ బాధ భరించలేను. అనరాని మాటలతో అస్తమానమూ వేధిస్తున్నది. అన్నిటికన్నా నా కోడలు సాధ్వి శచీదేవి ఎండకన్నెరుగని ఎలనాగ పరుల పంచబడింది. స్వర్లోకాధిపతియైన దేవేంద్రుడు అడవుల పాలయ్యాడు. నా మనుమడు జయంతుడు దిక్కు తెలియనివాడయి చెంచుపిల్లల వెంట వెళ్ళిపోయాడు. నిర్వక్రంగా బలిచక్రవర్తి పాలన సాగిస్తుంటే ఇంద్రుడు నిస్సహాయుడయి చతికిలపడ్డాడు. మహాత్మా! దేవతలు, దానవులు నీ బిడ్డలేకదా! ఇంటి పెద్దగా మీరు పరిస్థితులను చక్కజేయలేరా? దుష్టస్వభావులయిన దానవుల్ని దండించలేరా! సర్వస్వం అన్యాక్రాంతం కాగా అలమటిస్తున్న దేవతల్ని ఆదుకోరా? మరల వారిని అమరావతీవాసులుగా చేయలేరా? ఈ

సత్కార్యం కొనసాగడానికి ఉపాయం ఆలోచించలేరా' అని కన్నీళ్ళతో తన వేదనను విశదం చేసింది.

కశ్యపుడు సాంతం శాంతంగా విన్నాడు. తపోదృష్టితో తాను లేనివేళ జరిగిన సంఘటనలన్నీ అవగతమయ్యాయి. ఇది తన చేయి దాటిపోయిన వ్యవహారమని కశ్యపుడు అర్థం చేసుకున్నాడు. తనమీద భరోసా పెట్టుకొన్న భార్య అదితితో

'సౌభాగ్యవతీ! ఇదంతా మాయ. వీటన్నిటికీ మోహబంధమే కారణము. నీవు దిగాలుపడకు. దేవతలకు, ఆర్తులకు సర్వదా రక్షకుడు హరి ఒకడే. ఆ స్వామిని ఆరాధించు. ఆ జగన్నాథుడు ప్రసన్నుడై అన్నీ చక్కపెడతాడు' అని ఆశ్వాసించాడు.

'అదితీ! విను. పయోభక్షణమనే వ్రతం చేబట్టు. అందుకు తగిన సమయం ఫాల్గుణమాసం శుక్లపక్షం. ఈ వ్రతాన్ని 12 రోజులు నియమబద్ధంగా ఆచరించు. విష్ణువు తప్పక నిన్ను అనుగ్రహిస్తాడు.' అని సూచించాడు.

అదితి కశ్యపుని ఆజ్ఞను శిరసావహించి వ్రతం చేబట్టింది. స్థితికారకుడయిన శ్రీమహావిష్ణువు ప్రత్యక్షమయ్యాడు. 'అదితీ! నీకోరిక ఏమిటో చెప్పమ్మా' అని ప్రశ్నించగానే అదితి

**అసుర వీరులు సురల నడలించి బెదరించి**
**నాక మేలుచున్న నాటినుండి**
**కన్న కడుపుగాన కంట ఁగూరుకు రాదు**
**కడుపు ఁబొక్కు మాన్చి కావుమయ్య**

అని దైన్యాతిదైన్యంగా అదితి ప్రార్థిస్తుంటే ఆశ్రితకామధేనువయిన ఆ పరంధాముడు చిరునవ్వులొలికే మొగంతో

'అదితీ! నీ మగడు, నీ కుమారులు, నీ కోడండ్రు అందరు సంతోషించేలా మీ సంతతికి సదా ఇబ్బందులు కలిగించే రాక్షసులు బాధపడేలా "భవదీయ గర్భమునఁ దేజోమూర్తిగ" నేను జన్మిస్తాను. రాక్షసులను వినయోపాయంతోనే జయించాలి. ఇంతకంటె మరోమార్గం లేదు. శచీంద్రులు సంతోషపడేలా 'అమరావతిని' వారికి ఇస్తాను. నీవు నా రూపాన్ని స్మరించు. నీ రమణుని స్మరించు. తప్పక నేను పుత్రునిగా నీ కడుపున జన్మిస్తాను. అన్నీ చక్కబడతా'యని అనుగ్రహించి మాయమయ్యాడు. అదితి తన వ్రతం ఫలప్రదమయిందని మనసా సంతోషించింది.

కశ్యపుడు సమాధిలో ఉండగా హరి అంశం తనయందు ప్రవేశించగా తన వీర్యాన్ని గాలి అగ్నికర్రలో చేర్చినట్లు అదితి గర్భాన చేర్చాడు. ఆ కారణంగా అదితి గర్భవతి అయింది. ఆ గర్భం పెరుగుతుంటే గర్భస్థుడయిన హరిని దేవతలు స్తుతించారు. నెలలు నిండగా అదితి కుమారుని కన్నది. అదితి ఆనందంతో పరవశించి

**నన్నుఁగన్న తండ్రి! నా పాలి దైవమా!**
**నా తపఃఫలంబ! నా కుమార!**
**నాదు చిన్న వడుగ! నా కులదీపక!**
**రాగదయ్య భాగ్యరాశి వగుచు**

**అన్న రమ్మని దగ్గఱ**
**చన్నుల పాలేఱువార సంశ్లేషిణియై**
**చిన్నారి మొగము నివురుచున్**
**గన్నారం జూచెఁ గన్న కొడుకై యుండన్**

ఆ సందర్భంలో పుణ్యాంగనలు ఆ అదితికి లక్ష్మీపార్వతులే సమానులన్నారు.

ఈ అదితి వృత్తాంతంలో జనాళికి ఎన్నో సందేశాలున్నాయి. బహుభార్యాత్వం ప్రబలంగా ఉన్న రోజులలో ఒక సాంసారికస్త్రీ ఎవరితో చెప్పుకోవాలో సూచించే సన్నివేశం. ఏ తల్లికయినా పిల్లలు ఎదిగిన వారయినా, వారి జీవితాలలో కష్టనిష్ఠూరాలు ప్రబలంగా వున్నా బాధపడడం, తనకు తోచినరీతిగా సహాయపడడానికి సిద్ధపడడం అదితిలో కనిపిస్తుంది. తన పతి కారణాంతరాలవలన నిస్సహాయుడని తెలిసినా అతని మాటలకు విలువిచ్చి వ్రతం చేయడం గుర్తింపదగ్గది. లోకంలో తమ పిల్లలకు ఏదయినా కష్టాలువచ్చినా ఆచరించవలసిన 'వ్రతం' చెప్పడం ఈనాటికీ తగు, సర్వేశ్వర చింతనా ధ్యానం సర్వకష్టాలకు నివారకమనే ఆధ్యాత్మిక ఉపదేశం గుర్తింపదగింది. ఎవరికయినా ఎంతమంది పిల్లలున్నా పుట్టిన మరొక బిడ్డపై మమకారం సహజం. కనుకనే అదితి సాక్షాత్ విష్ణువే పుత్రుడై పుట్టినా ఆ బిడ్డను ఆప్యాయంతో చూస్తూ ఆలనపాలన చూడడం విశేషం.

## కృతద్యుతి

కృతద్యుతి వృత్తాంతం భాగవతం ఆరవ స్కంధంలో ఉంది. చిత్రకేతు భార్యలలో కృతద్యుతి ఒకతి. చిత్రకేతువుకు ఎంతమంది భార్యలున్నా సంతానభాగ్యం లేదు. అంగిరసుడు నిర్వహించిన పుత్రకామేష్టివలన కృతద్యుతికి మాత్రం సంతానం కలిగింది. కుమారోదయంతో చిత్రకేతు కృతద్యుతి అంతఃపురానికే పరిమితుడయ్యాడు. ఇదే సవతులకు ఈర్ష్యాకారణమయింది. ఈ మోహంబునకుం గారణంబు పుత్రుండయని యీర్ష్యం జేసి దారుణచిత్తయై పుట్టిన శిశువుకు దయమాలి విషం పెట్టారు. ఆ విషంతో బాలుడు చనిపోయాడు. బాగా నిదరోతున్న బిడ్డలా కనిపించాడు. దాది మరుసటిరోజు బిడ్డ దగ్గరికి వెళితే వికృతాకారుడయిన బిడ్డను చూచి విస్మయశోక భయార్తయై

పుడమింబడి యాక్రందించినదట (6.440) దాది గొల్లున ఏడుస్తుంటే కృతద్యుతి పరుగుపరుగున వచ్చి కానక కన్న సంతానం, వంశకర్త, తపసి వరంవల్ల పుట్టినవాడు మిన్నకుండడం చూచి గగ్గోలు పెట్టింది. పుత్రమరణదుఃఖంతో రోదించింది. రాజు కూడా అక్కడికి వచ్చి 'నా బతుకు ఇంకెలాగో నీ తల్లి దుఃఖాన్ని చూడరా' అని పలవించడం మొదలెట్టాడు. ఈ ఆర్తరావానికి అక్కడవారంతా 'అయ్యో' అన్నారు. అపుడు అంగిరసుడు అక్కడికి రానేవచ్చాడు. రాజును చూచి 'ఈ బాలుడు నీకేమవుతాడు! మీరెందుకు బాధపడుతున్నారు' అని ఆశ్వాసించాడు చివరకు మృతశిశువును ఆదేశించినా ఫలితం లేకపోయింది.

ఈ వృత్తాంతంలో కొన్ని సందేశాలున్నాయి. బహుభార్యాత్వమున్న రోజులలో స్త్రీలు ఎలా జాగ్రత్తపడాలో అని ఒక సందేశం. ఈ రోజులలో గిట్టనివారు ఇలాంటి అకృత్యాలు చేయడం చూస్తూనే వున్నాం. స్త్రీల ఈర్ష్యాప్రవృత్తులు ఎలా ఉంటాయో అర్థం చేసుకోవలసిన కథ. అన్నిటికంటె ఎవరికి ఎవరూ కారనే సత్యాంశం.

**దితి**

దక్షప్రజాపతి కూతురు దితి. ఈమె కశ్యపుని భార్య. దితికి సంతానకాంక్ష కలిగింది. ఒకరోజు సాయంత్రం మదనతాపాన్ని అణచుకోలేక భర్త కశ్యపుని దగ్గరికి వచ్చి తన కోరికను బాహ్యంగానే చెప్పింది. అది సాయం సంధ్యాసమయం. కశ్యపుడు సాయంసంధ్యా విధులను పూర్తి చేసుకొని యాగశాలముందు విశ్రమించివున్నాడు. దితి తనకోరికను వ్యక్తం చేసినపుడు మొదట మౌనంగానే వున్నాడు.

కాని దితి 'నాథా! మదాతిరేకంతో ఏనుగులు అరటిబోదెల్ని ఊపినట్లుగా మదనుడు నన్ను నా మనస్సును కకావికలు చేస్తున్నాడు. నేనుండలేకపోతున్నాను. పతి పొందుకోసం నా దేహం తపిస్తున్నది.

అంచేత ప్రభుత్వ మెలర్పగ నన్ను కావవే' అని కామదృష్టితో చూచింది. అంతటితో ఊరుకోక 'నాథా! నా సవతులందరు సంతానవంతులయ్యారు. వారి సంతోషానికి పట్టపగ్గాలు లేవు. సంతానంలేని కారణంగా వారిలో సమానురాలిగా మెలగకపోతున్నాను. నా బాధను అర్థం చేసుకోండి. మీలాంటివారు ఆర్తుల కాంక్షలను రిత్తచేయరు కదా!' అన్నది. ఆపై మహానుభావా!

**పతిసమ్మానము వడసిన,**
**సతులకు నభిమతపదార్థసంసిద్ధియు నూ**
**ర్జితయశముఁ గలిగి లోక**
**స్తుతమై చెలువారుచుండుఁజువ్వె మహాత్మా! (3.454)**

భర్తయే తన ఇల్లాలికి కూడా తానే పుడతాడు. ఒక దీపం మరొక దీపాన్ని వెలిగించినట్లు పతియే సుతరూపంలో జనిస్తాడు. వేదం కూడా 'ఆత్మా వై పుత్ర' అని సుస్పష్టం చేసింది. కనికరంతో కాపాడు. స్వామీ! లోకంలో తండ్రులకు తాను కన్న కూతుళ్ళపై అనురాగం ఎక్కువ కదా. ఒకరోజు అందరిని పిలిచి 'మీ మనోహరు నెఱిగింపు డిత్తు కమలాననలారా! అని అడిగితే మా అక్కాచెల్లెళ్ళలో పదముగ్గురమయిన మేము నిన్నే ఇష్టపడడం మీకు తెలుసు.' ఇలా మాటలు పొడిగిస్తూ తన కామవాంఛను పదేపదే కశ్యపునికి అర్థమయ్యేలా సల్లాపాలు కొనసాగిస్తుంటే కశ్యపుడు కరిగిపోయాడు. అతడు కూడా ఉల్లాసంతో

'నిజమే, ధర్మార్థకామాలు భార్యవల్లనే సమకూరుతాయి. నావికుడు తన నావ చేతనే తరించేలా గృహస్థుడు సంసారయాత్ర కొనసాగిస్తాడు. భార్య అర్థభాగస్వామిని. ఇంటిబాధ్యతల్ని చూసుకొనేది ఇల్లాలే కదా! దుర్గాధిపతి తన విరోధుల్ని మట్టుపెట్టేలాగా భార్యాసహితుడయిన భర్త ఇంద్రియశత్రుత్వాన్ని అవలీలగా జయిస్తాడు. ఈ విజయానికి అన్నివిధాల

సహకరించేది భార్యయే కదా! ఎన్ని జన్మలెత్తినా భార్యామణి చేసే సేవలకు ప్రత్యుపకారం భర్త చేయలేడు. 'నీవు ఏడవవద్దు. నీ సంతానవాంఛను నేను కాదనలేను. కులశీలవర్తనముగల నిన్ను మానసికంగా హింసించడం న్యాయంకాదు. అయినా ఒక ముహూర్తకాలం ఉండలేవా. ఇది సంధ్యాకాలం కదా! ఈ సంజెవేళ మహేశ్వరుడు ప్రమథగణం సేవింపగా ఎద్దునెక్కి సంచరిస్తాడు. ఎన్నివిధాలుగా ఆలోచించినా సంగమానికి సరిసమయం కాదు. ఇది నిషిద్ధకర్మ. ధర్మాన్ని అతిక్రమించడం ఎందుకు. ఇటుచూడు. నీ మఱది శివుడు శ్మశానవాటికలో వీచే సుడిగాలికి లేచిన దుమ్మంతా అంటుకోగా నలుపు ఎరుపు కలిగిన రంగుతోడి జడలతో ఒంటినిండ అలదుకొన్న బూడిదతో నేడు మరీ భయంకరుడుగా కనిపిస్తున్నాడు. ఆతడే సూర్యచంద్రాగ్నినేత్రాలతో విప్పారిన రెప్పలతో చూస్తున్నాడు. మఱది చూస్తుండగా సంగమం మంచిది కాదు. నీ మఱది సామాన్యుడని అనుకోవద్దు. సమదృష్టికలవాడు. త్రిజగత్పావనుడు. నిఖిలైకనేత భగవంతుడని నీకు తెలియదా? నాలాంటివారు మాయా విదూరులం. ఆ మాయకూడా ఆ పరమేశ్వరుని పాదసేవకు తహతహలాడుతుంది. లోకంలో అవివేకులు కుక్కలు తినదగినది మరియు ఇహపరాలకు దూరమయిన శరీరం ఉత్తమమైనదిగా భావిస్తారు. దానికి మాలలు, దుస్తులు, అలంకారాలు, ఆభరణాలు తొడుగుతారు. శరీరమే ఆత్మ అనేదానికి పైపైకి మెరుగులు దిద్దుకొనేవారందరు గొప్ప దౌర్భాగ్యులని తెలుసుకో' అని ఆవిడలో శారీరకసౌఖ్యాలపై రోతపుట్టేవిధంగా చెప్పినా ఆవిడలో మార్పురాలేదు. వెనువెంటనే ఆమె కామాతురతతో కశ్యపుణ్ణి కావలించుకొంది. ఇక లాభం లేదని కశ్యపుడు పరమేశ్వరునికి దండంపెట్టి రహస్యంగా ఆవిడ కోరినట్లు సంగమించాడు. ఆపై చేసిన తప్పుకు పరిహారంగా సత్త్వగుణోపేతము, సనాతనమూ అయిన గాయత్రీమంత్రాన్ని జపించాడు. దితికూడా చేయరాని పని

చేసినందుకు సిగ్గుపడుతూ తలదించుకొని పరమేశ్వరుని వలన ఏ ఉపద్రవం ముంచుకు వస్తుందేమోనని భయపడుతూ

'స్వామీ! నేను తప్పు చేశాను. ఆ పరమేశ్వరుడు మన్నించి నా గర్భాన్ని కాపాడు గాక!' అని స్వామి గుణగణాలను కీర్తిస్తూ చివరకు తన ఆదేశాలను పాటించే స్త్రీలను రక్షించేవాడని చెబుతూ 'మా సోదరి సతీదేవికి మగడు కదా. ఆయనే నన్ను రక్షించాలి' అని స్వామిని ప్రార్థించింది. అంతవరకు దితికి సంతానం లేదు కనుక పిల్లలు పుడతారని సంతోషపడింది. సాయంకాలం కశ్యపుడు సంధ్యావందనం చేశాడు. కాలం గడిచేసరికి దితి గర్భవతి అయిందని తెలిసినా సంతోషపడలేదు. తన చేతకు నొచ్చుకొంటూ దితితో 'నీవు పతివ్రతవే! అయినా అనుచితమయిన కాంక్ష కోరావు. వేళకాని వేళ ఒక వేశ్యలాగా ప్రవర్తించావు. ఇది నీ దౌర్భాగ్యం. సాధ్వీ! నీకు ఇద్దరు పుత్రులు పుడతారు. వారే భద్ర, అనుభద్రులు. వారు మంచివారననుకొనేవు. భూతగణ ప్రేరితులయి పిశాచగుణాలతో ప్రేరితులయి అతిశౌర్యవంతులయి ఉంటారు. దర్పోద్ధతులై బుధజనపీడాపరులయి దుష్కర్ములై జీవిస్తారు. దేవతల మ్రొక్కులు విని శ్రీహరియే వారిని సంహరిస్తా'డని చెప్పాడు. ఈ మాట వినగానే దితి చలించింది. అయినా తమాయించుకొని 'శ్రీహరిచేత నిహతులు కావడం శుభకరమే కదా' అని భర్తతో అంది. అపుడు కశ్యపుడు 'నీవు చేసిన విపరీతకర్మ వల్లనే ఇలా జరిగింది. ఇక తాపమెందుకు! మాధవుపాదసరోజయుగ్మచింతనముతో కాలం గడుపు'. అయినా శ్రీహరిస్మరణం కారణంగా ముకుంద పదసరోజాత విన్యస్తభావుడైన కుమారుడు హిరణ్యకశిపునికి పుడతాడు. అగ్నిశుద్ధివలన బంగారం స్వచ్ఛంగా వెలిగినట్లు రాక్షసవంశాన్ని అతడు పవిత్రం చేస్తా'డని దితిని ఓదార్చాడు. కశ్యపుని భావి ఉదంతం తెలిశాక ఒకవైపు దుఃఖం మరోవైపు సంతోషంతో దితి మథనపడింది.

ఈ వృత్తాంతంలో మానవాళికి ఎన్నో సందేశాలున్నాయి. లోకంలో పెళ్ళి అయ్యాక చాలా కాలం గడచినా సంతానం కలగలేదనే వ్యథ ఈ రోజుల్లో ఉన్నట్లే ఆ రోజుల్లోను లేకపోలేదు. కాని దితి తనలో కలిగే వికారాలను అధిగమించలేకపోయింది. సంధ్యాకాలసంగమం అనర్థమనడాన్ని వైజ్ఞానికులు అంగీకరిస్తారు. పాపక్షాళనానికి గాయత్రి ఉపాసన ఒకటే అనే ప్రబోధం ఈ వృత్తాంతం ద్వారా తెలుస్తున్నది. సంసారాన్ని యోగంతో నడపాలిగాని భోగంతో నడపరాదని ఒక సందేశం.

## దేవయాని

భాగవతం నవమ స్కంధంలో శర్మిష్ఠ, దేవయాని వృత్తాంతాలున్నాయి. వృషపర్వుడు రాక్షసరాజు. అతని కూతురు శర్మిష్ఠ. ఆ మహారాజు ఆశ్రయంలోనే శుక్రాచార్యులుండేవారు. ఆయన కూతురు దేవయాని. శర్మిష్ఠదేవయానులు ఎలాంటి భేదం లేకుండా కలిసిమెలసి వుండేవారు.

ఒకసారి శర్మిష్ఠ, దేవయాని మరి ఇతర సఖులతో ఉద్యానవనానికి వెళ్ళారు. అక్కడి క్రీడాసరస్సులో హాయిగా జలకమాడారు. సరిగ్గా ఆ సమయంలోనే పార్వతీపరమేశ్వరులు ఆ వంకకు వచ్చారు. వీరిని చూచిన శర్మిష్ఠ, దేవయాని కొలనునుండి పైకివచ్చి చీరలు కట్టుకోవాలని అనుకొన్నారు. చీరల ఎంపికలో ఒక పొరబాటు జరిగింది. శుక్రాచార్యుల కూతురయిన దేవయాని తెలియక శర్మిష్ఠ చీర కట్టుకొంది. ఈ దృశ్యం చూచిన రాజకూతురు శర్మిష్ఠ కస్సుమంది. కులగురువు తనయ దేవయాని తానేం తక్కువ అని పరస్పరం వాదులాడుకొన్నారు.

దేవయాని శర్మిష్ఠతో 'నన్ను తక్కువగా లెఖ్ఖపెట్టకు. మేము బ్రాహ్మలం. వర్ణాలలో మేము అగ్రజాతులం. ఇతరులంతా మాకు సేవకులే. బ్రాహ్మణులకు సేవచేయడం తప్పుకాదు. పోవే 'సేవికా' అని సంబోధించింది.

'ఏమనుకొన్నావు. నా తండ్రి శుక్రాచార్యులు నీ తండ్రికి కులగురువు. అంచేత నీ తండ్రి శిష్యుడు. నీవే నన్ను గౌరవంతో చూడాలి. రాజాహంకారంతో నన్ను అవమానపరుస్తావా?' అంది.

'ఏమిటే మా ఆశ్రయంలోనిదానివి ఇలా అనడం న్యాయంకాదు'. అంటూ శర్మిష్ఠ వెన్వెంటనే కలహానికి కారణమయిన దేవయాని చీరలాగేసి నూతిలో తోసేసి చక్కాబోయింది. ఆ సమయంలోనే యయాతిరాజు నూతిలోపడ్డ దేవయాని కేకలు విని తన ఉత్తరీయాన్ని ఆవిడకందేలావేసి నూతినుండి పైకిలాగి సేదతీర్చి అభయమిచ్చాడు. దేవయాని బ్రతుకుజీవుడా అనుకొంది. అంతటితో ఊరుకోక దేవయాని ఆపై సంతోషంతో 'మహారాజా! నా కుడిచేతిని పట్టుకొని మీరు నన్ను బావినుండి బయటికి లాగారు. అంటే పాణిగ్రహణం చేశారు. మీరే నా పతివి. పద్మాలలోని మకరందాన్ని త్రాగిన తుమ్మెద వేరే పూలజోలికి ఎందుకు పోతుంది.' అంటూ తన పరిచయం చేసుకొంది.

యయాతి ముందు నివ్వెరపోయినా ఆపై సమాళించుకొని ఇదంతా ఈశ్వరసంకల్పమని బ్రాహ్మణాంగనను తనదానిగా చేసుకొన్నాడు. ఆపై దేవయాని తన ఇంటికేసి నడిచింది. తండ్రి శుక్రాచార్యులతో జరిగినదంతా పూసగుచ్చినట్లు చెప్పింది. బావురుమని ఏడ్చింది. శుక్రాచార్యుడు సందిగ్ధంలో పడ్డాడు. చివరికి ఒక రాక్షసరాజును ఆశ్రయించడంవల్ల కదా ఈ అవమానమని ఆలోచించి దేవయానితో ఊరువదలి మరోచోటుకి వెళ్ళడానికి సిద్ధపడ్డాడు. ఈ విషయం తెలిసిన రాజు వెంటనే శుక్రాచార్యుల దగ్గరికి వచ్చాడు.

'ఆచార్యవర్యా! మీరు నన్ను వదలి వెళ్ళాలనుకోవడం నాకు సుతరామూ ఇష్టం లేదు. ఆడువారి మధ్య కలహాలు మగవారిని బాధించడం సహజం. మీరు ఒకసారి ఆలోచించుకొని మీ నిర్ణయం

మార్చుకోండి' అని పాదాలపడి వేడుకొన్నాడు. అపుడు శుక్రాచార్యులు తన కూతురు దేవయాని శాంతించడంకోసం 'రాజా! నీవు నీ కూతురు శర్మిష్ఠను నా కూతురు దేవయానికి దాసిగా ఆదేశించు. ఈ నియమానికి కట్టుబడితే నేను నీ కోరికను సరేనంటా' నన్నాడు. వృషపర్వుడు తన రాక్షసకులానికి అండగా రక్షిస్తున్నాడు కదా అని 'సరే'నన్నాడు. శర్మిష్ఠ దేవయానికి దాసి అయింది. తదనంతరం యయాతి దేవయానుల కల్యాణమయింది. కాలం గడిచిపోయింది. యయాతీ దేవయానులకు సంతానం కలిగింది. వారే యదుతుర్వసులు. కాలం గడచిపోతూ వుంది.

ఒకరోజు శర్మిష్ఠ యయాతిని ఏకాంతంలో కలిసింది. 'రాజా! నేను రాక్షసరాజు కూతుర్ని. గారాబంగా పెరిగినదాన్ని. విధివశాన నేను దాసినయ్యాను. మీ అందచందాలకు గాంభీర్యానికి దాసురాలిని. నేను మీ పరివారంలోనిదాన్నే. నిండుజవ్వనంలోని నన్ను మీరేలుకోండి' అని సిగ్గువిడిచి చెప్పింది. రాజు శర్మిష్ఠను, మిసమిసలాడే ఆమె అందచందాలను చూచాడు. కోరివచ్చిన కామరాలు కదా అని ఆమెను అనుభవించాడు. చాటుమాటుగా జరిగిన వ్యవహారంలో శర్మిష్ఠ కూడా సంతానవతి అయింది. ఇవన్నీ తెలిసిన దేవయాని తన తండ్రితో సర్వం చెప్పాలని బయలుదేరింది.

అపుడు యయాతి దేవయానితో 'ఈ వ్యవహారం ఆచార్యుల చెవినిబడడం ఎందుకు! జరిగినదేదో జరిగిపోయింది. శర్మిష్ఠ వలచివచ్చిన యువతి. అందుకే నేను శర్మిష్ఠను ఏలుకొన్నాను. నీకు నేను అన్యాయం చేయలేదు. విను' అని బతిమిలాడాడు. కాని బుసకొడుతున్న దేవయాని యయాతిచర్యను తేలికగా తీసుకోదలచక ఆచార్యవర్యులకు 'లో వ్యవహారమంతా' చెప్పింది. దేవయాని పట్ల పుత్రికావ్యామోహంతో యయాతితో

'నీవు వనితాజనహేయంబైన ముదిమిం బొందెదవు' అని శపించాడు. ఆ సమయంలో యయాతి ఆచార్యులతో

'మామా! నేను దేవయానికి తక్కువ ఏదీ చేయలేదు. నాకు దేవయాని అంటే చాలా ఇష్టం. ఆమెతో ఇంకా కొన్ని సంవత్సరాలు గడపాలని వుంది. ఆపై మీ శాపంమేరకు 'ముదిమిని' అనుభవిస్తానన్నాడు. శుక్రాచార్యులు ఆలోచించి 'సరే'నన్నాడు. 'ఎవరయినా నీ ముదిమిని స్వీకరిస్తే నీవు యువకుడవై సుఖభోగాలు అనుభవించవచ్చు' అన్నాడు.

యయాతి సందిగ్ధంలో పడ్డాడు. ఎవరయినా ఆ ముదిమిని తీసుకొంటే వరిస్తే తాను మరల భోగాలను అనుభవించవచ్చు కదా అని తన కుమారులను అడిగాడు. వారిలో చివరకు శర్మిష్ఠ సంతానం 'పురువు' అంగీకరించాడు. తాను యువకుడై ఇష్టభోగాలు అనుభవించాడు. కాలం గడిచిపోతూ వుంది. కొంతకాలానికి యయాతికి భోగేచ్ఛ నశించింది. ఆపై పురూరవుడు అనుభవిస్తున్న ముదిమిని తానే గ్రహించాడు. తన మాటవిన్న పురూరవునికి రాజ్యం అప్పగించి అడవికి వెళ్ళి హరిధ్యానంలో మునిగాడు.

ఈ వృత్తాంతంలో సమర్థనీయమయిన అంశాలున్నాయి. అదే సందర్భంలో 'ఎబ్బెట్టు' అంశాలూ వున్నాయి. రాజసానికి బ్రాహ్మణ్యానికి మధ్య ఏర్పడ్డ కాలంనాటి కథ ఇది. రాజసం రాజీకి రావడంలో వింత ఏమీకాదు. రాక్షసకులం బతకాలంటే సంజీవనీవిద్యగల శుక్రాచార్యుల అనుగ్రహం అవసరం. కులక్షేమం కుమార్తె క్షేమంకంటె గొప్పదనుకోవడం రాజకీయవ్యూహమే. అలాగే ఇరువురు వనితల మధ్య రగడ వినతాకద్రువల కాలం నుండి వున్నదే.

మరొక్క అంశం. దేవయాని భగ్నప్రేమికురాలు. పైగా యువతి. తండ్రి తానేమి చేసినా అనడనే పిచ్చి ధైర్యముంది. బ్రాహ్మణులు కింది

జాతివారిని కోరడం తప్పుకాదనే ధర్మశాస్త్రమూ ఉంది. ఇది సకృత్తు మాత్రమే.

మరొక్కటి ఆడవారి నైజం. పాముయిన మరచిపోవును. భామ మరువంగ పోదు పగ ఎన్నటికిన్ అనే లోకవ్యవహారం ఉంది. తన్ను కాదన్న కచుని మించినవానిని పెళ్ళాడాను అని ఒకవైపు. తనపై పెత్తనం చెలాయించే శర్మిష్ఠను అన్నివిధాల అణచాననే మిథ్యాగర్వం మరోవైపు. మరి శర్మిష్ఠ కూడా తక్కువ తిన్నది కాదు. దేవయాని ఏరాజును పెళ్ళాడిందో అతనినే పెళ్ళాడడం దాసీత్వం లేదుగదా సవతీత్వం తెచ్చుకొన్నాననే ఆంతరంగిక సంతోషం. రాజయిన యయాతి తనకు పెళ్ళామున్నా భోగేచ్ఛాపరుడుకావడం పతనావస్థకు చేరుకొన్న 'మానవ నైజమే' అని ఎరుకపరచడం.

## దేవహూతి

దేవహూతి వృత్తాంతం భాగవతం ప్రస్తావితం. కృతయుగంలో బ్రహ్మదేవుడు ప్రజలను సృష్టించడానికోసం 'కర్దముని' ఆదేశించాడు. కర్దముడు తనకా బాధ్యత అప్పగించినందుకు సంతోషించి ఇదొక మహత్కార్యం కదా అని సరస్వతీ నదీతీరంలో పదివేల సంవత్సరాలు తపస్సు చేశాడు. ఒకదినం తపోనిష్ఠలో వుండి లక్ష్మీవిభుని ఆరాధించాడు. స్వామి ప్రత్యక్షమయ్యాడు. కర్దముడు స్వామిని నుతిస్తూ తనకు 'గృహమేధధేనువు, అశేషమూలము, త్రివర్గకారణము, సమానశీల అయిన ఒక యువతిని పరిణయం చేసుకోవాలని మనసా సంకల్పించాను' అన్నాడు. స్వామి 'తథాస్తు' అన్నాడు.

'కర్దమా! నీవు ఎక్కడికి వెళ్ళకు. నీ దగ్గరికే స్వాయంభువమనువు తన భార్య, తన కూతురితో నీ దగ్గరికి రానున్నాడు.' అని చెప్పి అంతర్ధానమయ్యాడు. స్వామి చెప్పిందే యథార్థమయింది. మనువు

భార్యతో, సుతతో వచ్చాడు. సరస్వతీ నదీతీరం చేరుకొని కర్దముని చూచి

**అమలినగృహమేధిక క,**
**ర్మములకు ననురూపగుణవిరాజితశీల**
**క్రమములఁ దనరిన తరుణిం**
**బ్రమదమున వరింపుమయ్య భవ్యచరిత్రా! (3.782)** అన్నాడు.

కర్దముడంతా విని

**'ఈ కన్యారత్నమునకు,**
**నాకును గుణరూపవర్తనంబులయెడ నా**
**లోకింప సమము కావునఁ,**
**గైకొని వరియింతు విగతకల్మషవృత్తిన్' (3.788)** అన్నాడు.

'అయితే నేను ఆవిడకు సంతానం కలిగేదాక సంసారం చేస్తాను. ఆ తరువాత సన్యసిస్తా'నన్నాడు. ఈ అంశాన్ని మనువు తన భార్య శతరూపతో చర్చించాడు. ఆపై దేవహూతి అభిమతం తెలుసుకొని విధ్యుక్తంగా వివాహం జరిపాడు. తల్లి తనకూతురికి 'పారిబర్హ'మనే పేరుగల వివాహోచిత దివ్యవస్త్రాలను, దివ్యాభరణాలను నూతన దంపతులకు బహూకరించింది. ఆపై శతరూపామనువులు వెళ్ళిపోయారు. కర్దమ దేవహూతులు దంపతులయి గార్హస్థ్యం సాగిస్తున్నారు.

పార్వతీదేవి పరమేశ్వరునికి సపర్య చేసినట్లు దేవహూతి కర్దమునికి సేవలు చేసింది. శరీరాన్ని పరిశుభ్రంగా, సౌందర్యవంతంగా ఉంచుకొంటూ చాతుర్యంతో ప్రేమతో భర్తనే భగవంతునిగా భావిస్తూ మృదుమధురంగా మాట్లాడుతూ అతనికి తగినట్లు మసలింది. తన్ను సేవించడంవల్ల సన్నబడిన దేవహూతిదేహిని చూచి ఆప్యాయంతో 'నీకు ఐశ్వర్యపరంపరలు కలుగుతాయి. నీకు దివ్యదృష్టిని ప్రసాదిస్తున్నాను'

అన్నాడు. దేవహూతి పతిదత్తవరంతో యోగమాయతో సర్వస్వం దర్శించింది. ఆ తరువాత ఒకరోజు పతి ప్రసన్నుడుగా ఉండేవేళ వివాహ సమయాన చేసిన వాగ్దానాన్ని గుర్తుకు చేసింది. అలాగే కామోపభోగ మందిరాలు, మోహోత్పాదక సుగంధద్రవ్యాలను ఆశించింది. కర్దముడు దేవహూతి కోరినవన్నీ సమకూర్చాడు. చివరకు బిందుసరోవరంలో తానం చేయమన్నాడు. దేవహూతి ఆ కొలనులో దిగగానే జలప్రవాహంలోని నవయౌవనలు ఆమె చుట్టూచేరి సేవలు చేయసాగారు. దేవహూతిని అలంకరించి ఆపై అద్దం చూపించారు. సంతృప్తిపడ్డ దేవహూతి అద్దంలో తన ప్రతిబింబం చూస్తూ కర్దముని తలచుకొంది. కర్దముడు రానేవచ్చాడు. ఇద్దరు దివ్యవిమానంలో సంచరించారు. మానససరోవరాన్ని, కుబేరుని చైత్రవనాన్ని వీక్షించారు. సమస్త భూమండలాన్ని చూస్తూ ఆపై స్వస్థానం చేరుకొన్నారు. ఇన్ని సౌకర్యాలతో తన్ను మురిపించిన మరపించిన కర్దమునితో నూరేండ్లు హాయిగా గడిపింది. కర్దముడు దేవహూతిని శారీరకసౌఖ్యంతో ఆనందపరవశురాలిగా చేశాడు. ఆ దంపతులకు తొమ్మిదిమంది కుమార్తెలు పుట్టారు. కర్దముడు సంసారయాత్రకు స్వస్తి చెప్పి సన్యాసం స్వీకరించడానికి సిద్ధమవుతాడని తెలిసి 'స్వామీ! తనయలను ప్రసాదించారు. నేను స్త్రీని. వీరినిపెంచి ఓర్పునేర్పుగలవారు సంతోషపడగా అయ్యల చేతిలో పెట్టలాగా నేనెలా ఆ పని చేయగలను? అని తన మనోగతాభిప్రాయాన్ని ప్రకటించింది. స్వామీ! అంతేకాదు. నాకు తత్త్వబోధన చేయగల కుమారుని ప్రసాదించు' అనడంతో కర్దముడు దేవహూతి కోరిన కోర్కెలన్నీ ధర్మబద్ధమని భావించాడు. ఈ కాంక్షోదయంతో దేవహూతిలో భోగాసక్తి సడలి యోగానక్తి మొదలయింది. ఆమె గర్భంలో కపిలుడు జన్మించాడు. ఆపై కర్దముడు భౌతికదేహం వదిలాడు. దేవహూతి కోరినవిధంగా కపిలుడు సాంఖ్యయోగం ఉపదేశించాడు. భక్తి ఒకటే మోక్షదాయకమని స్పష్టం

చేశాడు. ఈ బోధనలతో దేవహూతి 'విజ్ఞానవతి' అయింది. యోగ మార్గంలో పయనించి సాయుజ్యం చేరుకొంది.

ఈ వృత్తాంతంలో ఎన్నో సందేశాలున్నాయి. వరుని ఎంపికలో కుమార్తె ఆశయం, సమ్మతి తెలుసుకోవాలనుకోవడం. ఒక్క ఆస్తిక మహాత్ముని పెళ్ళాడడానికి సాధారణంగా ఎవరూ సమ్మతించరు. కాని దేవహూతి కర్దమునితో గడుపుతూ అతని చిత్తవృత్తులకు అనునయంగా ముందు ప్రవర్తిస్తూ అతణ్ణి తనవైపు లాక్కోగలిగింది. ఇదియొక విచిత్రమయిన సంసారలక్షణం. రెండవది తనయలు పుట్టాక వారికి పెళ్ళి చేయాలనే ఆలోచన స్త్రీలకు సహజం కనుక కర్దమునికి బాధ్యత గుర్తుచేసింది. నేటి ఆధునిక స్త్రీలు కోరేవిధంగా వివిధ ప్రదేశాల దర్శన, భోగేచ్ఛలు ఈ కథలోను కనిపిస్తాయి. వయసు పడమటికి చేరేవేళ ఇంకా సంసారమెందుకని తత్త్వాసక్తురాలు కావడం ప్రతివారు మానసికంగా తయారుకావడమనే సందేశాన్ని ఈ కథ ప్రకటితం చేస్తుంది.

## సతీదేవి

భాగవతం నాలుగవ స్కంధంలో సతీదేవి వృత్తాంతముంది. దక్షప్రజాపతి కుమార్తె సతీదేవి. పరమశివుని భార్య. కాని మామ దక్షునికి జామాత శివునికి అనేక కారణాలవల్ల వైరం ప్రవర్ధమానమవుతూ వుంది. శివుణ్ణి ఆహ్వానించక పెద్దసేయక చేసిన యాగం ఏదయినా నిష్ఫలమని దక్షునికి తెలిసినా 'వాజపేయ యజ్ఞం' చేయడానికి సంకల్పించాడు. ఆ యాగం చూడాలని బ్రహ్మర్షులు, ప్రజాపతులు, ప్రముఖ దేవర్షులు తమతమ భార్యలతో వచ్చారు. త్రిలోక సంచారి అయిన నారదుడు యజ్ఞదర్శనార్థం బయలుదేరాడు. దక్షునిచే గౌరవసత్కారాలందుకొని యాగదక్షిణలు కూడా కొందరు స్వీకరించారు.

పరమశివుని సతీమణి సతీదేవి తన నివాసంలోనే వుంటూ తండ్రి చేస్తున్న యాగం గురించి వింటూ వుంది. ఆ యాగానికి అన్నివైపులవారు కదలి వెళుతుండడం కూడా పరిశీలిస్తూ వుంది. ఇవన్నీ వింటున్న సతీదేవి ఒకరోజు పరమశివునితో

'స్వామీ! మీరు సర్వజ్ఞులు. దేవాధిదేవతల పూజలు అందు కొంటున్నవారు. త్రికాలవేదులు. నా తండ్రి దక్షప్రజాపతి వైభవంతో యాగం చేస్తున్నాడని మీకూ తెలుసు. నాకూ బాగా తెలుసు. ఆ యాగం చూడాలని వుంది. మనమిద్దరం కలిసి వెళదాం. పనిలో పనిగా మావారిని కూడా చూచినట్లవుతుంది' అని నెమ్మదిగా తన ఆసక్తిని ప్రకటించింది. అంతేకాదు తల్లిదండ్రులు శుభసమయాలలో తమవారికందరికి ఇచ్చే అలంకారాది ద్రవ్యాలను తెచ్చుకోవాలని వుంది. అంతేకాదు. నేనంటే అమితానురాగంగల తల్లిని, చుట్టాలను, యాగానికి నాటిన నిలువెత్తు ధ్వజస్తంభాన్ని చూడాలనివుంది. అందరూ తమతమభార్యలతో వెళుతుంటే మనం వెళ్ళకపోతే ఏం బాగుంటుంది? 'అనాహూతం అధ్వరం గచ్ఛేత్' అని కదా లోకాచారం అని ఆశతో అడిగింది.

సతీదేవి మాటలను సాంతంవిన్న పరమశివుడు "సాధ్వీ! నీవు దక్షుని యాగానికి వెళ్ళాలనుకోవడం సహజమే. కాని మనకు ఆహ్వానమూ లేదు. అవతలివారు గర్వితులయితే, అసహనశీలురయితే, మూర్ఖులయితే అక్కడికి వెళ్ళకుండడమే శ్రేయస్కరం. సుమనస్కులు కాని వారింటికి వెళితే నిరాదరణ ప్రకటిస్తారు. దగ్గరివాళ్ళ అసహనం భరించరానిది. అంతేకాదు నీ తండ్రి బ్రహ్మాదులు చేసిన యాగంలో నన్నుద్దేశించి అనరాని మాటలన్నాడు. అలాంటి చోటుకు నీవు వెళితే నిన్ను చులకనగా చూస్తారు. బంధువుల ఛీత్కారం, గుసగుసలు చావుతో సమానం. ఇక నీ ఇష్టం" అన్నాడు.

తండ్రి యాగానికి వెళ్ళాలనే తీవ్రమయిన కాంక్ష, అంతకంటె తనవారిని చూడాలనే వాంఛ ఆవిడను ఊరుకోనివ్వడంలేదు. ఈ రెండు కాంక్షలు పక్షికి రెక్కలులాగా టపటపమంటున్నాయి. అందుకే పరమేశుని బోధ నచ్చలేదు. అందువల్ల స్వయంనిర్ణయంతో 'సతి' తండ్రి యాగవీక్షణానికి ఒక్కతెగా వెళ్ళింది. అయినా శివపరివారం వెన్నంటి వచ్చింది. దక్షప్రజాపతి యాగస్థలిని చూచి పరవశించింది. సతీదేవి రాకను గుర్తించి సతీదేవి అమ్మ, సోదరీమణులు దగ్గరికి వచ్చి పలుకరించారు. కాని కొందరు దక్షుని మనసెరిగినవారు సతిని అసలు లెఖ్ఖపెట్టలేదు. ఇలాంటి పరిస్థితులలో

**జనకుం దవమానించుట**
**యును సోదరు లర్థిఁ దనకు నుచితక్రియఁజే**
**సిన పూజల నందక శో**
**భన మరసిన మాఱుమాటఁ బలుకక యుండెన్ (4.85)**

ఈ పరిస్థితిని అవలోకనం చేసి తన పతిని అవమానించడానికే ఈ యాగమని గ్రహించింది. 'ఈ హేయమైనట్టి శరీరమున్ విడిచి భాస్పచ్ఛుద్ధిఁ బాటిల్లెదన్' అంటూ చివరగా

**నీలగళాపరాధి యగు నీకుఁ దనూభవ నౌట చాలదా!**
**చాలుఁ గుమర్త్య! నీదు తనుజాత ననన్ మది సిగ్గు పుట్టెడి**
**న్నేల ధరన మహాత్ములకు నెగ్గొనరించెడి వారి జన్మముల్**
**గొలుపనే? తలంప జనకా! కుటిలాత్మక! యెన్ని చూడగన్. (4.94)**

తదనంతరం సతీదేవి ఆచమనం చేసి మౌనంతో భూమిమీద ఆసీనయై శరీరత్యాగం చేయాలనుకొంది. నిజయోగ సమాధిజనితంబైన వహ్నిచే తత్క్షణమే దగ్ధ అయింది. అప్పుడు దేవతలందరు 'మదిరాక్షి! యకట దేహము వదలెం గదా' అని బాధపడ్డారు. దక్షుని ఇంట జరిగిన

సంభాషణాదులు, పరిచర్యలు తెలిసిన శివుడు కోపోద్రిక్తుడయి వీరభద్రుని సృజియించి దక్షాధ్వరాన్ని సర్వనాశనం చేశాడు.

ఈ వృత్తాంతంలో ఎన్నో సందేశాలున్నాయి. ఆహ్వానం అందని చోటుకు ఏ పరిస్థితులలోను వెళ్ళరాదని ఒక సందేశం. మామ అల్లుళ్ళ అనుబంధం తెగేదాక లాగరాదని మరొక సందేశం. మెట్టినింట భాగ్యం ఎంతవున్నా నెలతలకు పుట్టింటి మమకారముపోదని పురుషులు గుర్తించాలని ఒక సందేశం. దక్షుడు అందరిని ఆహ్వానించినపుడు శివుని ఆహ్వానించకపోవడం అతని పెద్దరికానికి మచ్చ. సంఖ్య మొదట నిలుపక సున్నలు ఎన్ని పెట్టినా విలువలేదు. అలాగే శివుడు లేక యాగం నిర్వహించడం తగదు. ఇది మరొక సందేశం.

## సీత

సీతాదేవి కథనం భాగవతం నవమ స్కంధంలో కనిపిస్తున్నది. పోతన భాగవతంలో విష్ణువు అవతారాలను వర్ణిస్తూ శ్రీరామావతారాన్ని కూడా సంగ్రహంగా చెప్పాడు. ఆ రామాయణంలో సీతమ్మ గురించి విస్తృతకథనం కనిపించదు. సీతమ్మ భూలోకవాసిని అయినా అవతారాలలో శ్రీమహాలక్ష్మి అని వ్యవహారంలో వుండడంవల్ల దివ్యాంగనలలో చేర్చడం సబబు. ఈ రామాయణంలో స్త్రీలకు సంబంధించిన స్వభావచిత్రణ చాల క్లుప్తంగానే ఉన్నాయి.

శివధనుర్భంగం చేసిన శ్రీరాముడు సీతాదేవిని వివాహమాడిన సందర్భములోని పద్యం

**భూతలనాథుఁడు రాముఁడు**
**ప్రీతుండై పెండ్లి యాడె ఁబృథుగుణమణి సం**
**ఘాతన్ భాగ్యోపేతన్,**
**సీతన్ ముఖకాంతివిజిత సితఖద్యోతన్ (9.263)**

సీతాదేవి అశోకవనంలో శోకంతో ఏడుస్తూ రాక్షసాంగనల మధ్య గడిపిన తీరును పోతన కరుణాత్మకంగా వర్ణించాడు. హనుమంతుడు దర్శించిన సీతమ్మ

**దైతేయప్రమదాపరీతన్ అతిభీతన్ గ్రంథిబంధాలక**
**వ్రాతన్ నిశ్శ్వసనానిలాశ్రుకణజీవం జీవదారామ భూ**
**జాతన్ శుష్కకపోలకీలితకరాబ్జాతం బ్రభూతం గృశీ**
**భూతన్ బ్రాణసమేత సీతఁ గనియెన్ భూమీశుఁ డా ముందటన్**
**(9.312)**

అలాగే చివర వ్రాసిన పద్యం సీతాదేవి శీలాన్ని స్పష్టం చేస్తున్నది.

**సిగ్గువడుట గల్గి సింగారమును, గల్గి,**
**భక్తి గల్గి చాల భయము గల్గి**
**నయముఁ బ్రియముఁ గల్గి నరనాథు చిత్తంబు,**
**సీత దనకు వశము చేసికొనియె (9.338)**

ఒక సంసారస్త్రీ ఎలా వుండాలో చక్కగా ఆవిష్కరిస్తున్న పద్యమిది.

## సునీతి/సురుచి

జగత్ప్రసిద్ధమయిన ధ్రువుని చరిత్రగల శ్రీమద్భాగవతం నాలుగవ స్కంధంలో సునీతి సురుచుల కథ ఉంది.

స్వాయంభువ మనువు భార్య శతరూప. ఆ శతరూపకు ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడనే కొడుకులు పుట్టారు. వారిద్దరిలో ఉత్తానపాదుడు మంచినడవడిక కలవాడు. అతనికి సునీతి-సురుచి నామధేయులయిన ఇద్దరు భార్యలు. వారికి వరుసగా ధ్రువ, ఉత్తముడనే కొడుకులు. ఉత్తానపాదునికి సునీతి అంటే అపేక్ష తక్కువ. సురుచి అంటే ప్రీతి ఎక్కువ.

ఒకరోజు ఉత్తానపాదుడు సురుచి ఇంట సంతోషంగా సరస సల్లాపాలు కొనసాగిస్తూ కాలం గడుపుతున్నాడు. అపుడు సురుచి కొడుకు

'ఉత్తముడు' వచ్చాడు. తండ్రి చాల సంతోషంతో కుమారుని దగ్గరకు పిలిచి లాలిస్తూ తన తొడమీద కూర్చోబెట్టుకొని ఉచిత సంభాషణలు సాగిస్తున్నాడు. సురుచి దగ్గరేవుంది.

ఈలోగా సునీతి కొడుకు ధ్రువుడు అక్కడికి వచ్చాడు. తండ్రి తన సోదరుని లాలిస్తున్న తీరును చూచి తానూ తండ్రి అంకము అధిరోహించాలని దగ్గరకు పరిగిడి వెళుతుంటే సురుచి లాగిపారేసింది. అంతేగాదు పసిబాలుని మనస్సు బాధపడేలాగా

**'తండ్రి తొడ నెక్క వేడుక దగిలెనేనిఁ**
**బూని నా గర్భమున నాఁడు పుట్ట కన్య**
**గర్భమునఁ బుట్టఁ గోరినఁ గలదె నేఁడు**
**జనకు తొడ యెక్కు భాగ్యంబు సవతికొడుక!'** **(4.219)**

అని పసివాని నొప్పించేలా కసరుకొంది. ఈ పద్యంలోని 'అన్య' శబ్దము సునీతి పట్లగల అగౌరవాన్ని అలాగే సవతికొడుక అనడంలోని ఈసడింపును తెలియజేస్తుంది. ఇంతటితో ఆగక 'అధోక్షజుని ఆశ్రయించు. హరి నిన్ను నా కొడుకుగా పుట్టిస్తాడు. అపుడు నీవుకోరిన భాగ్యాలు అబ్బుతాయి' అంది. సవతితల్లి మాటలు ధ్రువునికి రోత పుట్టించాయి. ఏడుస్తూ తల్లి సునీతి దగ్గరకు వెళ్ళాడు. జరిగినదంతా చెప్పాడు. అశక్త అయిన సునీతి కుమారుని దగ్గరికి చేరదీసింది. కన్నీళ్ళు తుడిచింది. మోము నిమిరింది. ఆపై అసలు సంగతి తెలుసుకొంది. దీనికంతా కారణం పూర్వజన్మ సుకృత దుష్కృతాలే అని మనసులో తర్కించుకొని చివరకు ధ్రువునితో "ధ్రువా! సురుచి చెప్పినట్లు అధోక్షజుని ఆశ్రయించు శుభమస్తు" అని ఆశీర్వదించింది. ధ్రువుడు వెంటనే అడవిమార్గం పట్టాడు. దారిలో 'నారదుడు' తారసపడి ధ్రువునికి 'వాసుదేవమంత్రం' ఉపదేశించాడు. ధ్రువుడు 'ఓం నమో భగవతే వాసుదేవాయ' అని భక్తితో తపశ్చర్యకు పూనుకున్నాడు. చివరకు స్వామి అనుగ్రహంతో 'ధ్రువస్థితి' అనే స్థానం అందుకోగలిగాడు.

ఈ కథలో కూడా సందేశాలున్నాయి. బహుభార్యాత్వం ప్రబలంగా ఉన్నరోజుల్లో వారిని పెళ్ళాడినవాడు పడే అవస్థకు ఇది ఒక తార్కాణం. ఒకవైపు నిస్సహాయత, మరొకవైపు ఒక సన్నివేశాన్ని రసాభాస చేయకూడదనే ఆలోచన. అయినా తన ఆంతరంగిక మథనాన్ని అణచుకొని నారదులవారితో

**'అట్టి యుత్తమబాలు నాయంకపీఠ,**
**మందుఁ గూర్చుండనీక నిరాకరించి**
**యంగనాసక్తచిత్తుండ నైన యట్టి,**
**నాదు దౌరాత్మ్య మిది మునినాథచంద్ర!' (4-262)**

అని ఆత్మవిమర్శ చేసుకున్నాడు. చివరకు ధ్రువుడు పట్టణానికి తిరిగి వచ్చినవేళ ఉత్తానపాదుడు ఘనంగా అతనికి (బాలునికి) స్వాగతం పలికాడు.

**అనురక్తి దాసి పులకల్ ననలొత్తఁబ్రమోదితాత్ముఁడై**
**బిగియఁగౌఁగిటఁ జేర్చి నెమ్మొగము నిమిరి,**
**శిరము మూర్కొని చుబుకంబు చేతఁబుణికి**
**యవ్యయానందబాష్పధారాభిషిక్తుఁ జేసి (4.308)**

ఆశీర్వదించాడు. ఆపై తల్లులకు నమస్కరించాడట. ఆ సమయంలో సురుచి 'వందేళ్ళు జీవించు' అని ఆశీర్వదించిందట. మరి తల్లి తన ప్రాణంబుకంటె ఁబ్రియుండైన సుతు నుపగూహనంబు సేసి తదవయవస్పర్శంబుచేత ఆనందమొందినదట. అప్పుడు పౌరులు సునీతిని తెగ పొగడినారట. మాతాపుత్రుల అన్యోన్యతకు ఈ కథ ఒక ఉదాహరణ.

* * *

# 3. ప్రముఖ పురమహిళలు

భాగవతకాలంనాటికి ఈ పుణ్యభూమిలో ఎన్నో విశిష్టతగల గ్రామాలు, పురాలు, నగరాలు, సామ్రాజ్యాలు ఉన్నాయి. భగవద్భక్తులు పురాలలోను, గ్రామాలలోను ఉన్నారు. ఈ దృష్టితో పరిశీలిస్తే భాగవత కాలంనాటికి హస్తినాపురం, మధుర, ద్వారకానగరాలు చాల ప్రసిద్ధమని చెప్పవచ్చు. అలాగే జానపదాలలో వ్రేపల్లె అనేక కారణాలతో విశిష్టమనడంలో సందేహం లేదు. దేశాలలో కేకయ, అవంతి, కోసల, మధుర, హస్తిన, ద్వారక ప్రసిద్ధిపొందిన దేశాలు.

'భాగవతంలో మహిళలు' అనే దృష్టితో పరిశీలిస్తే అత్యధిక మహిళలు హస్తినలోనే కనిపిస్తారు. అకారాది క్రమం ప్రకారం ఉత్తర కుంతి, గాంధారి, ద్రౌపదులు, ఆ తరువాత మధురానగరవాసులుగా కుబ్జ, దేవకి, పూతనలు, ద్వారకాపురవాసులుగా కాళింది, జాంబవతి, భద్ర, నాగ్నజితి, మిత్రవింద, లక్షణ, వామాక్షి, రుక్మిణీ సత్యభామలు, ఇంక గ్రామీణమహిళలలో యశోద, రోహిణి, గోపాంగనలు ప్రసిద్ధులు. మున్యాశ్రమ మహిళలపేర్లు చెప్పబడలేదు గాని మునుల ధర్మపత్నులున్నారు. పై చెప్పబడ్డ మహిళల స్వరూపస్వభావాలు, వారి జీవితాలలోని మలుపులు చిత్రాతిచిత్రం.

## ఉత్తర

విరాట మహారాజు కుమార్తె ఉత్తర. విరాట మహారాజు కొలువులో ఉండగా బృహన్నల ప్రవేశించి తాను అంతఃపురాంగనలకు నాట్యం నేర్పించగలనని, తాను నాట్యవిశారదుడనని పరిచయం చేసుకొన్నాడు. విరాటమహారాజు బృహన్నల ఆకారాన్ని సునిశితదృష్టులతో వీక్షించి తన కుమార్తెకు సంగీతనాట్యాలు నేర్పమని ఆదేశించి అంతఃపురప్రవేశం కలిగించాడు. అలాగే ఉత్తరను సుశిక్షితురాలిగా చేశాడు.

ఉత్తరగోగ్రహణానంతరం కంకుభట్టాదులు పాండవులని విరాటమహారాజుకు తెలియవచ్చింది. విరాటమహారాజు కుమారుడు ఉత్తరుడు తండ్రితో

'రాజా! పాండవులకు ధనవర్గం ఇవ్వడమేమిటి? ఇవన్నీ వారు మనకిచ్చినవి కదా! ఇదేం బాగుకాదు. నూతనమయిన కానుక ఇవ్వడమే సబబు' అంటూ వెనువెంటనే 'ఉత్తరను' పిలిపించమన్నాడు. తదనంతరం విరాటుడు పాండవులను పొగడి 'అర్జునుడు నా కుమార్తె ఉత్తరను భార్యగా స్వీకరించు గాక! అన్నాడు. కాని బృహన్నలగా అంతఃపురంలోని అంగనామణులకు విద్యాభ్యాసం కొనసాగించిన అర్జునుడు సవినయంగా 'నాట్యంలోను, గానంలోను ప్రతిభ కలిగిన ఉత్తర నన్ను గురుభావంతోనే చూచింది. నేనూ ఉత్తరను కుమార్తెగానే చూచాను. అంతేకాదు ఆమెతో ఒక సంవత్సరం ఒంటరిగా గడిపాను. ఆమె పవిత్రతను ప్రజలకు తెలియడానికోసం నేనామెను భార్యగా అంగీకరించడం తగదు. అయితే కోడలిగా అంగీకరిస్తాను' అన్నాడు. ఆపై ఉత్తరకు అభిమన్యునితో వివాహం సంబరంగా జరిగింది. ఆరు నెలలు గడిచాయి. ఇంతలో కురుక్షేత్ర సమరం మొదలయింది. అభిమన్యు పద్మవ్యూహంలో ప్రవేశించి కౌరవులతో పోరాడినాడు. అయినా కురువీరులు వంచనతో అభిమన్యుని చంపారు. కురుక్షేత్రయుద్ధానంతరం ఉత్తర యుద్ధభూమికిపోయి తన భర్త అభిమన్యుని చూచి 'విధి మన కలయికను ఆరు నెలలు మాత్రమే విధించినట్లున్నదని వాపోయింది. పెళ్ళిముచ్చటలన్నీ తీరకముందే ఉత్తర పతిరహిత అయిందని గాంధారి అభిమన్యుని శవంపై పడి ఏడుస్తున్న దృశ్యాన్ని కృష్ణునికి చూపి తన ఆవేదనను ప్రకటించుకొంది.

'అపాండవం కరిష్యామి' అని ప్రతినబట్టిన అశ్వత్థామ బ్రహ్మశిరోనామకాస్త్రప్రయోగప్రభావంతో ఉత్తరగర్భంలోని శిశువు

అవస్థలపాలయింది. ఆ సమయంలో సుభద్ర తనకోసం ఉత్తరకోసం మృతశిశువును బ్రతికించమని కృష్ణుని వేడుకొంది. ఉత్తర కూడా

'గోవిందా! నా కుమారుని ఒడిలో ఉంచుకొని నీకు నమస్కారం చేయాలనుకొన్నాను. ఆ కోరిక విఫలమయింది. ఈ బాలుని బతికించకపోతే నేను ఆత్మహత్య చేసుకొంటానని వలవల ఏడ్చింది.' అని ఆంధ్రమహాభారతంలో వర్ణితం. భాగవతంలో శ్రీకృష్ణుడు అందరిదగ్గర సెలవు పుచ్చుకొని ద్వారకానగరానికి వెళ్ళడానికి బయలుదేరి రథం ఎక్కుతుంటే ఉత్తర గుండె బాదుకుంటూ పరుగెత్తుకొని వచ్చి కృష్ణుని చూచి

'దేవదేవా! ఇదేదో ప్రళయాగ్నితో సమానమయిన బాణం ఒకటి ఎక్కడనుంచో వచ్చింది. నా కడుపులోనున్న పసిగుడ్డును భస్మం చేయాలని భయంకరమైన మంటలతో వస్తూ వుంది. మిరుమిట్లు గొలిపే కాంతితో తేరిపారచూడడానికి సాధ్యంకాకుండా ఉంది. నీవు తప్ప నన్ను రక్షించేవారెవ్వరూ లేరు. నీ పాదపద్మాలనే నమ్మివున్నాను. వెంటనే ఈ బాణాగ్నిజ్వాలలను నివారించు. భరించలేని బాణాగ్నితో నా కడుపులోని బిడ్డ తాపంతో కందిపోతున్నాడు. కారుణ్యదృష్టితో కాపాడవయ్యా.

స్వామీ! నేనెవరినో కాదు. నీ చెల్లెలి కోడలిని. నీ మేనల్లుడు విరోధులతోడి అధర్మయుద్ధంలో హతుడయ్యాడు. ఈ బాణాగ్నికీలలను పటాపంచలు చేసి నా పసిబిడ్డను బ్రదికించు. బ్రహ్మాండ భాండోదరుడవయిన నీవు ఒక మానినీగర్భరక్షణమొక బరువు కాదు. దయతో నా గర్భసంరక్షణ చేయవా' అని కన్నీరు మున్నీరుగా ఏడ్చింది.

శ్రీకృష్ణుడు 'ఉత్తర' విలాపాన్ని అర్థం చేసుకొన్నాడు. ఆర్తత్రాణ పరాయణుడయిన స్వామి ఇదంతా అశ్వత్థామ దివ్యాస్త్రప్రభావమని గ్రహించాడు. బ్రహ్మాస్త్రం నుండి నిర్గమించిన బాణాలు పాండవులకు

ఎదురుగా వచ్చాయి. వారు కూడా ఏమాత్రం భయపడకుండ తమపై వచ్చే అస్త్రాలను నిర్వీర్యం చేయడానికి వీలుగా ప్రత్యస్త్రాలు చేపట్టి పోరాడే సమయంలో శ్రీకృష్ణుడు తన సుదర్శనచక్రాన్ని ప్రయోగించాడు. పాండవవంశం నాశనం కాకుండా ఉత్తరగర్భాన్ని వైష్ణవతేజంతో కప్పివేశాడు. బ్రహ్మాస్త్రాన్ని సుదర్శనచక్రం అణచింది. పాండవ వంశాంకురం నిలచినందుకు కుంతి ఎంతో సంతోషపడింది. శ్రీకృష్ణుని అలౌకికత్వాన్ని మనసారా పొగడుతూ స్తోత్రాలు చేసింది.

కొన్ని దినాలకు ఉత్తర గర్భంలోని పసికందుకు పది నెలల గడువు పూర్తి అయింది. అశ్వత్థామ ప్రయోగించిన బాణాగ్నివలన ఆ పసివానికి భరింపరాని పరితాపం కలిగింది. ఆ బాలుడు దహింపబడుతూ మొరపెట్టుకొన్నాడు.

“దైవమా! నేను తల్లి గర్భగోళంలో ఉన్నాను. మొరపెట్టుకోవడానికి శక్తిలేదు. నేను అనాథను. నా తల్లికూడా భర్తలేనిది అని బాధపడుతుంటే విన్నాను. ఈ బాణాగ్ని నుండి ఉపశమనం ఎలా! దైవమే నాకు రక్ష. ఈ వ్యవహారమంతా తల్లికి తెలిస్తే గర్భశోకానికి తట్టుకోలేక తాను కూడా యమయాతనతో మరణిస్తుంది. శ్రీకృష్ణుడే సర్వరక్షకుడని మా అమ్మ పదేపదే చెప్పేది. స్వామి నన్ను రక్షింపడా” అని దీనాలాపంతో ప్రార్థిస్తుంటే ఆ శిశువుకు మహావిష్ణువు సాక్షాత్కరించాడు. బొటనవ్రేలంత రూపంలో ఒక చేతిలో గదను పట్టుకొని కనుల పండువుగా మంచును తొలగించే సూర్యునిలాగా బాలునికి పది దిక్కులలో తన చేతి గదను గుండ్రంగా గిరగిరమని త్రిప్పినాడు. మొక్కవోవని మంటలతో గుప్పుగుప్పున తిరిగింది. దానితో అశ్వత్థామ ఆగ్నేయాస్త్రం వేడిమి అణగారింది. బాలకుని చుట్టుముట్టిన సంతాపం అణగింది. శిశువుకు ఎంతో సంతోషం కలిగింది. అనుకూల శుభగ్రహోదయంలో సర్వగుణోత్తర ఫలసూచకమయిన

శుభలగ్నంలో పాండవవంశోద్ధారకుడయిన కుమారుడు పుట్టాడు. అతడే పరీక్షిత్తు.

ఈ ఉత్తరావృత్తాంతంలో మానవాళికి ఎన్నో సందేశాలున్నాయి. మొదటిది ఉత్తరకు గల సంగీత నాట్యాసక్తి. ఈ ఆసక్తి పట్టుదలగా మారి ప్రావీణ్యం సంపాదించగలిగింది. కళాకారులకు ఇదొక సందేశం.

ఉత్తర కన్య. అపురూపసుందరి. అయినా విద్యాగ్రహణంవేళ బృహన్నలను గురువుగానే భావించి సేవించింది. ఆవిడలో వయోగతమయిన వికారములు విద్యాభ్యాసనవేళ లేవు. అలాగే గురువయిన అర్జునుడు మెలగినాడు. గురుశిష్యసంప్రదాయాన్ని చాటే మంచికథ ఇది.

ఉత్తరుడు తనకు ఉత్తరగోగ్రహణ సందర్భంలో సహకరించిన అర్జునునికే తన చెల్లెలిని ఇవ్వాలని భావించడం తప్పేమీ కాదు. కాని అర్జునుడు తన కోడలిగా స్వీకరిస్తానన్నప్పుడు ఉత్తరుడు సంతోషించిన వాడే. ఒక కుటుంబంలో వివాహానికి సంబంధించి చర్చ చేసేవేళ పలువురు పలు అభిప్రాయాలు ప్రకటించడం సబబే.

ఈ రోజుల్లోనూ వివాహానంతరం కొద్ది నెలలకే భర్త కారణాంతరాలవల్ల మరణించడం చూస్తున్నాం. తాను కడుపుతో ఉండగా భర్తమరణిస్తే ఆ సతి దుఃఖం అపారం. తీర్చలేనిది. ఉత్తరస్థితి కూడా అంతే.

మగడు పోయినా పుట్టే కొడుకయినా రక్షిస్తాడనుకోవడం లోకసహజమే. ఉత్తర జీవితంలోనే గర్భస్థశిశువుకు 'గండాలు' ఎదురయినా ఆ గండం గడిచింది.

అన్నిటికన్నా మించి ఈ వృత్తాంతంలో దైవగతిని తప్పించలేరన్నది. పరమాత్ముని పట్ల భక్తి ఒకటే ఆపన్నివారకసందేశం. కనుక ఉత్తర కృష్ణునితో, 'నీ పాదపద్మంబులె కాని యొండెరుగన్' అన్నది.

ఈ వృత్తాంతంలో విశేషాంశాలున్నాయి. ఇది జానపద కథకు సంబంధించింది.

సుభద్ర అర్జునుని పెళ్ళాడేవేళ కృష్ణునితో 'నేను ద్రౌపదికి సమానంగా హస్తినలో మెలగవలసిందేనా! నా సంతతి వారికి సేవలు చేయవలసిందేనా' అని అడిగిందట. శ్రీకృష్ణుడు చిరునవ్వుతో

'సుభద్రా! విను. ఏనాటికయినా నీ సంతానమే హస్తినపీఠం అధిరోహిస్తారు. ఇది సత్యమన్నాడు. సుభద్ర ఆ వాగ్దానాన్ని తేలికగానే తీసుకొన్నది. కురుక్షేత్ర సంగ్రామంలో భీముని కొడుకు మరణిస్తే కృష్ణుడు చిందులు త్రొక్కడం తెలుసు. అలాగే తన కొడుకు హతుడయినవేళ కృష్ణుడు పట్టించుకోలేదని అనుకొన్నదట. ఆ తరువాత ఉపపాండవులు హత్యచేయబడ్డాక కృష్ణుని ఆంతర్యం అర్థమయింది. చివరకు ధర్మరాజు తరువాత 'పరీక్షిత్తు' ఉత్తరకుమారుడు సింహాసనమెక్కడంతో లీలామానుష విగ్రహుని చేతలను, మాటలను అర్థం చేసుకొంది.

## కుంతి

భారత, భాగవతాలలో ప్రస్తావితమయిన పాత్ర కుంతి. భారతంలో కుంతికి సంబంధించిన సన్నివేశాలనేకం. కాని భాగవతంలో మాత్రం కుంతి కేవలం భక్తురాలిగా సాక్షాత్కరిస్తుంది.

భారతకుంతి జీవితం సీదాసాదాగా జరగలేదు. దేవమీఢుని కూతురయినా తండ్రి కుంతిభోజునికి కుంతి బాధ్యతలివ్వడానికి కారణాలు తెలియవు. తల్లి ఆశ్రయం, బోధనలు మగశిశువుకు, ఆడబిడ్డకు బాల్యంలో చాల అవసరం. కాని కుంతికి అలాంటి శిక్షణ లేనట్టే ఉంది. అయినా దుర్వాసునికి సేవలందివ్వడం విశేషం. పరమకోపిష్ఠికి సేవచేసి అతని మెప్పుపొందింది. దుర్వాసుడు వరం ఇచ్చి వెళ్ళిపోయాడు. కాని

బాల్యకన్యాచాపల్యంతో కుంతి మంత్రం పఠించడం, సూర్యుడు కుమారుని అనుగ్రహించడంలాంటివి జరిగిపోయాయి.

ఒకస్త్రీగా ఎవరితోను చెప్పుకోలేని అవస్థ. స్త్రీపర్వంలో ధర్మరాజు మరణించినవారికి తిలోదకాలు సమర్పిస్తుంటే కుంతి కర్ణునికి తిలోదకాలిమ్మనడంతో అసలు రహస్యం బయటికి వచ్చింది.

దుర్వాస వరగ్రహణానంతరం కుంతి పాండురాజుకు మొదటిభార్య అయింది. పాండురాజుకు కిందముని శాపంవల్ల అతనికి స్త్రీ జనసంగమం లేకపోయింది. అపుత్రకుడయిన తనకు ఊర్ధ్వలోకాలు లేవని పరితపిస్తుంటే కుంతి దుర్వాసముని దత్తవరాన్ని భర్తకు విశదం చేసింది. పాండురాజు సంతోషించాడు. కుంతి యముడివల్ల యుధిష్ఠిరుని, వాయుదేవునివల్ల భీముని, ఇంద్రునివలన అర్జునుని కన్నది. పాండురాజు నేను అపుత్రకుణ్ణి కానని సంతోషించాడు.

భాగవతం కుంతికి సంబంధించిన ఇతర వ్యవహారాల జోలికిపోకుండా ఒక పరమభక్తురాలిగా చిత్రీకరించింది. వాసుదేవుడు ఉత్తరాగర్భం విచ్ఛిన్నం కాకుండా చేయడంతో కుంతి ఆనందంతో శ్రీకృష్ణపరమాత్మను నుతించింది. ఆ నుతిలో స్వామి తన కుమారులయిన వారికి చేసిన ఉపకారాల ప్రస్తావన వదలిపెట్టి తన వంశం నిలిపినవాడవని ప్రస్తావించి పరమాత్మతత్త్వాన్ని, భగవల్లీలలను ప్రశంసించింది. ఆపై పాండవులకు కృష్ణసాహాయ్యంవలన కలిగిన ఉపకారాలను ప్రస్తావించింది. ఇవన్నీ ఎవరికయినా సహజమే. కాని చివర 'యాదవులందు ౘాండు సుతులందు నధీశ్వర! నాకు మోహవిచ్ఛేదము సేయుమయ్య' అని ప్రార్థించింది. ఆపై 'శ్రీకృష్ణా! యదుభూషణా! నరసఖా! శృంగారరత్నాకరా! లోకద్రోహి నరేంద్రవంశదహనా! లోకేశ్వరా! దేవతానీక బ్రాహ్మణ గోగణార్తిహరణా! నిర్వాణ సంధాయక నీకున్

మొక్కెద (త్రుంపవే భవలతల్ నిత్యానుకంపానిధీ' అంటూ శరణాగతి కోరింది.

ఆంధ్రమహాభాగవతంలోని స్తుతులలో కుంతీస్తుతి, ఆపై భీష్మస్తుతి ఘట్టాలు భక్తిరసగుంఫితాలు. కుంతి ఆంతరంగిక మనస్తత్వాన్ని ఆవిష్కరించిన సన్నివేశం ఇది. కుంతి భీష్మునిలాగా హస్తినాపురాధీశుల ఉన్నత పతనాలను, ఆ కారణంగా జరిగిన కురుక్షేత్రసంగ్రామఫలితాలను కళ్ళారా చూచిన వృద్ధురాలు. అంతేకాదు ఉపపాండవులు చనిపోగా సంహరింపబడగా ఇక నా వంశం ఇంతేనా అని మానసికంగా క్రుంగినవేళ కృష్ణుడు 'ఉత్తరాగర్భం' రక్షించడంతో ఊపిరి పీల్చుకొంది. నిరాశాజనకమయిన అంధకార జీవితంలో శ్రీకృష్ణానుగ్రహం మెరపులా మెరయడంతో పూర్తిగా భవలోకవాసాన్ని దోసి శరణు చేసింది. లోకంలో ఏ తల్లి అయినా తన వంశం వర్ధిల్లాలని కోరుకొంటుంది. పాండవులకు తల్లి అయిన కుంతి కొడుకుల సంతానం నశించగా, మనుమని సంతానం వర్ధిల్లాలని కోరుకోవడంలో తప్పేమీ లేదు. శంకరాచార్యులు భజగోవిందంలో చెప్పినట్లు 'వృద్ధః తావత్ చింతాసక్తః' తో ఆగక 'పరమే బ్రహ్మణి' ఆసక్తురాలు కావడం సహజమే. కుంతి కోరికను మనసా మన్నించిన కృష్ణుడు కుంతి మాటలకు నియ్యకొన్నాడట. అంతటితో శ్రీకృష్ణుడు ఆగలేదు. మాయానిరూఢ మందహాస విశేషంతో మోహితుణ్ణి చేశాడట. ఆపై ద్వారకానగరానికి కృష్ణుడు బయలుదేరాడు. జన్మజన్మాదులలో దుర్భరమయిన జీవితాలు గడుపుతూ గమ్యంలేక పయనించే జీవులకు 'శరణాగతి' ఒకటే చివరి మజిలి. కుంతి తన జీవితంలో తనకు సంబంధించిన వారి కష్టసుఖాలలో భాగం పంచుకొంటూ కాలం గడిపింది. ఇతరులకు తెలియనంతవరకు 'కన్యాత్వ చాపల్యం' ఒక దోషంగా చెప్పడం తగదు. ఇలాంటివి నేడూ ఉన్నాయి.

కుంతీపాత్ర సమాజానికి చాల సందేశాలు ఇచ్చింది. తండ్రి తన్ను తన చెలికాని దగ్గరికి చేర్చినా కుంతిభోజునికి సంతోషం కలిగేలా మెలగింది. అలాగే అతిథిసేవ చేయమంటే దుర్వాసునికి సేవలు చేసింది. పాండురాజు ఆదేశించగా మాద్రికి సంతానవరం ఫలించేలా చేసింది. ఏనాడూ తాను ఎవరికి ఎదురు తిరగలేదు. పాండవులకు తల్లిగా వారికి మేలు కోరింది గాని చివరివరకు గాంధారీ ధృతరాష్ట్రుల సేవలోనే గడిపింది. ఇది ఆనాటి విధవల జీవనవిధానం. సుశిక్షితురాలయిన తల్లి అడుగుజాడల్లో కనుసన్నలలో పెరగకపోవడంవల్ల కలిగే ఒకస్త్రీకి సంభవించే అనర్థాలను ఈ వృత్తాంతం సూచిస్తుంది.

**గాంధారి**

భాగవతంలో గాంధారి ప్రస్తావన ప్రథమ, నవమ స్కంధాలలో కనిపిస్తుంది.

విచిత్రమయిన పరిస్థితులలో గాంధారి ధృతరాష్ట్రునికి భార్య. అతనివల్ల నూరుగురు కొడుకులు, ఒక కూతురిని కన్నది. ఈ సంతానానికి సంబంధించిన ఇతరాంశాలు భారతంలోనే కనిపిస్తాయి. భాగవతంలో వాటి ప్రస్తావన లేదు.

విదురుడు ఒకనాడు ధృతరాష్ట్రునితో 'కురుకులశ్రేష్ఠా! ముసలితనం పులిలాగ పైబడుతున్నది. ఇపుడు నా అన్నవారు ఎవరూ నీకు లేరు. నీవు ఎవరినయితే హింసించానో, పుత్రమమకారంతో ఎవరికి ఎన్ని బాధలుపెట్టావో అలాంటి వారి ప్రాపకంలో నీవున్నావు. జీవితంలో ప్రతిసారి కౌరవుల దుశ్చేష్టలకు 'వత్తాసు' ఇచ్చావు. కొడుకులకు బుద్ధి సెప్పనివానికి పిండం పెట్టండి లాంటి మాటలు వింటూ ఇక్కడే నీవున్నావు. నీలో చలనం లేదు. నీవేమయినా మరణించినవారిని చూడగలవా? కౌరవులలాంటివారిని మరల కనగలవా! బ్రాహ్మణులకు

దానాలిస్తానని పిలువగలవా? దేహం శాశ్వతం కాదని నీవింక తెలుసుకోలేకపోతున్నావు!' అని ప్రబోధం చేయగా ధృతరాష్ట్రుడు ఆత్మ విమర్శ చేసుకొన్నాడు. ఆపై విరక్తితో అన్నీ వదలుకొని హిమవన్నగంకేసి పయనం సాగించాడు. ఆ సమయంలో గాంధారి ధృతరాష్ట్రుని వెంట 'ఉదయత్సాధ్విగుణారూఢయై' కదలిందట. పెంపొందుచున్న ఉత్తమ స్త్రీలక్షణములందు స్థిరత్వం కలదై అని వివరణ. ఈ సంస్కృతసమాసం చాలా చిక్కనిది. ఎంతయినా వివరణ ఇచ్చుకోగలిగింది.

గాంధారి ధృతరాష్ట్రుని వెంట హిమవన్నగ ప్రాంతాలకు వెళుతుంటే ఆ సన్నివేశాన్ని పోతన-'వెనుకకు రాక చొచ్చు రణవీరుని కైవడిలా, రాజదండనంబునకు భయంబు లేకఁ బోయెడి ధీరుని భంగి కదలిందట.' రణవీరుడు వీరస్వర్గసుఖభావనతోనే చావడం తథ్యమనే భావనతోనే స్థిరసంకల్పుడై కదలివెళతాడు. రాజదండనం అనుభవించిన వానికి యమదండంలేదని అంటారు. యమదండనానికయినా సిద్ధమనే భావనతో వెళుతుందట. ఇదంతా వివేకి లక్షణం. కనుకనే పోతన గాంధారిని 'వివేకలక్షణ' అన్నాడు. యోగాగ్నితో ధృతరాష్ట్రుడు దేహత్యాగానికి సిద్ధమయితే తాను కూడా 'నియమ ప్రఖ్యాత' ప్రాణవల్లభునితో అగ్నిలో పడిందట. ఈ కథనాన్నే నారదుడు ధర్మరాజాదులకు చెప్పాడు.

గాంధారివైఖరిని పోతన 'పెనిమిటితోడ నించుకయును భీతి వహింపక నేగె' అని వర్ణించాడు. అలాగే మగవాడు పుత్రదుఃఖాన్ని అణచుకోగలడుగాని అతివ అణచుకోలేదు అనే సత్యం సుస్పష్టమయ్యేలా 'ఎప్పుడు బిడ్డలపేరు గ్రుచ్చి తాఁబొక్కుచునుండు తల్లి' అని గాంధారి స్థితిని కళ్ళకు గట్టించాడు.

## ద్రౌపది

శ్రీమద్రామాయణంలో సీతమ్మ పాత్రలాగా భారతంలో ద్రౌపది పాత్ర. ద్రౌపది సీతమ్మకన్న ఎన్నో కష్టాలు అనుభవించింది. భాగవతంలో ద్రౌపది ప్రశంస 1.386, 174లలో కనిపిస్తుంది. ప్రత్యేకించి భాగవతంలో తొలుత నారదవృత్తాంతకథనముంటే ఆ తరువాత కనిపించేది ద్రౌపదిపుత్రశోకవృత్తాంతం.

ద్రౌపది మొదటనుండి ఆశోపహత. మత్స్యయంత్రభేదకుడయిన అర్జుననికే సొంతం కావలసిన ఆమె ఐదుగురికి భార్య అయింది. ధర్మరాజు జూదం కారణంగా నిండుసభలో అవమానం సహించవలసి వచ్చింది. ఆపై అరణ్యవాసం అందరికి తానే వంటలమ్మకావడం అంతఃపురవాసినికి మరో కష్టం. ఏకాంతంలో వున్న ద్రౌపది సైంధవుని కారణంగా ఇబ్బందులు పడడం, చివరకు పాండవులకు విజయ పరంపరలు కలుగుతున్నా ఉపపాండవులు అశ్వత్థామచే హతులు కావడంతో మానసికంగా క్రుంగిపోయింది. ఏడ్చి ఏడ్చి నేలబడ్డది. ఆమెకు భీమార్జునులు ఓదార్పు చెప్పారు. అశ్వత్థామను బంధించడానికి సిద్ధమై రథమెక్కి వెంటనే బయలుదేరారు. ఈ సందర్భంలో ద్రౌపది కనబరచిన నిబ్బరం అత్యాశ్చర్యకరం. బంధితుడయిన అశ్వత్థామకు నమస్కరించడం చాలా ఆశ్చర్యం కలిగించే అంశం. సరళస్వభావంతో అశ్వత్థామను నిందిస్తూ ఆడినమాటలు ఆంధ్రవాఙ్మయంలోనే చిత్రాతిచిత్రమయిన సన్నివేశం.

'అశ్వత్థామ! మావారందరు నీ తండ్రి ద్రోణుని దగ్గర విద్య నేర్చినవారు కదా. నీవు గురుపుత్రుడివి. ఇలా చేయవచ్చా. అంతేకాదు నీవు భూసురుడివి. బుద్ధిదయాభాసురిడివి. పరాక్రమవంతులలో శ్రేష్ఠుడివి సుజనులలో మేటివి. అలాంటివాడవు శిశువులమీదనా నీ ప్రతాపం?

మరొక్క సంగతి చెబుతాను విను. నా కుమారులు నీకేమయినా ద్రోహం చేశారా? నా కుమారులు ఉద్రేకస్వభావులు కారే. రణప్రౌఢ క్రియాహీనులు కదా! వారిమీదనా నీ ప్రతాపం. పుత్రదుఃఖంతో నిన్ను బంధించారని తెలిసి నీ తల్లి ద్రోణునితో సహగమనం చేయక నీకోసం బ్రతుకుతున్న తల్లి ఎలా ఆరాటపడుతూవుందో కదా! నీవు బ్రాహ్మణుడివి. నిన్ను మేము చంపడం న్యాయం కాదు. 'బ్రాహ్మణో న హంతవ్యః' అని కదా ధర్మశాస్త్రం. బ్రాహ్మణులే కోపపడితే ఆ కోపానికి రాజవంశాలనే అడవులు కాలిపోతాయి' అని దయాధర్మబోధకమయిన ప్రసంగం చేసింది. ఆపై అశ్వత్థామను హతం చేయడానికి ఇష్టపడకపోతే భీముడు 'శిక్షించాల్సిందే' అని పట్టుబట్టాడు. బాలఘాతకునికి శిక్షఅవసరమన్నాడు. నా పిడికిటి పోట్లతో భిన్నం చేస్తానన్నాడు. ఆ సమయంలో ద్రౌపది తన ఎదుట ఇరువురు పోట్లాడుకోవడం ఇష్టంలేక అడ్డువచ్చింది. భీముని కోపాన్ని లోగడ చూచిన సుందరి. విరాటపర్వంలో కోపోద్రిక్తుడయిన భీముడు 'అసేవ్యక్ష్మాజాలాన్ని' వేళ్ళతో పెకలిస్తే ఆశ్రయమిచ్చిన వృక్షాన్ని అలా చేయరాదనే ధర్మరాజుకు కట్టుబడి వదలినాడు. అలాగే కీచకుని సంహరించినవేళ భీముని 'వికృతపు చావు' చావమని కీచకుని ముద్దచేసిన ఘటన కూడా ఆవిడకు గుర్తుంది. కనుక 'అశ్వత్థామను' అలా చంపితే లోకులు ఆ స్థితికి కారణమయినవారినే తిడతారని ద్రౌపదికి తెలుసు. ద్రౌపది మనోగతాభిప్రాయాన్ని తెలుసుకొని కృష్ణుడు భీముని వారించాడు.

'పాండవోత్తమా! వాడు శిశుహంతే. కాదనలేదు. అయినా రక్షింపదగినవాడు. ద్రౌపది ఆశయమూ అదే' అంటూ అర్జునుని చూచి ప్రతిక్రియ ఆలోచించమన్నాడు. చివరకు అర్జునుడు తన కత్తితో అశ్వత్థామ జుట్టులోని మణిని లాక్కొన్నాడు. ఆపై అశ్వత్థామ కట్లువిప్పి జుట్టుపట్టుకొని ఒక ఊపుతో గెంటేశాడు.

ఈ వృత్తాంతంలో కొన్ని సందేశాలున్నాయి. దుర్యోధనునితో 'అపాండవం కరిష్యామి' అనడం తొలితప్పు. ద్రోణుడంతటి కురుక్షేత్రంలో పోరాడుతుంటే 'బ్రాహ్మణులు విలువిద్య నేర్పాలిగాని ఇతరులను చంపడానికి తాను సిద్ధం కాకూడదనడంతో ద్రోణుడు విల్లు కిందవేశాడు. ఇది తెలిసి అశ్వత్థామ అపాండవం కరిష్యామి అనడం నేరం. అన్నిటికన్నా వెఱచినవాని నిదరపోతున్నవానిని చంపుట తగదని తెలిసి హత్యచేయడం మరీ తప్పు. అవమానాలతో బతకడానికోసం అశ్వత్థామకు చిరంజీవిత్వమేమో!

## హస్తినాపురవాసులు

శ్రీకృష్ణుడు హస్తినాపురంలో కురుక్షేత్ర సంగ్రామానంతరం అక్కడి పరిస్థితులు చక్కబెట్టడానికోసం హస్తినాపురంలోనే కొన్ని నెలలున్నాడు. ఆపై ద్వారకానగరానికి పయనమయినవేళ అపారమయిన ప్రీతితో ద్రౌపదీసుభద్రలు కుంతీగాంధారులు చూస్తుండగా రథం కదలింది. ఆ సందర్భంలో కురునగరంలోని విలాసినులు బంగారు మేడలపై నిలిచి తమ ముందు పయనిస్తున్న శ్రీకృష్ణుని చూచి తమ చెలికత్తెలతో మాట్లాడసాగారు. ఈ సన్నివేశంలో పోతన ఆ కాంతాజనుల ఆవేదనను అనురాగాన్ని, భక్తిని, ఆరాధ్యభావనను, సహజరమణీయంగా వర్ణించాడు. అయితే ఈ సన్నివేశంలో ఆ అంగనల పేర్లు లేవు. బహుశః శ్రీకృష్ణవియోగం అందరిది కావడమే కారణం.

ఆరాధ్యభావం కల స్త్రీలు ఆధ్యాత్మికభావంతో శ్రీకృష్ణుడు సర్వేశ్వరుడని అతని సాక్షాత్కారం యోగం ద్వారానే సాధ్యమని మాట్లాడుకొన్నారు. ద్వాపరయుగంలో హస్తినలోని స్త్రీలు సామాన్యస్త్రీలు కాదు. విద్యలలో ఆధ్యాత్మవిద్య ఒకటే అని మనసా తెలుసుకొన్న పుణ్యాంగనలు.

భక్తిభావసంపన్నులయిన స్త్రీలు హస్తినదాటి ద్వారకకు పయనిస్తున్న శ్రీకృష్ణుని చూచి మాట్లాడుకొన్న తీరు భిన్నంగా ఉంది. 'తరుణీ! వెళుతున్న కృష్ణుడు యాదవవంశవిభుడే కాదు. వేదాలద్వారా తెలియబడే పరమాత్మ, విశ్వసృష్టిస్థితిలయాలు కల్పించే ఆదిదేవుడు. లీలావిలాస రతుడు. ఇతని లీలలు అనంతం. మన అదృష్టం కారణంగా చూడగలిగాం' అని ఆనందంతో గంతులు వేసారట.

'చెలీ! ఇతడు సామాన్యుడు కాడు. పరమాత్ముడు. ఆయా యుగాలలో ధర్మసంస్థాపనార్థం అవతరించే లీలావినోది. తమో గుణులయిన ప్రభువులను దండించేవాడ'ని చెప్పింది.

హస్తినలోని యాదవాంగనలు కృష్ణుని చూచి 'ఈ పవిత్ర కీర్తనుడయిన స్వామి అవతరించడం కారణంగా యాదవవంశం వాసి గాంచింది. ఈ సత్యమార్గప్రవర్తకుడు నివసించడంవల్ల మధురానగరం ప్రఖ్యాతిబడసింది. ఈ పురుషోత్తముడు సదా విహరించడంవల్ల ద్వారక ధన్యమయింది. ఇతని కారణంగా శిష్టరక్షణ, దుష్టశిక్షణాదులు జరిగాయి. సమస్త విశ్వం బాధావిముక్తమయింది. అంతేకాదు గోపకామినీసమూహం రేపల్లెలో విశ్వమోహనమూర్తి సౌందర్యం వీక్షించి పులకించి కృష్ణప్రేమలో తమ్ము తాము మరచింది' అని తమ అనుభూతిని ప్రకటించుకొన్నారు.

'ఆహా! కమలాక్షుడు, సౌభాగ్యమూర్తి, కరుణావారాశిని పెళ్ళాడినవారు ధన్యులు కదా! స్వామిని వారు సేవించగలిగారు. సంసారయాత్ర కొనసాగించారు. ఈ భాగ్యం రుక్మిణాదులకే కలగడం విశేషం. వారికి ఈ అదృష్టం కలగడానికి వారు పూర్వజన్మలో ఎన్ని తీర్థాలను నిష్కళంకంగా దర్శించారో, ఎన్ని నోములు నోచారో' అని సంభావిస్తుంటే కృష్ణుడు వారి మాటలను వింటూ నవ్వుతూ నగరం దాటాడు.

శ్రీకృష్ణుడు హస్తినవీడి ద్వారకానగరం ప్రవేశించినవేళ అక్కడి అంతఃపురకాంతల అనురాగప్రదర్శనలోకూడా వారి చిత్తవృత్తులు ప్రస్ఫుటితమయ్యాయి.

కృష్ణుడు వస్తున్నాడని తెలియగానే చంటిబిడ్డల చంకల నెత్తుకొని ఎదురేగినారట. కృష్ణవిరహం కారణంగా శుష్కించినవారయినా అభిమానంతో ఎదురేగారు. మరి కొంతమంది తమ నడుము మొలనూళ్ళు జారిపోతున్నా బిరబిరా కదలినారట.

శ్రీకృష్ణుడు లీలామానుషవిగ్రహుడు. 16108 మహిళలను ఏకరూపంలో దర్శించడం సాధ్యంకాదు కనుక యోగశక్తితో అనేకరూపాలతో అంతఃపురాలలో ప్రవేశించాడు.

అంతఃపురస్త్రీలు సామాన్యస్త్రీలకంటె భిన్నమయినవారు. కొందరు సరసాలాపప్రియులు. కొందరు విరసభావపూర్ణులు. ఇంకొందరు సమయానికి తగినట్లు వీక్షకులు. మరికొందరు కళావిహీనురాలయి ఎదురేగి రావడానికి ఇష్టంలేక అంతఃపురంలోనే దాగినవారు. శరీరసంస్కార కేళీవిహారహాసవనమందిర గమన మహోత్సవ దర్శనం కోరుకొననివారట.

ఆ స్త్రీలు జగన్మోహనలావణ్యులు. వారి చిరునవ్వులో వాల్చూపులు, సుందరరూపాలు అసామాన్యం. మన్మథుడు కూడా తన సమ్మోహ నాస్త్రాలను పక్కకువేసేలా చూడగలిగిన సుందరులు. శ్రీకృష్ణ ఆగమనంతో ఆ స్త్రీలు ఆనందబాష్పాలు రాల్చారు. మనస్సుతో, చూపులతో భావద్వయంతో ఆలింగనం చేసుకొన్నారు. ఆత్మీయులు దూరమయితే విరహం, దగ్గరికి వస్తుంటే ఆనందం. నారీజనమధ్యంలో ప్రాకృత మానవునిలా మెలిగాడు.

* * *

# 4. ద్వారకాపుర మహిళలు

**కుబ్జ**

భాగవతంలో కుబ్జవృత్తాంతం పూర్వభాగంలో ఉంది. శ్రీమద్రామాయణంలో కనిపించే చిన్నపాత్ర మంథర. రాచరికపు వ్యవస్థబలంగా వున్న రోజులలో రాజులు తమ కుమార్తెలకు సుదూరప్రాంతంవారితో వివాహసంబంధం నిశ్చయించేవేళ తమ అమ్మాయితోబాటు కొందరి చెలికత్తెలను, అలాగే తమ రాజ్యంలోని వర్తకుల్ని, పండితుల్ని, బ్రాహ్మణులను కూడా పంపేవారు. ఇక సారెకు సంబంధించిన అంశాలు ఉండనే ఉన్నాయి. తన అమ్మాయికి అన్ని విధాల రక్షగా ఉంటారని చెలికత్తెల్ని పంపడం. వియ్యంకుల రాజ్యంలోని వర్తకులతో స్నేహం పెంచుకొని స్వరాజ్యం వారితో వర్తక వాణిజ్యాల సంబంధం పెంచుకొంటారని వర్తకులను కూడా పంపడం. అలాగే బ్రాహ్మణుల్ని పంపడం. ప్రాచీనకాలంలో బ్రాహ్మణులకు ప్రవేశించని స్థలమంటూలేదు. వారికి అంతఃపురప్రవేశనిషేధమూ లేదు. అంతేగాక వారికి శత్రుమిత్రదేశమనే అవధులూ లేవు. ఈ కారణంగా తమ అమ్మాయి బాగోగులను తెలుసుకొనేవారు. అలాగ శ్రీమద్రామాయణకాలంలో కైకేయితో అయోధ్య చేరిన వృద్ధస్త్రీ మంథర. చిన్నతనంనుండి కైకేయి బాగోగులను చూడడంవల్ల తానూ అయోధ్యాపురిని చేరింది.

మంథర సురూపవతికాదు. గూని–ఆమె గూనికావడానికి చిన్నతనంలో శ్రీరాముడు వేసిన బంతికారణంగా ఏర్పడిన అంగవైకల్యమని కొందరంటారు. ఏది ఏమయినా కౌసల్య కుమారుడు కావడం, తాను కైక క్షేమాదులు కోరేది కావడం గుర్తించదగ్గ అంశమే. చివరకు మంథర కైకకు దుర్బోధచేసి రాముని అడవికి పంపేదాక ఊపిరిపీల్చుకోలేదు. 'నీ కారణంబుగా నీ తండ్రి అనుప చేకొన్న ప్రేమ వచ్చినదాన నేను –

నీ లెస్స నా లెస్స నీవైనవేమి నావేమిగాన' అని పొగబట్టింది. రామకథ తిరగడానికి మంథర కారణమనకతప్పదు.

అలాగే రామాయణంలో 'శబరి' వృత్తాంతం. తనకు ఆశ్రయమిచ్చిన మతంగమహర్షి తనువు చాలించినా శ్రీరామసందర్శనార్థం బతికిన భక్తురాలు. శ్రీరాములవారికి రుచికరమైన ఫలాలు అందించాలనే కోరికతో తన ఆశ్రమంలోని అన్ని ఫలవృక్షాలను పరిశీలించి ఎంపిక చేసిన ఫలాలతో అర్చించిన నిర్మలభక్తికల మానిని. శబరి శబరకులజాత అయినా శ్రీరాముడు గుహుని అక్కున చేర్చుకొన్నట్లే ఆ 'మాతను' మాతభక్తికి సంతృప్తిపడి ఆతిథ్యం స్వీకరించాడు.

శ్రీరామావతారంలో శ్రీరాముడు శబరిని అనుగ్రహించినట్లే కృష్ణావతారంలో బాలకృష్ణుడు 'కుబ్జను' అనుగ్రహించాడు. 'కుబ్జ' కూడా గూని. కుబ్జే గడులః గడువంటే కణితి. వీపునగాని రొమ్మునగాని ఘనమయిన కణితిని గడులః అంటారు. కుబ్జ అనుదినం అంతఃపురానికి గంధాదిలేపనాదులు తీసుకువెళ్ళేది.

ఒకరోజు మధురవీధిలో వెళుతుంటే శ్రీకృష్ణబలరాములను చూచింది. ఆ సమయాన పట్టణవాసుల చూపంతా సమ్మోహకమయిన శ్రీకృష్ణుని రూపంమీద లగ్నమయి వుండడం గుర్తించింది. కృష్ణునిది 'శ్రీయుతాకారం' ఆ సమ్మోహన ఆకారానికి ముగ్ధురాలయి రాజాంతఃపురంకోసం తీసుకువెళుతున్న లేపనాదులను కృష్ణునికి సమర్పించింది. శ్రీకృష్ణుడు సంతోషపడుతూ ఆవిడపై కరుణాకటాక్షం ప్రసరించగా ఆమె సుందరాంగి అయిపోయింది. 'త్రివక్ర' త్రివిక్రమావతారుని అనుగ్రహం పొందింది. స్వామికృపాకటాక్షానికి పాత్రురాలయింది. ఆపై కృష్ణుడు ఉద్ధవునితో కుబ్జాగృహానికి వెళ్ళి ఆమె కోరిక తీర్చాడు.

## జాంబవతీకల్యాణం

శ్రీకృష్ణుని అష్ట మహిషులలో రుక్మిణి తరువాత జాంబవతిని చెప్పడం సంప్రదాయం. జాంబవంతుని కుమార్తె జాంబవతి. ఈమె వృత్తాంతం భాగవతం దశమ స్కంధం ఉత్తరభాగంలో (10.2.7-10.7.148) కనిపిస్తుంది.

శ్రీకృష్ణుడు తనమీద ఆరోపించిన నిందను పోగొట్టుకోవడానికోసం తానే ప్రసేనుడు ప్రవేశించిన అడవిలోకి వెళ్ళాడు. అక్కడ భూమిమీదపడిన ప్రసేనుని శవాన్ని, గుర్రాన్ని, దగ్గరే ఎలుగుబంటు పాదచ్ఛాయలను గుర్తించాడు. ఆ పాదచ్ఛాయల ఆనవాలుతో ఒకగుహను చేరి గుహలో ప్రవేశించాడు. అక్కడ ఒక బాలునికి ఎదురుగా కట్టిన స్యమంతకమణిని చూచాడు. ఆ మణిని కృష్ణుడు ఎత్తుకొనేసరికి అక్కడి దాది గట్టిగా కేకలు వేసింది. ఆ కేకలను విని గుహ అంతర్భాగంనుండి జాంబవంతుడు వచ్చాడు. గుహలోకి వచ్చినవాడు ఎవడో అని కృష్ణుని ఢీకొన్నాడు. ఇద్దరికి హెూరాహెూరి సమరం సాగింది. ఆ సమరం 28 రోజులు సాగడం చిత్రం. చివరకు కృష్ణజాంబవంతులు ముష్టియుద్ధానికి దిగారు.

**అడిదములు ౘదరులు విఱిగిన**
**బెడిదము లగు మగతనములు బిఱుతివక వడిం**
**బిడుగుల వడువునఁ బడియెడి**
**పిడికిటిపోటులను గలన బెరసి రిరువురున్ (10.2.65)**

చివఱకు జాంబవంతుని కృష్ణుడు గుద్దగా అతడు బలహీనుడయ్యాడు. అతని ఒళ్ళంతా నుజ్జునుజ్జయింది. ఆ సమయాన తన్నెదిరించినవాడెవడో అని పరిశీలనగా చూచాడు. అతనికి ఎదుటివాడు అవతారమూర్తి అయిన రామచంద్రుడని అవగతం కావడంతో శరణువేడినాడు. ఆ సమయాన

కృష్ణుడు తన రాకకు కారణం విశదం చేయగా జాంబవంతుడు స్యమంతకమణితోబాటు తన తనయామణిని కూడా ఇచ్చాడు. శ్రీకృష్ణుడు జాంబవతిని తన భార్యగా స్వీకరించాడు.

ఈ కథలో రెండు అంశాలున్నాయి. త్రేతాద్వాపరయుగాల అనుసంధానమొకటి. ఓడినవారు ఎదుటివారిని గౌరవిస్తూ కప్పం చెల్లించేలా తన కన్యను ఇవ్వడం. చివరగా భక్తుడు బాగా గాయపడడం గుర్తించి 'శరీరనిగ్రహనివారణంబుగా' కృష్ణుడు మేను నిమిరి స్వస్థుణ్ణి చేయడం.

## నాగ్నజితి

కోసల దేశాధిపతి నగ్నజిత్తు. అతడు సుమతి. ధార్మికుడు. అతనికి ఒక కూతురు. ఆవిడపేరు నాగ్నజితి. గుణవతి. ఆవిడను వివాహ మాడడానికి తగిన అర్హతను నగ్నజిత్తు చాటించాడు. వాడి కొమ్ములు కలవీ, వీరులు తన్ను పట్టడానికి వస్తే కయ్యానికి కాలుదువ్వేవాటిన్ని, మదంతో మత్తెక్కినవీ అయిన ఏడు ఆబోతులను అణచగలిగియుండాలని నిర్ణయం. చాలమంది నాగ్నజిత్తు పెట్టిన పరీక్షలో నెగ్గక వెనుతిరిగి పోయారు. ఈ వార్త కర్ణాకర్ణిగ శ్రీకృష్ణుడు విన్నాడు. తన డాబు దర్పం ప్రకటితమయ్యేలా సైన్యంతో కోసలపురానికి వెళ్ళాడు. నగ్నజిత్తు శ్రీకృష్ణునికి స్వాగతం పలికాడు. ఉచిత మర్యాదలు చేశాడు. కృష్ణుడు అతిథి మర్యాదకు కృతజ్ఞత కూడా చెప్పాడు. కమలాలవంటి కన్నులుగలవాడు. చూడగానే మోహించాలనే అందచందాలు కలవాడు త్రిలోకాధిపుడు మాధవుడొకడే అని మనసా అతనిని వరించింది. పూర్వజన్మలో 'నేను విశ్వవ్యాపకుడు, నాశరహితుడయినవాడే భర్త కావాలని నోములు నోచివుంటే శ్రీకృష్ణుడు నన్ను పెళ్ళాడుతాడనుకొంది' శ్రీకృష్ణుడు సామాన్యుడా. లక్ష్మీదేవి, బ్రహ్మ, శివ, ఇంద్రాదులే స్వామి

పారధూళిని శిరస్సులపై ధరిస్తారు. దుష్టశిక్షణకోసం అవతారాలెత్తేవాడు నాపట్ల ఎలా నడచుకొంటాడో అని మనసులో తర్కించుకొంటూ ఉండగా ఆ సందర్భంలో శ్రీకృష్ణుడు మేఘగంభీరనినాదంతో 'నేను మంచితనంతో వచ్చాను. నీ కుమార్తెను పెళ్ళాడతలచుకొన్నాను. కన్యాశుల్కం ఇచ్చేవాళ్ళం కాము. అన్యులను యాచింపనివారము అన్నాడు.

నగ్నజిత్తు స్వయంవర నిర్దేశ నియమాన్ని ప్రకటించాడు. శ్రీకృష్ణుడు అలాగేనంటూ క్రూరస్వభావం కలవీ, పరాక్రమవంతుల ముఖాలలో కండలను పీకగలిగినవీ, పాపకార్యాలు చేసే కొండలాంటి ఆబోతులను చూచాడు. నడుముకు వస్త్రం బిగించి కట్టుకొని, ఏడు రూపాలు ధరించి పసిపిల్లవాడు ఏడు చెక్కబొమ్మలను పట్టుకొన్నట్లుగా ఆబోతులను పట్టుకొని గుద్ది నేలమీద పడవేశాడు. నగ్నజిత్తిని తన మాట ప్రకారం శ్రీకృష్ణునికి ఇచ్చి పెళ్ళిచేశాడు. ఆపై అనూహ్యమయిన సారె సమర్పించి ద్వారకకు పంపాడు. కాని నగ్నజిత్తిని పెళ్ళాడాలని వచ్చిన రాజులు నగ్నజిత్తు పెట్టిన పందెంలో నెగ్గలేక నగ్నజిత్తుతో కృష్ణుడు వెళుతున్నాడని ఎదుర్కొన్నారు. అపుడు అర్జునుడు అడ్డుపడి శత్రుసంహారం చేశాడు. ఈ విధంగా నాగ్నజిత్తిని పెళ్ళాడిన కృష్ణుడు ద్వారక చేరాడు.

ఈ సన్నివేశంలో సందేశాలున్నాయి. తన అమ్మాయి వీరుణ్ణే వరించాలనే షరతు తప్పేమికాదు. గెలిచినవాడు పొగరెక్కిన ఆబోతులను అదుపులో తీసుకొన్నా వాడు సామ్రాజ్యంలోని పొగరెక్కినవారిని అణచగలడనే ధీమా తనకు కలగడంకట్నాలు, కానుకలు రాజోచితంగా ఇవ్వడంలో నాగ్నజిత సంపద తెలియడానికి వీలయింది. కొత్తప్రదేశంలో హాయిగా సంచరించడానికి వీలుగా నాగ్నజితితో విచిత్రమయిన వస్త్రాభరణాలు ధరించిన మూడు వేలమంది యువతులను తన కుమార్తెతో పంపడం సరియగు నిర్ణయమే.

## దేవకి

దేవకివృత్తాంతం భాగవతం నవమ స్కంధంలోను, దశమ స్కంధంలోను కనిపిస్తుంది. పూర్వజన్మలో ఆమె 'పృశ్ని' అనే పేరుగల పతివ్రత. అదితియే దేవకిగా పుట్టిందని మరో కథనం.

'దేవాపు' అనేవానికి జన్మించిన ఏడుగురు కుమార్తెలలో దేవకి ఒకతె. ఈమె వసుదేవుని భార్య. పురాణాల ప్రకారం దేవకిసోదరుడు కంసుడు. కంసునికి దేవకి అంటే పంచ ప్రాణాలు. దేవకీవివాహం వసుదేవునితో జరిగాక వారిద్దరిని రథంలో కూర్చోబెట్టి తానే రథం తోలాడు. ఆ రథంవెంట తండ్రి ఇచ్చిన సారె వాహనాలతో కదిలింది. ఆ సందర్భాన ఆకాశవాణి

'వెర్రివాడా! తెగ సంతోషంతో రథం నడుపుతున్నావు. నీ చెల్లెలి కడుపున పుట్టబోయే అష్టమ సంతానం నిన్ను హరించడం ఖాయం.' ఆకాశవాణివల్ల విన్న వార్త కంసుని కకావికలు చేసింది. చెల్లెలు బతికుంటే కదా ఈ విపత్తని చెల్లెలిని చంపడానికి సిద్ధమయ్యాడు. వసుదేవుడు దేవకిసౌశీల్యాన్ని పొగడుతూ చంపవద్దని కోరుకొన్నాడు. వసుదేవుడు దేవకిసుగుణాలను ప్రస్తావిస్తూ 'అమాయకురాలు, అశక్తురాలు, కంసుని మేలుకోరేది. ఎలాంటి కల్మషాలులేని స్నేహితురాలు సంభావనీయ చరిత్ర. భీరువు. బాల. ఇపుడే పెండ్లాడిన సుమంగళి. దీనకంపితచిత్త. అయినా కంసా! దేవకి అష్టమ గర్భంవలన కదా ముప్పు ఎపుడో జరగబోయేదాని గురించి నీకు ఈ చింత ఎందుకు? అయినా పుట్టబోయే సంతానాన్ని నేనే నీకు ఇస్తాను' అనేసరికి కంసుడు చల్లబడ్డాడు.

కంసుని కారణంగా ఎన్నో కష్టాలుపడుతూ దేవకి విధివశాన సంతానం కంటూ వుంది. వసుదేవుడు ఆ సంతానాన్ని తన మాట ప్రకారం ఏడుగురు కొడుకుల్ని, కంసుని సాన్నిధ్యంలో నిలుపగా

వసుదేవుని నియమం నచ్చడంతో కంసుడు నీ కొడుకులను నీవే తీసికెళ్ళు అనేవాడు.

ఒకరోజు నారదుడు రానే వచ్చాడు. కంసునితో ఏకాంతంగా 'కంసా! ఒక రహస్యం చెబుతాను విను. నందాదులు, వారిభార్యలు, పుత్రులు, బాంధవులు, దేవకీవసుదేవులు, సర్వయాదవులు నరులని అనుకొంటున్నావేమో. వారు 'సురలు' నీవు రాక్షసుడవని వారికి తెలుసు. తగిన సమయంలో నీ అంతు తేలుస్తారు' అనగానే కంసుడు మూగవాడయ్యాడు. తాను గతజన్మలో 'కాలనేమి' నామకుడనని గుర్తుకు తెచ్చుకొన్నాడు. శ్రీహరే తన్ను గతంలో హతమార్చినాడని మననం చేసుకొన్నాడు. ఇలాంటి సందర్భంలో తాను బలవంతుడు కావాలని నిశ్చయించుకొని బాణాసుర, నరకాసుర, జరాసంధ, బకాసురాదుల సాయంతో ఇతరుల్ని ఓడించాడు. నిషధ, కురు, కోసల, విదేహ, విదర్భ, కేకయ, పాంచాల, సాల్వ దేశాలలోని యాదవులు కంసునికి దాసోహమన్నారు. ఆపై వసుదేవుని కొడుకులయిన ఆరుగురిని వధించాడు. తదనంతరం ఆదిశేషుడనే మహనీయమయిన, మనోహరమయిన విష్ణుతేజము దేవకీదేవిగర్భంలో ఏడవ శిశువుగా జన్మించింది. ఆ సమయంలో స్వామి యోగమాయతో

'నీవు వెనువెంటనే వెళ్ళు. వసుదేవుని భార్యలందరు ప్రస్తుతం బందీలే'. కాని ఒక భార్య రోహిణి వ్రేపల్లెలో నందాదుల ప్రాపకంలో ఉంది. రోహిణి సద్గుణశోభిత. దేవకికడుపులోని నా శేషతేజస్సును నీవు బయటికి తీసి నేర్పుగా వ్రేపల్లెలోని రోహిణీగర్భంలో ప్రవేశపెట్టు. నేను సకల శక్తులతో వైభవంగా దేవకీదేవి కడుపున పుడతాను. ఆ తరువాత నీవు నందుని భార్య గర్భంలో ప్రవేశించు. నీవు సకల శుభప్రదాతవని, సంపన్నిలయ అని మానవులు భవిష్యత్తులో నిన్నే సేవిస్తారు' అనడంలో యోగమాయ అలాగే చేసింది. అపుడు మధురానగరవాసులు దేవకీదేవి గర్భం నిలవలేదని బాధపడ్డారు.

రోహిణీదేవికి కొడుకు పుట్టాడు. పుట్టినవాడు బలవంతుడు కావడంతో బలరాముడని పేరుపెట్టారు. సర్వలోకాలకు ఆనందం కలిగించేవాడు కనుక సంకర్షణుడనే పేరు స్థిరపడింది. బలరామ జననాంతరం శ్రీ విష్ణువు అంశ వసుదేవునిలో ప్రవేశించగానే సర్వజగాలు సంతోషించేలా సూర్యతేజోరాశిగా ప్రకాశించాడు. ఆ తేజస్సే దేవకీగర్భమై నిలిచింది. రేయి గడుస్తుండగా బాలిక ఆవురావురుమని ఏడ్వడంతో కావలివారు నిద్రలేచారు. కంసునికి ఆ వార్త చేరవేశారు. కంసుడంతటి వాడు లేచివచ్చి శిశువును చంపడానికి సిద్ధమయిన దేవకి బిడ్డకు కంసునికి అడ్డమై నిలిచింది.

'అన్నా! శాంతించు. వీడు నీ మేనల్లుడు కాడు. మేనకోడలు ఆడపిల్లను చంపడం న్యాయం కాదు. మంచి పేరు తెచ్చుకో. నేను నీ సోదరిని ఆర్గురిని చంపినా నేను ఊరకున్నాను. పుట్టినవాడు కొడుకు కాడు. అందుచేత పుత్రీదానం చేసి పుణ్యం కట్టుకో' అని ప్రార్థించింది.

ఎక్కడ బిడ్డను చంపుతాడోనేమో అని దేవకి సామాన్యస్త్రీ లాగ బిడ్డను అక్కున చేర్చుకొంది. చెక్కు చెక్కునమోపి ఉత్తరీయాంచలంతో బిడ్డ కనబడకుండా చేసింది. కాని కంసుడు సోదరిని తిడుతూ ఆ పాపకాళ్ళు రెండూ ఎగసిపట్టి లాగి నేలమీద కొట్టాడు. కాని ఆ పాప నేలపడలేదు. అవలీలగా పైకెగిరింది. స్వర్లోకపుష్పపరిమళాలతో కిరీటధారిణియై దివ్యాంబర ఆలంకృతయై మనోహరంగా కనిపించింది. ఎనిమిది చేతులతో, ఆ చేతులలో ఆయుధాలతో దేవతానీకం స్తోత్రం చేస్తుండగా ఆకాశంలో సాక్షాత్కరించి

"కంసా! దయలేక పిల్లల్ని చంపావు. కోపాన్ని అణచుకోలేక నేలకేసి కొట్టావు. నిన్ను చంపడానికి మరోచోట శిశువు జన్మించిందిలే" అని చెప్పి అంతర్ధానమయింది.

పిడుగులాంటి వార్త రెండవసారి వినడంతో కంసుడు దేవకీ వసుదేవుల కాళ్ళబడ్డాడు. ఈ సన్నివేశం తరువాత దేవకి ప్రస్తావన చాల సన్నివేశాల తరువాతనే కనిపిస్తుంది. శ్రీకృష్ణుడు కంసాదులను చంపిన తరువాత మధురకు వచ్చి చెరలో బందీలయిన దేవకీవసుదేవుల చెరమాన్చి ఉగ్రసేనునికి పట్టంకట్టిన తరువాత దేవకి కనబడడం. అంతే దేవకి కథ.

పోతన దేవకిని వర్ణిస్తూ 'మానినీమణి' అన్నాడు. భర్త తాను పెళ్ళాడిన దేవకిని అనేక విశేషణాలతో సంభావించాడు. పుట్టిన శిశువును కంసుడు సంహరించినవేళ దేవకిప్రలాపమంతా గర్భశోక ఆవేదనల ప్రకటనలే.

## పూతన

రాక్షసవంశజుడయిన కంసుని పరివారంలో పూతన ఒకతె. కంసుని ప్రేరణతో వ్రేపల్లెలో శిశువులకు పాలిచ్చి చంపడానికోసం నియోగిత అయిన క్రూరురాలు.

పూతన మధురకు చుట్టువున్న గ్రామాలలో అపుడే పుట్టిన బిడ్డలకు చనుపాలిచ్చేలా నటించి ఎందరో పిల్లల మరణాలకు కారణమయింది. అలాంటి పూతన వ్రేపల్లె చేరింది. మాయారూపాన్ని ధరించింది. వాడవాడతిరుగుతూ వ్రేపల్లెలోని నూతన శిశూదయ వివరాలు తెలుసుకోగలిగింది. చివరకు నందుని ఇంటికి చేరుకుంది. పూతన నూతన వేషాన్ని చూచి వ్రేపల్లెవారు 'మమ్మల్ని అనుగ్రహించడానికి వచ్చిన 'మహాలక్ష్మి' అని అనుకొన్నారు. పూతన నందుని యింట ఉయ్యాలలో పడుకొన్న 'కృష్ణుని' చూచింది. పూతనరాకను కృష్ణుడు గుర్తించినా ఏమీ తెలియనట్లు నిదరోతున్నాడు. పూతన ఉయ్యాలలోని బిడ్డను ఎత్తుకొంది. తన చన్నులమీద ఆనించుకొని ముద్దెట్టుకొంటూ తలనిమురుతూ

'బిడ్డా! నీకు అవసరమయినంత చనుబాలు త్రావించగల వారెవరు నీకు లేరు. నేను నీకు చనుబాలు తాగిస్తా మెదలక ఉండు' అని చెబుతూ మనసులో మాత్రం నీవు చావడమే నా కర్తవ్యం. ఆపైన కర్తవ్యం నెరవేరాక, నేను వెళతాను అని కృష్ణునికి పాలు తాగించడానికి సిద్ధమయింది. కృష్ణునికి రెండు చళ్ళు త్రాగించింది. ఈ దృశ్యాన్ని చూచిన యశోదా రోహిణులు 'ఎవరమ్మా నీవు మా బిడ్డను తాకకు. ముట్టకు ముట్టకు చన్ను గుడువన్ వల్దమ్మ. నీ చన్ను మా తనయుండుల్లడు.' అని గద్దించారు.

పూతన కృష్ణుని ఒళ్ళు నిమురుతూ 'ఆకొన్న చిన్న అన్న చన్నుగుడువు' అని లాలిస్తున్న సందర్భంలో చిన్ని కృష్ణుడు అపుడే లేచినట్లుగా నిదానంగా కళ్ళు తెరచి ఓరగంటితో చూస్తూ ఒడలు విరుచుకొంటూ మూల్గి నిక్కి ఆవులిస్తూ చేతులు చాచి పక్కకు తిరిగి ఆకలి వున్నవాడల్లా పూతన బిగిచనులను చేతులతో గట్టిగా ఒత్తి పట్టుకొని నోటపెట్టుకొన్నాడు. గుటుకు గుటుకుమంటూ రెండు చుక్కలు తాగాడు. ఆ రాక్షసస్త్రీ ప్రాణాలను, దేహబలాన్ని ఆ పాలతోనే పీల్చేశాడు. పూతన గుండె తల్లడిల్లగా వేగంగా తిరుగుతూ నిలబడలేక తలవాల్చి 'ఇతర బాలుర క్రియవాడ నీవు కావు చన్నులు విడు విడు' దీనంగా రోదిస్తూ అణచుకోలేని దప్పికతో శరీరమంతా మంటలు పాకినట్టుకాగా, ధైర్యాన్ని వదలుకొని, కాళ్ళు చేతులు చాచుకొని గుండియలదరే గుబ్బన్ కేకతో నేలకూలింది. ఆ సమయంలో కొండలతోడి భూమి కూడా అదిరింది. లోకాలు అల్లాడిపోయాయి. ఆ రాక్షసి నేలపడినప్పుడు ఆమడల దూరం దాకావున్న పెద్దపెద్ద చెట్లు నుగ్గునుగ్గు అయ్యాయి. నేలమీద పడిన వికృతదేహాన్ని చూచిన గోపాలురు భయపడ్డారు. ఆ సమయంలో గొల్లపిల్లలు రాక్షసిపాలు తాగడానికి ఎగబడ్డారు.

రాక్షసి రొమ్ముమీద ఏ భయమూలేకుండా పారాడే బాలకృష్ణుని చూచి యశోద 'రా బిడ్డా' అని భుజాల కెత్తుకొంది. దేహమంతా నిమిరింది. లాలించింది. దోషపరిహారార్థం పవిత్రమయిన ఆవుతోకతో దిగదుడిచింది. ఆవుకాలిదుమ్మును పంచితాన్ని పైన చల్లి ఆవుపేడను 12 దేవుని నామాలను స్మరిస్తూ 12 అవయవాలకు పూశారు. ఆపైన గోపాలబాలునికి యశోద తన చన్నిచ్చి పాలుత్రాపి పడకమీద పరుండపెట్టి పైన గుడ్డకప్పి 'బిడ్డా! నిదురపోవమ్మా' అని జోలపాట పాడింది.

ఈలోగా నందాదులు మధురనుండి తిరిగి వచ్చారు. రక్కసి వృత్తాంతమంతా తెలుసుకొని గతంలో వసుదేవుడు చెప్పినదంతా నిజమని అవగతం చేసుకొంటూ పూతనదేహానికి దహనక్రియలకు ఏర్పాటు చేశాడు. పూతనిది బృహద్దేహం కనుక శరీరాన్ని గొడ్డలితో నరికి తమ ఇళ్ళకు దూరంగా చంద్రకట్టెలతో దహనం చేశారు. పూతనశరీరం కాలుతుంటే ఆ దేహం నుండి సువాసనలు వ్యాపించాయి.

పూతన రాక్షసి అయినా ఏతల్లికి దక్కని బాలకృష్ణునికి స్తన్యమిచ్చే భాగ్యం నోచుకోవడం కారణంగా ఆవిడ పునీత అయింది. పూతన నామం సార్థకమయింది. పోతన పూతనను తీర్చిన విధానం చమత్కారయుతం.

ఈ వృత్తాంతంలో పూతనను తప్పు పట్టడానికి వీలులేదు. రాజు చెప్పినదాన్ని ఆచరించడమే సేవకుల పని. అంతేగాక తమ రాజుకు హానికలిగించేవారి అంతు కనుక్కోవాలనే ఆరాటం కూడా లేకపోలేదు. ఎందరో శిశువులను చంపగలిగినా బాలకృష్ణుని దగ్గర ఆమె ఆటలు సాగకపోవడం విధివైపరీత్యమే.

## భద్రావివాహం

కేకయ రాజు కుమార్తె భద్ర. భద్ర తల్లి శ్రుతకీర్తి. ఆవిడ శ్రీకృష్ణుని మేనత్త. సుదర్శనరాజు కూతురు భద్ర చాల అందగత్తె. విమలా లోలాపాంగ. నీతిపట్ల జాగరూకత కలది. అపారమైన సద్గుణాలు కలది, ఉత్తమురాలు. ఆ భద్రఅందచందాలను విని భర్తగా ఆరాటపడిన రాజులు లేకపోలేదు. అలాగే ఆమె సుగుణాలు విని అలాంటిదాన్ని పెళ్ళి చేసుకోవాలని లొట్టలు వేసుకొన్నవారు మరికొందరు. వారంతా ఏకమై భద్రతో ద్వారకకు వెళ్ళే కృష్ణుని మూకుమ్మడిగా ఎదిరించారు. అయినా శ్రీకృష్ణుడు వారిని ఎదిరించి ఓడించి వారు పలాయితులయ్యేలా చేశాడు. 'అమరుల cబాఱ cదోలి భుజగాంతకుcడైన ఖగేశ్వరుండు మున్నమృతము' 10.2.147 తెచ్చుకొన్నవిధంగా భద్రను తన దాన్నిగా చేసుకొని కృష్ణుడు ద్వారకకు చేరుకొన్నాడు.

ఈ వృత్తాంతంలో ఆంధ్రుల వైవాహిక సంబంధమూ ఉంది. మేనత్తకూతురుని వివాహమాడడం ఆంధ్రుల సంప్రదాయం. రాజులను ఎదిరించడం వారు పలాయితులయిన తరువాత వివాహమాడడం ప్రశంసార్హమయిన సంగతి.

## మిత్రవింద

అవంతి దేశాన్ని విందానువిందులు పాలించేవారు. వీరు సదా దుర్యోధనునికి వశులై వర్తించేవారు. వారికి రాజాధిదేవి సోదరి. ఆవిడ కూతురే మిత్రవింద. ఆవిడ అందగత్తె. తుమ్మెదల నల్లదనాన్ని మించిన నలుపురంగుగల శిరోజాలు కలది.

విందానువిందులు చెలియలికి పెళ్ళిచేయాలనుకొన్నారు. స్వయంవరం చాటించారు. ఎందరో రాజులు ఆ స్వయంవరానికి వచ్చారు. ఆ స్వయంవరానికి శ్రీకృష్ణుడు కూడా వచ్చాడు. తన

ప్రతాపతత్త్వంతో స్వయంవరానికి వచ్చిన రాజులందరిని జయించాడు. సదా సజ్జనుల ఆదరించే మిత్రవిందను తన సతిగా కృష్ణుడు ఏలుకొన్నాడు.

భాగవతంలో సంగ్రహాతిసంగ్రహంగా 10.1.124 గద్యంలో మిత్రవింద ప్రసంగముంది. వధువును ఎంపిక చేయడంలో చాల జాగ్రత్త వహించాలి. సజ్జనులను సంతోషపెట్టే గుణం చాలమందికి ఉండదు. ఈ మహద్గుణం ఉండడంవల్లనే శ్రీకృష్ణుడు ఆమెను పెళ్ళాడినాడు. పోతన 'చారు చికుర కాంతి విజిత షట్పదబృందన్' అనే దీర్ఘసమాసంతో మిత్రవిందశిరోజాలు చాల పొడవనే స్ఫూర్తి కలిగించాడు.

## రుక్మిణీవివాహం

భాగవతంలోని కల్యాణాత్మకమయిన కథలలో రుక్మిణీ వృత్తాంతమొకటి. విదర్భదేశంలో కుండినపురాధిపతి భీష్మకుడు. అతనికి ఐదుగురు కుమారులు. ఒక కుమార్తె. కుమారులలో రుక్మి పెద్ద. చివరి సంతానం రుక్మిణి. ఏకైక కుమార్తె కావడం, అందగత్తెకావడం రుక్మిణికి కలిసివచ్చిన అంశాలు.

రుక్మిణి బాల్యం చిత్రంగా సాగింది. ఆవిడకు బొమ్మరిళ్ళ వివాహం ఒక క్రీడ. తన సహచరిణులతో వియ్యమందడం ఒక ఆట. గురుగులతో వంటకాలు చేయిస్తూ తన చెలులకు వడ్డించడం ఆమె తృప్తికి పరాకాష్ఠ. ఉద్యానవనపోషణ, విలాసంగా ఉయ్యాలలూగడం, సహచరిణులతో బంతులాట, నెమళ్ళకు నడక నేర్పడం ఆవిడకు అభిమతమయిన అంశాలు.

రుక్మిణి యువతి అయింది. తన అంతఃపురానికి విచ్చేసే మహాత్ములు సకృత్తుగా శ్రీకృష్ణుని రూపగుణలీలాదులను ముచ్చటిస్తుంటే ఓపికగా వినేది. పెళ్ళాడితే శ్రీకృష్ణునే వివాహమాడాలని మనసా

నిశ్చయించుకొంది. కాని రుక్మికేమో తన చెల్లెల్ని శిశుపాలునికి కట్టబెట్టాలని కొండంత ఆశ. రుక్మిణిలాగే శ్రీకృష్ణుడు తన ఇంటికి వచ్చేవారి ద్వారా  రుక్మిణి అందచందాలు విని పెళ్ళాడితే రుక్మిణినే పెళ్ళాడాలని మనసా నిశ్చయించుకొన్నాడు. రుక్మికి రుక్మిణి ఆలోచనావిధానం నచ్చలేదు. తనకు శత్రుప్రాయుడయిన కృష్ణునితో బంధుత్వానికి ససేమిరా అన్నాడు. శిశుపాలునితో వివాహం జరిపించడానికి సన్నాహాలు మొదలెట్టాడు. తండ్రి నిరుత్తరుడయ్యాడు. ఈ పరిస్థితులలో రుక్మిణి ఒక విప్రుని ద్వారా సందేశం పంపాలని భావించింది. శ్రీకృష్ణుడు తన సందేశం విని పెళ్ళినాటికి రాగలడని విశ్వసించింది. ఆ సందేశంలో తనకు కృష్ణునిపై గల అనురాగం, ఆరాధ్యభావం వ్యక్తం చేసింది. చివరకు దుర్భేద్యమయిన కుండిన నగరానికి విచ్చేసి తన్ను పెళ్ళాడడానికి తగిన ఉపాయం కూడా సూచించింది. పెళ్ళిరోజు రానే వచ్చింది. శిశుపాలుడు తెగసంబర పడిపోతున్నాడు. రుక్మిణి బెంగపెట్టుకొంది. తన సందేశాన్ని విని తన్ను కృష్ణుడు తక్కువగా అంచనా వేశాడేమో అని ఊహించుకొంది. సందేశహారుడు అసలు వెళ్ళాడో లేడో అని పరిపరివిధాల పరితపించింది.

లగ్నసమయం రానే వచ్చింది. రుక్మిణి తనతో నగరు వెలుపల ఆర్యామహాదేవిఆలయానికి బయలుదేరింది. ఇంతవరకు జరిగిన వివాహపు సన్నివేశాలలో 'రుక్మి' మనసా సంబరపడిపోతున్నాడు. శిశుపాలుడు రుక్మి ఇచ్చిన భరోసాతో రుక్మిణిని తన సొత్తుగానే భావించి భావిజీవితం గురించి కలలు కంటున్నాడు. సరిగ్గా రుక్మిణివివాహ ప్రక్రియలలో ఒక భాగమయిన 'గౌరీపూజ' నిమిత్తం తల్లిదండ్రుల అనుమతితో నగరం వెలుపలున్న ఆర్యామహాదేవిఆలయానికి బయలుదేరింది. ఆ సమయంలో రుక్మిణి పడిన మానసికవేదన భరించరానిది. 'ఘనుడా భూసురుడేగెనో' అని ఒకచింత. శ్రీకృష్ణుడు

తన సందేశమంతా విని తన్ను తక్కువదానిగా భావించి తిరస్కరిస్తాడేమో అనే సందేహం. సమయం మించిపోతుంది. పూజానంతరవేళకు కృష్ణుడు రాకపోతే తన గతేం కాను అనే విషాదం. అయినా కృష్ణుడు సమయానికి వచ్చాడు. రుక్మిణిని చేబట్టాడు. తాను 'రాక్షసవివాహవిధానం' ప్రకారం రుక్మిణిని పెళ్ళాడానని సమర్థించుకొన్నాడు. అందులో రుక్మిణిని కూర్చోబెట్టి ద్వారకకు కదిలాడు. అనుకోని ఈ సంఘటనకు రుక్మి, శిశుపాలాదులు అవాక్కయ్యారు. తేరుకొని ప్రతిఘటించినా ఫలితం లేకపోయింది.

రుక్మిణిని శ్రీకృష్ణుడు రథాసీనజేసి తన పట్టణంవైపు వెళుతుండగా రుక్మి మొదలయినవారు అడ్డగించారు. కృష్ణుడు రుక్మిని బంధించి 'బావా! ఇటు రా' అంటూ ఒక బాణంతో మీసాలు, గడ్డం, తలవెంట్రుకలను పాములు పాములుగా గొరిగించాడు. ఈ చేతకు రుక్మిణి బాధపడింది. సహోదరునికి జరిగిన అవమానం మాత్రం రుక్మిణికి నచ్చలేదు. ఆ సమయంలో బలభద్రుడు ఆమెను ఓదార్చడం గుర్తింపదగిన అంశం. ఎన్ని బంధాలున్నా 'రక్తసంబంధం' గొప్పదని భావించడం రుక్మిణి ప్రత్యేకత.

భాగవతంలో దశమ స్కంధం ఉత్తరభాగంలో శ్రీకృష్ణుడు కేళీగృహంలో రుక్మిణీదేవితో విరసోక్తులాడిన సన్నివేశముంది. కులబలరూపశౌర్యాదులు గల శిశుపాలుని వరించలేదెందుకని శ్రీకృష్ణుని ప్రశ్న. ఈ ప్రశ్నలు, సమాధానాలు దాంపత్యజీవితంలో సహజమే. కాని పెళ్ళయ్యాక ఇలాంటి మాటలు రుక్మిణికి అసలు నచ్చలేదు. పులిగాండ్రింపు విని లేడి బెదిరినట్లు బెదరి భూమిమీద పడింది. ఊహించుకోని ఈ సన్నివేశానికి కృష్ణుడు అదిరిపోయాడు. బెదరిపోయాడు. విరసప్రసంగం వినోదం కాదని తెలిసి సపర్యలు చేశాడు. ఇది స్వామికి 'ఆనందలీలావిలాసం'. కాస్త తేరుకొన్నాక రుక్మిణి 'మీ

దృష్టిలో యోగ్యురాలనా? కాదా' అనడంతో కృష్ణుడు ఖంగుతిన్నాడు. 'మిము సేవింపక మానవాధముని ఏలుకొంటానా' అంది. 'నాకోసం వచ్చినవారు మీరే కదా' అనడంతో కృష్ణుడు మౌనం వహించక తప్పలేదు. చివరకు కృష్ణుడే

**అలికులవేణి! నవ్వులకు నాడినమాటల కింత నీమదిం**
**గలcగంగ నేల వేcటలను గయ్యములన్ రతులందు నొవ్వcగా**
**బలికిన మాట లెగ్గు లని పట్టుదురే (10.2.263)** అంటూ

**నీవు పతివ్రతామణివి నిర్మలధర్మవివేకశీల స**
**ద్భావుల నీ మనోగతుల బాయక యెప్పుడు నస్మదీయ సం**
**సేవయ కొని యన్యము భజింపవు పుట్టిన నాటినుండి నీ**
**భావమెఱింగి యుండియును బల్కినతప్పు సహింపు మానినీ(10.2.267)**

అని కాళ్ళబేరానికి వచ్చాడు.

పతియే రూపము దాల్చినందనురూపంబైన రూపంబుతో

సతి దానుండెడు నట్టి రూపవతి రుక్మిణి. కనుకను కృష్ణుడు నారదుడిచ్చిన పారిజాతాన్ని రుక్మిణికే ఇచ్చాడు.

సంసారయాత్రలోని 'సరిగమలకు' చక్కని వ్యాఖ్యానం రుక్మిణీకల్యాణవృత్తాంతం.

## వామాక్షి

మహాభాగవతంలో ప్రస్తావితమయిన చిన్నపాత్రలలో కుచేలుని భార్య వామాక్షి ఒకతె. వామాక్షి మహిళామణి అనడాన్ని పోతన కుచేలోపాఖ్యానంలో 'లలితపతివ్రతాతిలకంబు, వంశాభిజాత్య' అని పరిచయం చేశాడు.

పోతన వామాక్షి తల్లిదండ్రులను గాని వారి నివాసమునుగాని వారి వివాహాది వృత్తాంతాలను చెప్పలేదు. తెరమీద తనకు పుట్టిన సంతానానికి కడుపార అన్నం పెట్టలేకపోతున్నానే అని దైన్యంతో పరితపిస్తున్న ఇల్లాలిగానే పరిచయం చేశాడు.

ఒకరోజు బిడ్డలు ఆకలితో నకనకలాడుతూ ఎండిన పెదవులను నాలుకతో తడుపుతూ, చేతుల్లో ఆకుదొన్నెలు పట్టుకొని 'పట్టెడన్నం పెట్టవమ్మా' అని అడుగుతుంటే తల్లిగా చలించింది. వెనువెంటనే భర్త కుచేలునితో

'మహాత్మ! నీకు కృష్ణుడు బాలసఖుడు కదా. అతడిప్పుడు ద్వారకానగరాధీశుడు కదా. మీరు ఒకసారి ద్వారకకు వెళ్ళితే మీస్థితిని అర్థం చేసుకొని ఆ స్వామి సంపదలను ప్రసాదిస్తాడు కదా' అని సలహా ఇచ్చింది.

'నిజమే! కృష్ణుడు బాలసఖుడే. ఆ మహానుభావుని దర్శించడానికి వెళ్ళాలనే తలంపే సర్వశుభప్రదం. అయినా వట్టిచేతులతో వెళ్ళడం బాగుగాదు. ఏలాగ' అని అంటే కుచేలుని భార్య కొన్ని అటుకులను చినిగిన ఉత్తరీయం కొంగున ముడివేసి ప్రియంగా పతిదేవుణ్ణి పంపింది.

కుచేలునికేమో సవాలక్ష సందేహాలు. సామాన్యుడయిన నేను ద్వారకానగరానికి వెళ్ళగలనా! రాజ్యాధిపతి శ్రీకృష్ణుని దర్శించగలనా. కావలివారు అడ్డగించరా? వారిని సుముఖుల్ని చేసుకోవడానికి నా దగ్గర చిల్లిగవ్వ లేదే అని అనుకొంటూ బయలుదేరినా ఏలాంటి ఆటంకాలు లేక కృష్ణుని అంతఃపురానికి వెళ్ళగలిగాడు. కృష్ణుడు దూరంనుండే కుచేలుని చూచి తానే ఎదురువచ్చాడు. ఆప్యాయతతో కావలించుకొన్నాడు. తన పాన్పుపై పడుకోపెట్టాడు. కుచేలునికి మర్యాదలు చేశాడు. చివరకు కుచేలునితో చిననాటిముచ్చటలు

ప్రస్తావించాడు. చివరకు నాకేమి తేలేదా అని అడిగి కుచేలుడు ఏమి మాటలాడకుంటే అతని జీర్ణవస్త్రంలోని అటుకుల మూటను చూచి 'ఇదేమంటూ' తన చేతులతో అటుకులను ఎత్తుకొని నోటవేసుకొన్నాడు. తనకు సమర్పించిన అటుకులు సకలలోక సంతృప్తిదాయకంగా భావించాడు. మరో పిడికెడు అటుకులకు సిద్ధపడగా రుక్మిణి బహుసంపదలు ఇవ్వడానికి ఇదే చాలంది. ఆరోజు కుచేలుడు శ్రీకృష్ణమందిరంలో గడిపి మరునాడు తన ఊరికి కదిలాడు. తాను వచ్చి కృష్ణుని ఏదీ అడుగలేదు. తీరా ఊరుచేరుకొనేసరికి దివిజ వనితలలాంటి స్త్రీల స్వాగతం. ఎదురుగా స్వర్ణమందిరం, నానారత్న విభూషిత అయిన వామాక్షి కనబడేసరికి ఖంగుతిన్నాడు. పేదరికం అనుభవిస్తున్న నాకు ఇంతకాలానికి ఐశ్వర్యజీవనమా అంటూ శ్రీకృష్ణమహిమను ప్రస్తావిస్తూ జీవితాంతం శ్రీకృష్ణభక్తితో గడిపాడు. భోగాలున్నా ఆసక్తివదలి జీవించాడు.

ఈ వృత్తాంతంలో 'వామాక్షి' చిత్రణ అత్యద్భుతం. సాధారణంగా చేతకాని భర్తను భార్యలు ఆడిపోసుకొంటారు. కాని వామాక్షి ఏనాడును కుచేలుని మాటలతో నొప్పించలేదు. 'జీవితేశ' 'మహాత్మ' అని సంబోధించేది. రెండవది ఉత్తమధర్మపత్నీలక్షణాలు ఆవిడలో కనిపిస్తాయి. 'కరణేషు మంత్రీ' లాగా మంచి సలహాలిచ్చింది. ఎవరిదగ్గరో వెళ్ళి యాచించవద్దు. బాలసఖుని దగ్గరవెళ్ళమనడం మంచిసలహా. రెండవది ఆమెకు గల కృష్ణభక్తికూడా అగాధము, ప్రగాఢము. పద్మపత్రనేత్రుడు, హరికృపాకటాక్షి రవిదీప్తి, సాధుభక్తజనవత్సలుడు, ఆర్తశరణ్యుడు, ఇందిరవరుడు, దయాపయోధి భగవంతుడు అన్నది. అంతేకాదు ఆవిడకున్న విశ్వాసం.

**కలలోనం దను మున్నెఱుంగని మహాకష్టాత్ముడై నట్టి దు**
**ర్బలుఁ దాపత్సమయంబునన్ నిజపదాబ్జాతంబు లుల్లంబులోఁ**

**దలఁప న్నంతన మెచ్చి యార్తిహరుఁడై తన్నైన నిచ్చున్; సుని**
**శ్చలభక్తిన్ భజియించువారి కిడఁడే సంపద్విశేషోన్నతుల్? 10.2.97**

పద్యంలో సుస్పష్టం. కుచేలుడు తన ఊరు తన గృహం చేరుకోగానే ఆనందబాష్పాలతో మనసులో భర్తపాదాలను స్మరిస్తూ 'భావంబున' ఆలింగనము చేసిందట. సుదామునికి భార్య 'మానిని'గా కనబడిందట. మానం అంటే ఆత్మాభిమానము అర్థవిశేషం. ఆమె కుచేలునితో గడపిన జీవితం మాన్యం.

ఈ కథ సందేశాత్మకం. ఒక పేదకుటుంబంలో జీవించేవారు ఎలా గడపాలనడానికి ఈ వృత్తాంతం సాక్ష్యం. కలిమిలో కలిసివుండడం కాదు లేమిలో కలిసివుండడం గొప్ప. వామాక్షి మానినీమణి అనడంలో సందేహం అనకూడదు.

## సత్యభామవృత్తాంతం

సత్యభామకు సంబంధించిన అంశాలు భాగవతం దశమ స్కంధంలోనే ఉన్నాయి. మొదటిది కృష్ణుడు సత్యభామను ఏలుకోవడమయితే రెండవది నరకాసురసంహారసమయంలో సత్యవీరవిహారవృత్తాంతంలో విశదం. ఈ రెండు భిన్నపరిస్థితులలో జరిగిన సంఘటనలు.

సత్రాజిత్తు స్యమంతకమణిని తన తమ్మునికిచ్చాడు. అతడు ఆ మణిధరించి వేటకు వెళ్ళాడు. సింహం అతనిని చంపింది. సత్రాజిత్తు తమ్ముని మెడలోని మణిని జాంబవంతుడు తీసుకుని గుహలోని తన బాలికకు కందుక క్రీడకు ఇచ్చాడు. తమ్ముడు రాకపోవడంతో సత్రాజిత్తు శ్రీకృష్ణునిపై నిందమోపాడు. ఇందుకు ప్రధానకారణం విలువయిన స్యమంతకమణిలాంటివి రాజులదగ్గర వుండదగ్గవి కనుక యాదవరాజుకు

ఇమ్మని కృష్ణుడు చెప్పడమే కారణం. ఏమయితేనేం కృష్ణుడు అడవికి వెళ్ళి ప్రసేనుని శవాన్ని చూచి, ఎలుగుబంటి చిహ్నాలను పరిశీలించి, అక్కడమణిని గ్రహించేవేళ పోరాటానికి సిద్ధమయిన జాంబవంతునితో పోరాడి అతనిని నిస్సత్తువగ చేయగా అతడే స్యమంతకమణిని తన కుమార్తెనివ్వడం లాంటివి సన్నివేశాలు జరిగాయి. చివరకు కృష్ణుడు సభకు సత్రాజిత్తును రప్పించి 'స్యమంతకమణి' ఇచ్చాడు. సభలోని వారందరికి చూపమన్నాడు. సత్రాజిత్తు మణి మరల తన చేతికందినా అనవసరంగా కృష్ణునిపై నిందమోపాను గదా అని పశ్చాత్తాపపడి తన కన్య సత్యభామతో సహా స్యమంతకమణిని ఇచ్చాడు. కృష్ణుడు భామామణిని గ్రహించి మణిని సత్రాజిత్తుకే ఇచ్చేశాడు. ఈ సంఘటనతో కృష్ణునికి మూడవ దేవేరి అయింది. ఈ సన్నివేశంలో సత్యభామ వాక్ప్రసంగం ఏదీలేదు.

సత్యభామలో దాగివున్న వీరోచితవిహారానికి అలాగే మగనిని తనవైపు త్రిప్పుకొనే నైపుణ్యానికి నరకాసురవధఘట్టం సాక్ష్యం. నరకాసురుని సంహరించడంకోసం కృష్ణుడు గరుడుని స్మరించాడు. గరుడుడు రానే వచ్చాడు. నరకాసురునితోటి యుద్ధానికి కదలుతుంటే సత్యభామ 'ప్రాణేశ, మన్నించి నన్నీ వెంటంగొని పొమ్ము నేఁడు కరుణన్' అని ప్రాధేయపడింది. కాని కృష్ణుడు 'యుద్ధభూమి విహారక్షేత్రం కాదని భీకరమూ జుగుప్సావహమూ, భయాపహము. గతంలో ఎవ్వరు సమరభూమికి సతులను తోడ్కొనిపోలే'దని నచ్చచెప్పాడు. కాని సత్య 'నీ మానిత బాహుదుర్గములు మాటున నుండగ నేమి శంక, నీతో నరుదెంతు' అని చేతులు జోడించింది. ఇక తప్పదని కృష్ణుడు సత్యభామాసహితుడయి కదిలాడు. సత్యభామ రణవిహారాన్ని తిలకిస్తూ తానూ విల్లుపట్టాలనుకొంది. కాని కృష్ణుడు మరిచాడు. యుద్ధంలో

నీవు విల్లుపట్టడం మానకపోతే నా విల్లే నీవు తీసుకో అని అనడంతో సత్య నారిని మీటింది. రోషసమ్మోదవీక్షణాలతో నరకుని, హరిని చూచింది. ఒకవైపు వీరవిహారం, మరొకవైపు శృంగారవిలసనంతో సమరం సాగించింది. అల్లెత్రాడు మోత ఉరుముగా, దేవతలే చాతకపక్షులుగా, చేతబట్టిన ధనుస్సు ఇంద్రధనుస్సుగా, శ్రీకృష్ణుడే నీలవర్ణమేఘంగా తానే మెరపుతీగెగా బాణాలు నీటితుంపురులుగా రాక్షసులనే కార్చిచ్చు ఆరిపోయేలా వర్షాకాలాన్ని సృష్టించింది.

సత్య శ్రీకృష్ణునికి చంద్రబింబంలా కనిపిస్తే నరకునికి సూర్యబింబంలా కనిపించింది. సత్య చీరకొంగు మన్మథధ్వజంగా కనిపిస్తే నరకునికి తోకచుక్కలా తోచింది. ఆమె చేతిలోని విల్లు మన్మథుని కాంతి మండలమయితే రాక్షసునికి సూర్యప్రభాపుంజంగా కనబడింది. సత్యభామాసందర్శనం అమృతప్రవాహమయితే నరకునికి అగ్నిజ్వాలా సమూహంలా కనబడింది. ఆ విహారం కృష్ణునికి సమ్మోదక జనకమయింది. చివరకు కృష్ణుడే

**కొమ్మా! దానవనాథుని**
**కొ మ్మాహవమునకు ఁదొలఁగె గురువిజయముఁ గై**
**కొమ్మా! మెచ్చితి నిచ్చెదఁ**
**గొమ్మాభరణములు నీవు గోరిన వెల్లన్ (10.2.187)**

ఆ సందర్భంలో సత్యభామ సమ్మానరూపగా, మోహదీపంబుగా కనబడినదట.

ఆడది మగవారిముందు పౌరుషం ప్రదర్శిస్తున్నప్పుడు నీవు యుద్ధం మానడం పౌరుషమనిపించుకోదు అన్నది సత్యభామ. ఆపై కృష్ణుడు 'నరక ఖండించెద' అని నరకుని సంహరించాడు.

ఈ వృత్తాంతంలో సందేశాలున్నాయి. శ్రీకృష్ణునికి సత్య అత్యంతప్రియురాలు కావడానికి ఆమె రణరంగప్రవీణకావడమే. ఇలాగే స్త్రీలు విశిష్టలక్షణాలు కలవారయితే పతులు ప్రేమింతురని సందేశం.

## లక్షణా వివాహం

భాగవతం దశమ స్కంధంలో ఉత్తరభాగంలో 'లక్షణ' వివాహ వృత్తాంతం ప్రస్తావితం. రుక్మిణీదేవి లక్షణను 'నీ వివాహం ఎలా జరిగిందో చెప్పు'మని ఆదేశిస్తే లక్షణ తన పెళ్ళివిశేషాలు వర్ణించింది.

'నేను మద్రరాజు కుమార్తెను. మా రాజ్యానికి అంతఃపురానికి నారదులవారు తరచూ వచ్చేవారు. ఎంతో అనురక్తితో గోవింద కథాశ్రవణం చేసేవారు. నేను ఆ కథాశ్రవణంతో తన్మయురాలను అయ్యేదాన్ని. నా చిత్తప్రవృత్తిని తండ్రి గుర్తించాడు. శ్రీకృష్ణుడొకడే తాను విధించిన షరతులో నెగ్గేలాగున మత్స్యయంత్రం నిర్మించాడు. ఎవరయితే ఈ యంత్రభేదనం చేస్తారో వారికే నా కన్యను కట్టబెడతానని చాటించాడు. మద్రరాజు ప్రకటన విని చాలమంది వచ్చారు. వచ్చిన వారందరికి అర్ఘ్యపాద్యమజ్జన భోజనవసతి తాంబూలాది అతిథి మర్యాదలను మద్రపతి చేశాడు.

స్వయంవరమంటపంలో సర్వం సన్నద్ధమయింది. రాజులు యంత్రభేదనానికి ముందుకు వచ్చారు.

**కొందరు పూనలేక చనఁ, గొందఱు పూని కదల్పలేక పోఁ**
**గొంద ఱొకింత యెత్త నొక కొందఱు మోపిడలేక దక్కఁగాఁ**
**గొంద ఱొకింత యెక్కిడుచుఁ గోరి నృపాలకు లిట్లు సిగ్గనుం**
**జెంది తలంగి పోవుచును సీ యిట కేఁగుట నీతి తప్పనన్**
**(10.2.1090)**

నా వివాహప్రకటనకు స్పందించి భీమ, కర్ణాదులు కూడా వచ్చి మత్స్యయంత్రభేదనం చేయలేక విఫలులయ్యారు. ఆ రాజన్యులందరు చూస్తుండగా శ్రీకృష్ణుడు అవలీలగా మత్స్యయంత్రాన్ని ఛేదించాడు.

అర్జునుడు ద్రౌపదీస్వయంవరసందర్భంలో మత్స్యయంత్రఛేదనం చేసినవాడే. ఆ యంత్రంలో చేప కనబడుతూ వుంటుంది. కాని మద్రరాజు కూర్చిన యంత్రంలో చేప కనబడదు. కనుక ఇతరులు పరాజితులయ్యారు. మరొక ఆశ్చర్యం అర్జునుడు కూడా ఈ పరీక్షలో పరాజితుడు కావడం.

మద్రసుత లక్షణ ఒయ్యారం ఒలకేలా నడుస్తూ చివరకు 'దివ్యమణి కాంచనమాలికను' శౌరిమెడలో వేసింది. శ్రీకృష్ణుని కొప్పుపై ఇప్పపూల మాలసహితం వేసింది. అపుడు మంగళవాద్యాలు మోగాయి. దేవతల సైన్యాన్ని పారద్రోలి గరుత్మంతుడు అమృతభాండాన్ని చేజిక్కించుకొని వెళ్లినట్టు నన్ను బంగారురథంలో పయనం సాగించాడు.

శ్రీకృష్ణుని వైభవానికి ఈర్ష్యపడినవారు స్వయంవరనియమాలు ఉల్లంఘించి ఆయన మహిమల్ని తెలుసుకోలేక గర్వాంధకారంతో గుంపులు కట్టి యుద్ధసన్నద్ధులయ్యారు. అందరు శ్రీకృష్ణుని చుట్టుముట్టగా వాయవ్యాస్త్రం ప్రయోగించి ఎదురించినవారు చెట్టుకు ఒకరుగా పుట్టకు ఒకరుగా వెళ్ళి చెదరిపోయారు. చివరకు 'మహిత మంగళాలంకృతము అతి మనోహరాభిరామ'మయిన ద్వారకానగరం చేరాము. మాతో మా తండ్రి కూడా రావడం నాకెంతో సంతోషం. ఆ సందర్భంలో తండ్రి శ్రీకృష్ణులవారికి అరణంగా గండపెండేరాలు, హారకుండల కిరీట కంకణాదుల్ని అసంఖ్యాకంగా అర్పించాడు. అంతేకాదు వరుసక్రమంలో దేవకీవసుదేవులను యదుపుంగవులను పూజించి ఆపై రాజధాని మరలినాడు' అని తన కథను విశదం చేసింది.

ఈ కథలో కొన్ని విశేషాంశాలున్నాయి. మొదటిది తన పెళ్ళికథను లక్షణ తానే చెప్పడం. మద్రరాజు తీర్చిన యంత్రం ద్రుపదరాజు తీర్చిన

యంత్రం కంటె భిన్నంగా తీర్చడం, అర్జునుడు విఫలుడు కావడం మద్రరాజు ద్వారకకు వచ్చి దేవకీవసుదేవాదులకు నమస్కరించడం, యదుపుంగవులను పూజించడం.

ఒక తండ్రి తన కూతురు ఎలా ఉండాలో తీర్చడం ఈ కథలోని విశేషం. బాల్యంనుండి కృష్ణభక్తురాలుగా తీర్చడం. అలాగే కానుకలు పూజనాదుల ద్వారా కృష్ణపరివారాన్ని సత్కరించడం. ఇవన్నీ భావిజీవితానికి పడికట్టులయ్యాయి.

**కాళింది**

కాళింది వృత్తాంతం పోతనభాగవతం దశమ స్కంధం ఉత్తర భాగంలో ఉంది.

కృష్ణార్జునులు ఒకసారి అరణ్యానికి వెళ్ళారు. అక్కడ రకరకాలయిన జంతువులను వేటాడినారు. చనిపోయిన మృగాల నన్నిటిని సేవకులు రాజుగారికి తెచ్చి యిచ్చారు. ఆ సమయంలో అర్జునునికి దాహం వేసింది. నరనారాయణులిద్దరు యమునానదికి వెళ్ళి దాహం తీర్చుకొని ఒక చోటికి వచ్చి విశ్రమించారు. సరిగ్గా ఆ సమయంలోనే యమునాతరంగాలలో తుమ్మెదల సమూహాన్నే ధిక్కరించే శిరోజశోభతో బాలచంద్రునిలాంటి నెన్నుదురుతో, అద్దాలవంటి చెక్కిళ్ళుగల ఒక తనయ రానే వచ్చింది. శ్రీకృష్ణుడు దూరంనుండి చూచినా ఆమె ఎవరో తెలుసుకురమ్మని అర్జునుని పురమాయించాడు. అర్జునుడు అలాగే అంటూ అతిలోకసుందరి అయిన ఆమె దగ్గరికి వెళ్ళి

'సుదతీ! నీ వెవరివి! ఎందుకోసం ఇక్కడికి వచ్చావు. నీ పేరేమిటి? నీ కోరిక ఏమిటి? వివాహకాంక్షతో ఈ నదీతీరప్రాంతానికి వచ్చావా? నీ రాక ధన్యమయింది. నీ ప్రయత్నం నెరవేరుతుంది. నీకు సంబంధించిన విశేషాలు చెప్పు' అని ప్రశ్నించాడు.

అపుడా సుందరి 'నరవీరోత్తమ! యేను సూర్యుని సుతన్. నా పేరు కాళింది. భాస్కర సంకల్పిత గేహమందు నదిలోఁ గంజాక్షు విష్ణుం బ్రభున్ వరుగాఁ గోరి తపంబు సేయుదు. నొరున్ వాంఛింప గృష్ణుండు వన్యరతిన్ వచ్చి వరించునంచు బలికెన్ నా తండ్రి నా తోడుతన్ (10.2115)' అని చెప్పింది. వెనువెంటనే అర్జునుడు ఆ సూర్యతనయ వృత్తాంతాన్ని శ్రీకృష్ణునికి చెప్పాడు.

సర్వజ్ఞుండయిన హరియు నెన్నడుముగల కాళిందిని రథమెక్కించుకొని ధర్మరాజు దగ్గరికి వెళ్ళాడు. ధర్మరాజు సాంతం విన్నాడు. వెనువెంటనే పాండవులుకోరగా విశ్వకర్మ వచ్చి ఇంద్రప్రస్థపురాన్ని చిత్రవిచిత్రంగా అలంకరించి తీర్చిదిద్దాడు.

ఆపై కృష్ణార్జునులు ఖాండవవనదహనం కోరిన అగ్నికి బాసటగా నిలిచారు. అగ్ని అర్జునునికి అక్షయతూణీరాలు, దుర్భేద్యమయిన కవచం, గాండీవమనే ధనుస్సు, దివ్యమైన రథమూ ఇచ్చాడు. తెల్లగుర్రాలు సమర్పించాడు. అగ్ని జ్వాలలనుండి అర్జునుడు మయుని రక్షించినందున ఆ మయుడు సంతోషంతో ఒక మహాసభను నిర్మించి అర్జునునికి బహూకరించాడు. ఆ సభలోనే దుర్యోధనుడు ఉపశమించుకోలేని అవమానం పాలయ్యాడు. ఈ వ్యవహారం పూర్తి అయ్యాక కృష్ణుడు ధర్మరాజాదుల దగ్గర సెలవు పుచ్చుకొని సాత్యకి ప్రముఖ సహచరులు కొలువ మరల తన పురం చేరుకొని బంధుజనమంతా సంతోషపడగా ఒక పుణ్యదివసాన శుభలగ్నంలో కాళిందిని వివాహమాడాడు.

ఈ వృత్తాంతంలో కోరి వచ్చినది కాళింది. కోరిన కోర్కె సమంజసం. అంతేగాక తండ్రి చెప్పినట్లే నడచిన తనయ. ఆ కారణాన వలచి వచ్చిన వనిత అనక ఆరాధించి వచ్చిన అతివ కాళింది అనడం సబబు.

## నరకుని చెఱశాలలోని రాజకన్యలు

శ్రీకృష్ణుడు నరకాసురుని వధించాక అతని సౌధంలో ప్రవేశించాడు. నరకుడు అనేకానేక రాజులను ఓడించాక చెరబట్టి తెచ్చిన మహనీయులు, గుణవతులూ అయిన పదహారువేలమంది రాజకన్యలను చూచాడు. ఆ రాజపుత్రికలు రాక్షససైన్యసంహారుడూ, సుందరాకారుడు, సుగుణాధారుడు, మానినీ మానసచోరుడు, ఆశ్రితమందారుడు, మనోహరుడు, రత్నకిరీటధరుడయిన శ్రీకృష్ణుని కుతూహలంతో చూచారు. శ్రీకృష్ణుని సౌందర్య, గాంభీర్య చాతుర్యాది గుణంబులకు మోహించారట. వారిలో తమకం రెట్టింపయింది. ధైర్యాన్ని వదలిపెట్టారు. సిగ్గులను దూరం చేశారు. మన్మథబాణాలకు గురి అయ్యారు. దైవయోగంతో పరాయత్తచిత్తమనస్కులయ్యారట. అతడే తమకు ప్రాణవల్లభుడని మనసా వరియించినారట.

కన్యకలు తమ్ము కృష్ణుడు పెళ్ళాడుతాడని భావించారు. వారి తలంపు తెలుసుకొన్న కృష్ణుడు వారికి తెల్లచీరలు, ఆభరణాలు, పూలమాలలు, సుగంధపు పూతలు పంపాడు. ఆ పదహారువేలమందిని పల్లకీలలో ఎక్కించి ద్వారకకు పంపాడు. శుభముహూర్తాన పదహారువేల మందిని పదహారువేల భవనాలలో, పదహారువేల రూపాలలో వివాహ మాడినాడు.

శ్రీకృష్ణుని దర్శించిన పదహారువేలమంది పడతుల భావాలు చిత్రవిచిత్రాలు. ఒకతె ఈతనిని వరించడానికి ఏ సౌభాగ్యవతి ఏ అరణ్యాలలో, దుర్గాలలో ఎంత తపం చేసిందో అన్నది. మరొకతె ఇంతటి సౌందర్యాన్ని, శౌర్యాన్ని, గాంభీర్యాన్ని చూచామా అన్నది. మరి కొందరయితే నేను వైజయంతికనయితే మెడలో వేలాడేదాన్ని కదా అనుకొంది. ఒకతె పట్టువస్త్రమయితే శరీరంపై ప్రకాశించేదాన్ని కదా

అన్నది. నేను కౌస్తుభమణిని అయితే వక్షఃస్థలంపై మెరిసేదాన్ని కదా అంది. నేను పాంచజన్యాన్ని అయితే పెదవిని తాకి పరవశించేదాన్ని కదా అంది. నెమలిపింఛమయితే శిరస్సుపై కాంతులతో విరాజిల్లేదాన్ని కదా అంది ఒకతె. శ్రీకృష్ణుని చూస్తూ ప్రతి వనిత నన్నే వరించాడనుకొంది. మరొకతె నావైపే చూశాడని అంది. నా దగ్గరికి వచ్చాడని అంది ఒకతె. నన్న వర్ణించాడని అంది ఒకతె. నన్ను గౌరవించాడు, కరుణించాడని చెప్పింది ఒకతె. నా పేరడిగాడు. నన్ను పెళ్ళాడతానన్నాడే అంది ఒకతె. నేను శ్రీకృష్ణుని భార్య కావడం ఖాయమంది.

## మధురానగర ప్రవేశసందర్భంలో మహిళల సంరంభం

శ్రీకృష్ణుడు మధురలో ప్రవేశించినాడని తెలిసి ఆ పురవాసినులు అచ్యుతుడు వస్తున్నాడు. రండి రండి అంటూ వచ్చారు. అలా వచ్చేవారిలో కృష్ణుని చూడడానికి ఉబలాటపడి ఒకరినొకరు పిలుచుకొన్నారు. అన్నం తింటున్నా కంచాలను పక్కకు పెట్టారట. పడుకొన్నవారు లేచారట. తలంటుకొన్నవారు నీరాడక వచ్చారట. పెద్దలు ఏమిటీ పరుగు అంటున్నా లెక్కచేయక వచ్చారట. పసిపాపలను పట్టుకొన్నవారు, పసిపిల్లలను వదలి పెట్టారట. అలంకరించుకొంటున్నవారు తారుమారుగా అలంకరించుకొని బయలుదేరారట. మేడలమీద గుంపులు గుంపులుగా నిలబడి కృష్ణదర్శనం చేస్తూ శ్రీకృష్ణుని బాలక్రీడలను స్మరించుకొన్నారు. గొల్లపిల్లల మనసుదోచినవాడు ఇతడేనా, ఇతడు లేని పట్టణం అరణ్యం. ఇతణ్ణి కలియని జన్మ నిరుపయోగం. ఇతణ్ణి పలుకరించని పలుకు పక్షి పలుకు. ఇతణ్ణి చూడని చూపులు వ్యర్థం. ఇలా పట్టణప్రమదలు అదేపనిగా తమ నేత్రాలతో హరిరూపాన్ని ఆస్వాదిస్తూ హృదయములందు నిలుపుకొని పూలజల్లులు చల్లినారట.

* * *

# 5. మున్యాశ్రమ మహిళలు

శ్రీకృష్ణుడు గోగోపాలకులతో బృందావనాన్ని దాటి దూరంగా తోలుకొనిపోయి ఆవుల్ని మేపుతున్నాడు. ఆ రోజు ఎండవేడిమి దుర్భరంగా ఉంది. ఆ ఎండవేడిమికి గోపాలురు తట్టుకోలేకపోయారు. బాగా నీరసించిపోతున్నారు. గోవులు మేసే బయలుకు దగ్గర్లో గొడుగుల్లాంటి ఛాయావృక్షాలున్నాయి. ఆ వృక్షసమూహాన్ని చూచి కృష్ణబలరామ శ్రీదామ దేవప్రస్థ విశాలార్జునుల వారితో గోపాలకులు 'నీడనిచ్చే వృక్షాలను చూడండి. తమకు కీడు తలపెట్టాలనుకొనేవారికి కూడ ఆ చెట్లు ఏమాత్రము హాని తలపెట్టవు. మంచివారిని, చెడ్డవారిని సమభావనతో చూస్తాయి. అంతేకాదు పూలతో, కాయలతో, ఫలాలతో మనోజ్ఞంగా ఉన్నాయి. వాటి బరువుకు వంగివున్నాయి.' ఆ చెట్లనీడల్లోకి ఆలమందను తోలుకొనిపోయి యమునానది ఒడ్డుకు చేరుకొన్నారు. ఆ నది మడుగులలోని చల్లని నీరు త్రావించారు. పచ్చిక బయళ్ళలో మేపుతూ కృష్ణుని కేసి చూచి ఆకలిగా ఉందన్నారు. బలరామకృష్ణులకు భక్తురాండ్రయిన విప్రభార్యలు గుర్తుకు వచ్చారు.

'గోపబాలకులార! వినండి ప్రస్తుతం మనమున్న అడవిలో బ్రహ్మవాదులయిన విప్రులు స్వర్లోకప్రాప్తికోసం ప్రస్తుతం 'ఆంగిరసం' అనే యాగం తలపెట్టారు. మీరు సరాసరి వారిదగ్గరికి వెళ్ళండి. మా అన్నదమ్ముల పేర్లు మనవిచేసి అడిగితే అన్నం పెడతారు. వెళ్ళండి' అనటంతో పేరాశతో వారు బ్రాహ్మణుల దగ్గరికి వెళ్ళి నమస్కారం చేసి 'ధర్మవిదులార! అర్థిప్రదాతలార! ఇక్కడికి దగ్గర్లోనే బలరామకృష్ణులు ఆవులను మేపుతూ అలసిపోయి ఆకలితో అన్నం పెట్టమని మీ వద్దకు మమ్మల్ని పంపారు. కాబట్టి అన్నం పెట్టండి. నకనకలాడేవారిని ఆకలి కారణంగా నీరసించినవారిని మీరాదరిస్తారు కదా మీకు తెలియని

ధర్మసూక్ష్మం లేదు. యజ్ఞదీక్షాదక్షులు పశువిశసనం అయ్యాక భోజనం ఆరగించవచ్చు. ఇతరులకు పెట్టవచ్చు' అన్నారు.

ఈ మాటలతో బ్రాహ్మణులు అజ్ఞానంతో అడిగేవారు వ్రేపల్లె బాలురని గౌరవించకుండా దుర్మతులై 'అన్నం లేదు లేదు' అని గట్టిగానే చెప్పారు. ఈ గద్దింపువిన్న గోపబాలురు నిరాశాపరులై కృష్ణుని దగ్గరికి వచ్చి వారి ప్రవర్తనను విశదీకరించారు. అన్నీ విన్న శ్రీకృష్ణుడు 'సఖులార! మీరు మరల అక్కడికి వెళ్ళండి. ఈసారి అక్కడికి అయ్యలను అడగకండి. అయ్యోరమ్మలతో మా రాక గురించి తెలియజేయండి. తప్పక వారు మీకు అన్నం పెడతారు' అన్నాడు. గోపాలురు సరేనని బ్రాహ్మణసతులను దర్శించి, నమస్కరించారు. వెనువెంటనే వారు గోపాలురను పూజించారు. ఈ చేతకు సంతృప్తిపడిన గోపాలురు,

**"గోవుల మేపుచు నాఁకొని**
**గోవిందుం డన్న మడిగికొని రం డని మ**
**మ్మీ వేళం బుత్తెంచెను**
**ధీవిలసితులార! రండు, తెండన్నంబుల్ (10.857)** అన్నారు.

ఈ మాట వినగానే ధరణీసురసుందరులు సంభ్రమానందంబులు డెందంబులం సందడింప భక్ష్య భోజ్య లేహ్య చోష్య పానీయభేదాలతో కూడిన ఆహారపదార్థాలను పాత్రలలో నింపుకొని కడలిలో చేరడానికి తొందరపడే నదులలాగ బయలుదేరారు. ఆ సందర్భంలో మగలు వద్దన్నారు. అన్నదమ్ములు అడ్డం వచ్చారు. పిల్లలు ఎక్కడికమ్మా అని దైన్యంగా అడిగారు. కాని ఆ సందర్భంలో మునిపత్నులు 'అడ్డురాకండి. పక్కకు వెళ్ళండి' అంటూ గబగబ శ్రీకృష్ణుని దగ్గరికి వెళ్ళారు. సుదూరంలో భువనమోహన నటవేషభూతివానిని కనులార చూచారు. మనస్సులలోని తాపాలు హరించేలాగున తమ మనస్సులతోనే కౌగలించుకొన్నారు.

తనకోసం సర్వం వదలి వచ్చినవారిని వారిజనయనుడు సంప్రీతితో చూచి

'కాంతారత్నములార! మీ ఇళ్ళల్లో నిత్యకళ్యాణాలు సాగుతున్నాయి కదా! మమ్మల్ని దర్శించడానికి సంభ్రమంతో వచ్చారు కదా! మీకు ఏలాంటి శుభాలు కలిగించాలి! దగ్గరికి రండి. ఫలాసక్తిరహితులయి వచ్చారని నాకు అవగతమయింది. నాకు తెలుసు మీ మగవారలు గృహస్థధర్మాలు పాటించేవారు. మీతో కలిసి నిర్విఘ్నంగా క్రతువులు పూర్తి చేస్తారు. మీరు వెంటనే యాగవాటికకు వెళ్ళండి' అని ఆదేశించాడు. ఈ సమాధానం విన్న మునుల భార్యలు

**"తగునే మాధవ!' యిట్టి వాడిపలుకుల్? ధర్మంబులే మా యెడన్**
**మగలున్ బిడ్డలు సోదరుల్ జనకులున్ మమ్మున్ నివారింప మ**
**చ్చిగ నీ యంఘ్రులు సేరినార' (10.1.867)**

మేము మరలవెళితే వారు మమ్మల్ని ఏలుకొంటారా! ఒద్దంటే వెళ్ళినారని కసరుకోరా!

మీ మాట సుతరామూ వినము. మీ వద్దనే వుంటాము. మమ్మల్ని సేవకురాండ్రుగా భావించి కాపాడు' అని దైన్యంగా విన్నవించారు. వారిమాట, వారి ఆవేదన, వారి కోరిక అర్థం చేసుకొన్న శ్రీకృష్ణుడు వారికి నచ్చచెప్పాడు.

"భూసురాంగనలార! మీరేమీ భయపడకండి. దిగులుపడకండి. మీరు నా దగ్గరున్నారంటే ఎవరూ కోపపడరు. దేవతలయినా మెచ్చుకోవలసిందే. నా కీర్తనమున, దర్శనంవలన, వీక్షణవలన, ధ్యానంవలన సర్వమూ శుభప్రదమయి ముక్తిని ప్రసాదిస్తుంది." అని భరోసా పలికి వారు ప్రియంతో తెచ్చిన ఆహారపదార్థాలను ఆప్తవర్గంతో ఆరగించారు.

ఈ వృత్తాంతమంతా తెలుసుకొన్న బ్రాహ్మణులు పశ్చాత్తాపంతో 'కటకట! మోసపోయితిమి; కాంతల పాటియు బుద్ధిలేదు. నా దగ్గరకు వచ్చిన స్వామిని దర్శింపలేకపోయాము గదా! మనం దురాత్ములం కల్మషులం, విష్ణుదూరగులం. మా తపం దేనికోసం తీర్థయాత్రాది పర్యటనలెందుకు? యాగాదులెందుకని' ఆత్మవిమర్శ చేసుకొన్నారు. 'యాగాలు, తంత్రాలు, పుణ్యం, ధనం, కాలం, దేశం, దేవత, త్రేతాగ్నులు అంతా విష్ణుమయం. రక్షోనాథసంహర్తకు త్రికరణశుద్ధిగా మొక్కెదము' అన్నారు.

ఈ వృత్తాంతంలో ఎన్నో సందేశాలున్నాయి. బాహ్యాడంబరాలకే విలువ ఇచ్చేవారికి, సర్వసమర్పణభావం కలవారికి గల తేడా ఈ కథలో సూచితం. స్త్రీలకు సహజంగా వుండే మాతృత్వానికి ఈ వృత్తాంతం సాక్ష్యం. ఆబాలగోపాలమనడానికి సరిపోయిన వృత్తాంతమిది.

* * *

# 6. గ్రామీణ మహిళలు

భాగవతంలో పురాలే కాదు, గ్రామాల ప్రసక్తి కూడా కనిపిస్తుంది. వాటిల్లో రేపల్లె, బృందావనం ఎన్నదగ్గవి. మధురానగరానికి చాల దగ్గరిది వ్రేపల్లె. అక్కడి నందునికి, మధురానగరవాసి వసుదేవునికి సదనుబంధాలు, సత్సంప్రదాయాలున్నాయి. నందాదులు మధురకు వెళ్ళడం, వసుదేవాదులు వ్రేపల్లెకు రావడం, వారి మధ్య సమయోచిత సంభాషణలు, నందునికి హెచ్చరికలు చేయడంలాంటివి భాగవతంలో వర్ణితాలే.

కంసుడు 'ఆకాశవాణి' విన్నాక తనకు ముప్పు తప్పదని ఎందుకయినా సరేనని వసుదేవుని భార్యలను బందీచేశాడు. ఒక్క రోహిణి మాత్రం జాగ్రత్తపడి ముందుగా వ్రేపల్లె చేరింది. యశోదానందుల సంరక్షణలో మసలింది.

వ్రేపల్లెలోని గ్రామీణులు గోసంరక్షకులు. వ్రేపల్లెలో ఇంద్రోత్సవ ప్రసక్తి కనిపించడం వల్ల వ్యవసాయమూ ఉండవచ్చు. గ్రామం కనుక చాలవరకు ఒకరికొకరు బంధువులు గనుక వారి మధ్య అన్యోన్యతలు, ఆప్యాయతలుండేవి. కష్టసుఖాలలో సమాన భాగస్వామ్యం ఉండేది. వారు యశోదానందులను గౌరవించేవారు.

శ్రీకృష్ణునికి రేవపల్లెలోని గోపాంగనలతో చిత్రమయిన సంబంధముండేది. శ్రీకృష్ణుడు పుట్టినాడని తెలియగానే గోపాంగనలలో ముత్తైదువలు 'మన యశోద చిన్ని మగవాని కనెనట. చూచివత్తమమ్మ సుదతులార' అని గ్రామీణోచిత వేషాలతో వచ్చారట. యశోదానందులకు కానుకలిచ్చారట.

ఆ తరువాత ముత్తైదువలు పసిపాపనికి తలయంటి పసుపుపూసి బోరుకాడించి 'హరిరక్ష' అంటూ చుట్టూర నీళ్ళుపడేలాగ చల్లి ఉయ్యాలలో

పడుకోబెట్టి పాటలతో ఆశీర్వదించారట. అలాగే పూతన బాలునికి పాలు గుడపడానికి వస్తుంటే యశోదా రోహిణులు 'వనితా! ముట్టకుమమ్మ చన్నుగుడుపన్ వల్దమ్మ నీ చన్ను మా తనయు దొల్లడు వాసి పొమ్ము' అని మందలించారట.

విగతజీవురాలయిన పూతనపై పసిబాలుడు పొరాడుతుంటే 'రా బిడ్డా' అని భుజాలమీదికి ఎత్తుకొని దేహమంతా నిమిరి లాలించి ఆవుతోకతో దిగదుడిచి, ఆవు కాలిదుమ్మును పంచితాన్ని చల్లి ఆవుపేడను 12 నామాలతో స్మరిస్తూ ద్వాదశాంగములపై పూసారట. అయినా సంతృప్తిపడక ఆచమనం చేసి ఆయా బీజాక్షరాలను తమ శరీరం మీద ఆయా భాగాలలో న్యాసం చేసుకొని తమ దేహాలను సంరక్షణ చేసుకొని

'ఓ ముద్దులబిడ్డా! నీ పాదాలను బ్రహ్మ, మోకాళ్ళను వాయుదేవుడు, తొడలను అగ్నిదేవుడు, నడుము భాగాన్ని అచ్యుతుడు, పొట్టను హయగ్రీవుడు, హృదయాన్ని కేశవుడు, రొమ్మును ఈశానుడు, కంఠాన్ని సూర్యుడు, భుజాలను చతుర్భుజుడు, ముఖాన్ని త్రివిక్రముడు, శిరస్సును ఈశ్వరుడు కాపాడు గాక' అంటూ సకల అవయవరక్షకు హలాధరుడయిన మహాపురుషుడు రక్షించు గాక' అని దీవించారు. ఆపై పడుకోబెట్టి బిడ్డా! నిదురపో అన్నారు. ఈ సన్నివేశంలో వ్రేపల్లె ముత్తైదువలు పాలుపంచుకొన్నట్లే. ప్రతి సన్నివేశంలో యశోదలోని మాతృత్వం సుస్పష్టం.

అలాగే శకటాసురసంహారం జరిగినవేళ యశోద

**'అలసితివి గదన్న! యాఁకొంటివి గదన్న**
**మంచియన్న! యేడ్పు మాను మన్న!**
**చన్ను గుడువు మన్న సంతసపడు మన్న (10.1.259)** అంటూ చన్ను కుడిపిందట. చాలక రేపల్లె ముత్తైదువులు చెడుగ్రహం సోకిందని

గ్రహపీడ తొలగడానికి అనేక బలిదానాలు చేశారు. బ్రాహ్మణులు పీడానివారకమయిన హోమాలు పూర్తి చేశారు. వేదమంత్రాలు పఠిస్తూ 'స్వస్తి' వచనాలతో ఆశీర్వదించారు. అలాగే తృణావర్తసంహార సమయంలోను యశోద

"ఓ పాపడ! బాలసూర్యనిభ! బాలశిరోమణి నేడు గాలికిం జేవడిపోయితే" అని అంగలార్చింది. నేలమీద కూలే ఆవు లాగా యశోదపడిపోయిందట. ఇవన్నీ మాతృత్వంలోని అంశాలే. కుమారునికి ఎలాంటి బాధ కలుగకపోయేసరికి అందరు అంతా పూర్వజన్మ సుకృతఫలమన్నారు.

ఒకసారి మృత్‌భక్షణం చేశాడని బలరాముడంటే గద్దించాలని నోరు చూపమంటే నోటిలో బ్రహ్మాండభాండాలు చూచి నివ్వెర పోయిందట. ఆ సమయంలో గర్గుడు వచ్చి నామకరణాది బాల్యకర్మలను చేశాడు. ఈ కార్యక్రమాలన్నిట యశోద తల్లి హృదయం, వ్రేపల్లెవాసుల సహాయసహకారాదులుండనే వున్నాయి. వీటన్నిటిలోను కృష్ణుడు వారికి సహకరించినవాడే. అలాగే ఒకసారి 'వీరెవ్వరు శ్రీకృష్ణులు గారా' అని ఎత్తిపొడిచింది. ఇలాంటి సందర్భాలు అనేకం.

ఇక వ్రేపల్లెలో కృష్ణునికి గల అనుబంధంలో గోపముత్తైదువులను ఏడిపించిన చిల్లరచేష్టలు రెండవ ఘట్టం. కృష్ణుని వల్ల చేష్టలకు విసిగివేసారి కనీసం యశోదకు చెబుదామని గోపాంగనలు బయలుదేరారు. యశోద కసరుతుందేమో అని ఒక వంక భయం చెప్పకపోతే కృష్ణుని పిల్లచేతలు ముదురుపాకాన పడుతుందేమో అని మరొక శంక. అంచేత గోపాంగనలు చాకచక్యంగా యశోద అందచందాలను అనుసంధానిస్తూ ఫిర్యాదు చేశారట. లోకంలో ఏ స్త్రీ అయినా మరొక స్త్రీని పొగడుతుంటే ఆనందపడతారనే కిటుకు వారికి

తెలుసు. అంచేత ఫిర్యాదులు జోడిస్తూ ప్రస్తుతించారు. అంభోజాక్షి (10.1.307) తలోదరీ (10.1.310) లతాంగి (10.1.311) హేలావతి (10.1.313) శీతాంశుముఖి (10.1.314) మృగాక్షీ (10.1.319) పర్వేందుముఖీ (10.1.320) కలకంఠి (10.1.327) బాలేందుముఖీ (10.1.328) మంజులవాణీ (10.1.329) వీటితోబాటు స్వభావ సూచకమయినవి కూడా ఉన్నాయి. సతి (10.1.312) గుణాఢ్య (10.1.325) మొదలయినవి వీటితోబాటు అచ్చమయిన తెలుగు శబ్దాలున్నాయి. తల్లీ, మగువలాంటివి. యశోదకు ఫిర్యాదు చేసినవారు కాసంత వయస్సు మళ్ళిన యాదవాంగనలు కావచ్చు. ఆలంకారిక సంబోధనలు చేసినవారు యశోద వయసువారు కావచ్చు. వారి ఫిర్యాదులు మూడు రకాలు. మొదటిది వస్తుసంభారాలకు సంబంధించింది. రెండవది ఒకరికి మరొకరికి కలహాలు కల్పించే ప్రయత్నం. మూడవది వయసుకు మించిన అల్లరి చేష్టలు. మొదటిది పిల్లల మనస్తత్వానికి సంబంధించినవి. దూడలను ఆవులదగ్గరికి వదలవద్దు అంటే వదలిపెట్టడం, తాగడానికి పాలు కనబడకపోతే అక్కడి పాపను కొట్టడం, ఉట్టిలోని వస్తువులకు ఎగబడడంలాంటివి. రెండవది కయ్యాలు కల్పించి తమాషాచూడడం. ఒకరింటి కుండల్లో నేతిని తాగి ఆ ఖాళీ కుండను మరొక ఇంట్లో పెట్టడం. బిడ్డ నిదురపోతుంటే వాడి జుట్టును దూడతోకతో ముడివేయడం. వయసుకు మించిన పనులు వర్ణించడంలోనే కృష్ణుని అల్లరితనం సుస్పష్టం.

ఒకరి ఇంట్లోని పెరుగంతా త్రాగి, మిగిలిన పెరుగును ఇంటి కోడలి మూతికి పూయడంతో అత్తా కోడలకు వైరం కల్పించాడు. చిన్నది కృష్ణుని దుడుకుచేతలకు నివారకంగా అడ్డునిలబడితే ఆ చిన్నదాని చన్నొడిసిపట్టడం, నీ పేరేమిటే అని అరుణాధర అడగితే 'కాటు' కనబడేలా పెదవికొరకడం. స్నానం చేస్తుంటే వస్త్రాపహరణం చేయడం, నాతో

వస్తావా అని పళ్ళికిలించడం, ఒక తల్లి చూలాలిని అంటే చూలాలు కావడానికి కారణాలు అడగడం, ఒక స్త్రీ నిద్రపోతుంటే ఆమె వస్త్రాన్ని విప్పి ఒక పెద్దతేలుతో కరిపించడం, ఇద్దరు ఒకరినొకరు పెనవేసుకొని నిదరోతుంటే వారిమధ్య పాము వేయడం, ముందుకు వంగి వెన్న తీస్తూ వుంటే శృంగారపరమైన చేష్టలు చేయడంలాంటివి. ఇవన్నీ వయసువారు వయసులవారిలో చేసే చేతల్ని చూసి వుండడమే కారణాలు.

కృష్ణుని మూడు రకాల చేష్టలువిన్న యశోద అన్యమెఱుగడు, తనయాడ నాడుచుండు, మంచివాఁడు అనే మూడు గుణాలతో నోరుమూయించి చివరకు తనపట్ల వారు ప్రయోగించిన సంబోధనలను ప్రతిగా 'రామలార! త్రిలోకాభిరామలార! తల్లులార! గుణవతీమతల్లులార' అని పొగడ్తతోబాటు ప్రాధేయతను జతచేయడం ఒక అందమయిన చిట్కా. ఈ పద్యాలన్నిట్లోను పల్లె వాతావరణమే ప్రతిఫలిస్తున్నది.

ఈ సన్నివేశాలలో ఒక సందేశం లేకపోలేదు. ఇవన్నీ మగవారి కష్టాలు కావు. మగువల కష్టాలు. మగువల ఇబ్బందుల్ని మగువలతోనే దాపరికం లేకుండా చెప్పుకోవడం ఒక విశేషం. అదిగాక వారి వారి జాగ్రత్తలు వారు వారు చూసుకోవాలనడం సుతిమెత్తని దెబ్బ.

ఇక రెండవది కృష్ణునిది గోపికలతోడిది. ఇలాంటివి బృందావన సీమలోనే కనిపిస్తాయి. ఈ సీమలో ఎక్కువభాగం కృష్ణుడొకడే ప్రధానుడు. బాల్యచేష్టలలో ఇతరులుండేవారు. ఇది ఒక పరిణతదశలోనిది. ఈ స్థితిలో గోపికావస్త్రాపహరణం లాంటివి వున్న గోపికల ప్రేమను రాగాల గుంఫనం భ్రమరగీతలున్నాయి.

గోపకన్యలు మార్గశిర మాసం తొలిరోజున వేకువనే లేచారు. కాళిందీనదిలో తాన మాడారు. నదీతీరంలో గౌరీదేవి ప్రతిమనుంచి స్నానం చేశారు. ఆపై గౌరీదేవిని సురభికుసుమాలతో పూజించారు.

చందనధూపదీపాదులు సమర్పించారు. పలువిధములయిన నైవేద్యాలు సమర్పించారు. ఆపై అందరు మనసులో

**ఓ కాత్యాయని! భగవతి,**
**నీకున్ మ్రొక్కెదము నేము నేఁ దనుకంపన్**
**మా కిందఱకును వైళమ**
**శ్రీకృష్ణుఁడు మగడు గాఁగఁ జేయుము తల్లీ (10.1.808)**

అలా చేస్తే నేతివసంతాలాడుతూ జాతరలు చేస్తామని మొక్కుకొన్నారట.

## బృందావనంలో పరిణిత బాల్యక్రీడ

గోపికలు ఒకనెల కాత్యాయనీవ్రతం చేసి ఆపై ఒకరోజు యమునా తీరానికి చేరుకొని జలక్రీడ చేద్దామనుకొన్నారు. నదీతీరంలో విజనస్థలంబున వలువలు విడిచి శంకలేక జలకాలాట ఆడుతుంటే ఈ విషయం తెలిసిన కృష్ణుడక్కడికి చేరి వారి వలువలు అపహరించి ఒక కడిమిచెట్టుపై కూర్చున్నాడు. ఆ సమయంలో వ్రజకాంతలు

**మామావలువలు ముట్టకు**
**మామా! కొనిపోకు పోకు మన్నింపు తగన్**
**మా మానమేలు కొనియెదు?**
**మామానస హరణ మేల! మానుము కృష్ణా! (10.1.820)**

అంటూ 'మా మనసులు అపహరించావు. మా మానం కొల్లగొట్టావు. మా సిగ్గులు దోచావు. మా వలువలు అపహరించావు. నీవు మరేం చేస్తావో తెలియదు. కొంటె గోపాలా! నీ గుట్టు కనిపెట్టినామయ్యా! మేము నందమహారాజుకు ఫిర్యాదు చేస్తాము' అని బెదిరించారు. అపుడు 'దగ్గరకు రండి మీ వస్త్రాలనిస్తా'నని కృష్ణుడంటే

గోపికలు 'ఆడవారు తానం చేస్తుంటే మగవాళ్ళు ఆచోటికి రావచ్చా? ఒకవేళ తెలియక వచ్చిన ఇలా అల్లరి చేయవచ్చా? నీకు దాసులుగా ఉంటాం! నీవు కోరినవేళ వస్తాం. నీవు ఏది కోరినా ఇస్తాం. నీవు ఎక్కడికి పొమ్మన్నా పోతాం. ఇపుడు మా చీరలు ఇవ్వవు' అని బతిమిలాడారు. కాని కృష్ణుడు గోపికలతో 'మీరు చేస్తున్న వ్రతంలో ఏమి కోరారు? ఎవరిని పెళ్ళాడదలచినారు! మీ మానధనం అపహరించినవాడెవడు? నాతో చెప్పరాదా! నేనుపెరలాడనా' అన్నాడు. చివరకు కృష్ణుడే "నా ఇంట్లో దాసులుగా ఉండాలి. నా ఆనతి ప్రకారం నడవాలి. రండి. నీళ్ళనుండి బయటికి రండి. చీరలిస్తా"నన్నాడు. వారు చలికి భయపడి మడుగులోనే ఉండిపోయారు. అపుడు వారితో కొందరు 'వెళదామే' అన్నారు. మరికొందరు మనసిగ్గుతీయడానికే ఈ మాటలని ఊరకున్నారు. కొందరు ఏదీ తేల్చుకోలేక ఆందోళనలో పడ్డారు. చివరకు వారు గట్టెక్కారు. అపుడు కృష్ణుడు వారితో 'వ్రతం చేసేవారు వస్త్రంలేక మడుగులో దాగవచ్చా?. ఇది అంబికపట్ల అపరాధం కాదా? చేతులెత్తి నమస్కరిస్తే మీకు మీమీ వస్త్రాలు ఇచ్చేస్తాను. నేను మిమ్మల్ని చిన్నప్పటినుండి చూచినవాణ్ణి కదా! మీ మర్మాలు నాకు తెలియవా' అన్నాడు. చివరకు వారలాగే చేస్తే కృష్ణుడు వలువలు వారికిచ్చాడు. ఆ సమయంలో గోపికలందరు అతనియందు 'బద్ధానురాగులయ్యుఁ జలింపక దెప్పలిడక' తప్పక చూడసాగారట. అవ్వేళ కృష్ణుడు 'మీ హృదయరహస్యం నేను పసిగట్టాను. మీరు మీమీ ఇళ్ళకు పొండి. గౌరీవ్రతం పరిసమాప్తి చేస్తే రాత్రులందు నా కలయిక మీకు లభిస్తుంది' అని వాగ్దానం చేస్తే వారు తమ తమ ఇండ్లకు వెళ్ళిపోయారు.

ఈ చిన్న సంఘటనను పెద్దచేసి కృష్ణుని జారుడని, చోరుడని నిందించేవారున్నారు. ఈ చేతలన్నీ కృష్ణుడు చిన్నతనంలో చేసినవే. భక్తిసామ్రాజ్యంలో ఇవన్నీ జీవుల 'శరణాగతి'యే. ఇదొక లీలావిలాసం.

గోపికలతో గడిపిన మరొక వృత్తాంతం పూర్వభాగంలో శరద్రాత్రివేళ కృష్ణుడు వేణుగానంతో అందరిని ఆకర్షించిన సన్నివేశముంది. ఈ సన్నివేశంలో కృష్ణుడు తన గానానికి ముగ్ధలై వచ్చిన గోపికలను మందలించడం ఒక విశేషం.

'మీరు బాగున్నారా! గోకులానికి ఏ భయమూ లేదుకదా? క్రూర జంతువులు సంచరించే సమయాన మీరు రావడమేమిటి? మరీ రాత్రివేళ వచ్చారేమిటి? మీకు భయంలేదా వెళ్ళిపొండి, వెళ్ళిపొండి. మీరు ఇల్లు విడిచి రావడం తెలియక మీ తల్లులు, తండ్రులు, మగలు, మరదులు, కొడుకులు, కులంపెద్దలు, తోబుట్టువులు, చుట్టాలు ఎక్కడెక్కడ వెతుకుతున్నారేమో! మీకు ఇంత సాహసమా! మంచికులంలో పుట్టినవారు మారుమగలమీది కోరికతో రావచ్చా? లోకులు మెచ్చుకొంటారా! కాస్త ఆలోచించండి. మగణ్ణి వదలడం మగువకు మర్యాద కాదు. వెళ్ళండి. ఏడుస్తున్న పిల్లలకు పాలివ్వడం ప్రాణవల్లభులకు సేవచేయండి. పడతులకు పతిచర్యయే పరమార్థం. మీరు నన్ను ధ్యానించడం, నన్ను గూర్చి వినడం, నన్ను చూడడం, నాపైని పాట పాడడంతో మనసుంచితే చాలు' అన్నాడు. ఈ మాటలతో గోపికలు బెంబేలెత్తిపోయారు. ఆపైన కృష్ణునితో 'అన్నీవదలి వచ్చేశాం. నీవు ధర్మవేత్తవు. మగడు, కొడుకు మున్నగు పేర్లతో పిలువబడే నీవే మాకు సర్వస్వం. నీవే మా మనసులను మురిపించి అపహరించావు. ఏలాగూ మేము వచ్చేశాం. ఇదంతా మా నోముల ఫలమే. మాకెవ్వరూ ఇకవద్దు. నీ దాస్యమిచ్చి రక్షించు' అని తమ వాంఛలను విన్నవించగా వారి కోరికలను తీర్చాడట. కామోత్కంఠతతో వచ్చినవారిని ఆదరించాడు. ఇలా ఆచరిస్తూ కనుమరుగైనాడు.

గోపికలు కృష్ణవిరహాన్ని సహించలేకపోయారు. చెట్లను మా కృష్ణుడేడీ అని సంబోధిస్తూ కృష్ణుని వెదకినారు.

**నల్లనివాఁడు పద్మనయనంబులవాఁడు కృపారసంబు పైఁ**
**జల్లెడివాఁడు మౌళిపరిసర్పితపింఛమువాఁడు నవ్వుఁ రా**
**జిల్లెడు మోమువాఁడొకఁడు చెల్వల మానధనంబుఁ దెచ్చె నో**
**మల్లియలార! మీ పొదలమాటున లేఁడు గదమ్మ చెప్పరే? (10.1.1011)**

అడుగులు కనబడగా ఇటే వెళ్ళాడనుకొన్నారు. ఆడువారిని వలచినట్లే వలచి మాయమయ్యాడట. ఇలా అన్వేషించి కృష్ణుని కానక ఇళ్ళకు పోవాలనే చింతవదలి యమునానది సైకతాలలో ఆగారు. చివరకు మనోహరమైన గోపికాగీతలు పాడారు. ఆపై కృష్ణుడు కనబడి మాయంకాగా భవబంధాలనుంచి విముక్తి పొందిన భాగవతులలాగా నందనందనుని తలుస్తూ విరహతాపంతో తమ్ముతాము మరచినారు. యమునాసైకతంలో గోపాంగనలు జ్ఞానోదయంతో పరమాత్మను దర్శించి కృష్ణవిరహం వల్ల కలిగిన తాపం పోగొట్టుకొన్నారు. చివరకు కృష్ణుడు గోపికలను చూచి 'మీరందరు ఇలా రావడం బాగాలేదు. నీ తప్పును సైపుడని అంటూ 'నన్ బాయక కాల్చు మానసము ప్రత్యుపకారముగా తలంచి నా పాయుట తప్పుగా'దని చివరగా ఆశ్వాసించారు.

కృష్ణుడు రాసక్రీడలో గోపాంగనలను మురిపించాడు. ఎందరు గోపకాంతలో అందరికి తానొక్కడే అందరైనాడు. గుణవంతుడయిన కుమారునివల్ల కులం ప్రకాశించేలా వేణువిలాసంతో రాసలీల రక్తి కట్టింది.

**గోపజనములందు గోపికలందును**
**సకలజంతులందు సంచరించి**
**నా మహాత్మునకుఁ బరాఁగన లెవ్వరు**
**సర్వమయుడు లీల సలిపె గాక (10.1.1109)**

తెల్లవారుజామున ఇష్టంలేకున్నా ఎలాగో కన్నయ్యను వదలి గోపాంగనలు తమ తమ ఇళ్ళు చేరుకొన్నారు. కృష్ణమాయామోహితులై

గోపాలురు గోపికలను కోపగించుకోకపోవడం చాలాచిత్రమయిన విషయం.

**విరహతప్తులయిన గోపికల ఆవేగం**

అక్రూరుడు కృష్ణుని మధురానగరానికి తీసుకుపోవడానికి వచ్చాడు. ఆ సందర్భంలో ఈ సంగతి తెలిసిన గోపికలు కృష్ణవియోగం సహించలేక

**అక్రూరుండని పేరువెట్టుకొని నేఁ డస్మన్మనోవల్లభుం**
**జక్రిన్ మాకడఁ బాపికొంచు నరుగం జర్చించి యేతెంచి నాఁ**
**డక్రూరుం డఁట క్రూరుఁడీతఁడు నిజంబు (11.1216)**

మనసారా తిట్టిపోశారు. ఇక అక్రూరుడు బలరామకృష్ణుల్ని రథం ఎక్కించికొని పోతుంటే గోపికలు అవును, మధురాపురవాసులతో స్నేహం చేయాలని అనుకొన్నాడేమో. మనం నాటు మగువలం. పురసతులయితే వారి విలోకనాలు, సరసాలాపాలు, నర్మసంభోగాలు కృష్ణునికి వస్తాయేమో అని చింతలకులోనయి 'ఇప్పుడు ఎవరిని నిందించాలి. హరిని ఎందుకు తీసుకుపోయావని వద్దని అక్రూరుణ్ణి ప్రార్థిద్దామా లేదా హరి పాదాలదగ్గర పడదామా అంటూ కొప్పులు, కోకలు విడిపోతున్న విరహంతో, హాదైవమా' అంటూ ఏడ్చారు. తమ దుఃఖాన్ని అణచుకోలేక గోవింద-మాధవ-దామోదర అని స్వరబద్ధంగా, లయబద్ధంగా ఏడ్చారట. చివరకు మఱలివత్తునని, దూతికలద్వారా చెప్పిపంపించి తాను కదిలాడు. వారి ఆవేదన, వారి వీక్షణ

**అదె చనుచున్నవాఁడు ప్రియుఁడల్లదె తే రదె వైజయంతి య**
**ల్లదె రథఘోటకాంఘ్రిరజ మాదెస మార్గము చూడుఁ డంచులో**
**నొదవెడి మక్కువన్ హరిరథోన్ముఖలై గములై వ్రజాంగనల్**
**గదలక నిల్చి చూచిరటు గన్నుల కబ్బిన యంత దూరమున్**
**(10.1223)**

శ్రీకృష్ణుడు గోపకాంతల దగ్గరికి ఉద్ధవుని పంపాడు. తమకు కనిపించిన ఉద్ధవుని చూచి నీవు కృష్ణునికి నెచ్చెలివి. తల్లిదండ్రుల క్షేమం తెలియడానికోసం కృష్ణుడు నిన్ను పంపాడు. మరి ఇది సహజమే. ఈ వ్రేపల్లెలో ఆయనకు సంభావింపదగినవారెవరూ లేరు అని ఉద్ధవునినుండి వెంటనే బదులు రాకపోయేసరికి తనముందు తిరిగే గండు తుమ్మెదను చూచి అన్యాపదేశంగా శ్రీకృష్ణుని తిట్టింది.

'భ్రమరా! దుర్జనమిత్ర! సీమదాళీశ్వర! శ్రీకృష్ణుడు పుణ్యశ్లోకుడని మహాలక్ష్మి కూడా నమ్మడం చిత్రమే. వారాంగనల శోభనగృహాలలో కృష్ణుడు తచ్చాడుతున్నాడేమో. కృష్ణుని మోహించనివారు త్రిలోకాలందును లేరు. నగరును చేరి మమ్మల్ని నగుబాటు చేశాడు కృష్ణుడు. వేటగాని సంగీతానికి ఆకర్షితయై జింకలు బంధితమైనట్లుగా మేము మాయమాటలు నమ్మి మోసపోయాము. మావారినందరిని వదలి వచ్చినారమని కృష్ణునికి తెలియదా. అయినా అతడు నగర ప్రేమికుడయ్యాడు. జానపదాలను, ఆపదలలో వుండే అతివలను ఎందుకు గుర్తుకు తెచ్చుకోవాలి పృథివి నధిపులు నూతన ప్రియులు గారె' అని తమ వేదనను భృంగం నెపంగా వ్యక్తం చేసినప్పుడు ఉద్ధవుడు సాంతం శాంతంగా విని మధురాలాపంతో కృష్ణసందేశం వినిపించాడు. ఉద్ధవుడు గోపకన్యకలకు ముందు అధ్యాత్మతత్త్వం బోధిస్తూ చివర శ్రీకృష్ణసందేశం వినిపించాడు.

**చెలువల్ దవ్వులం నున్న వల్లభులపై ఁజిత్తంబు గూర్తు రు**
**త్కలికం జేరువవారికంటె నదియుం గాకెప్పుడున్ నన్ను మీ**
**రలు చింతించుచు నుండఁ గోరి యిటు దూరస్థత్వముం బొందితిన్**
**దలఁకం బోలదు నన్నుఁ గూడెదరు నిత్యధ్యానపారీణలై. (10.1.1473)**

ఈ సందేశం విన్నప్పటికి గోపికలు తాము కృష్ణునితో గడిపిన మధుర సన్నివేశాలనే పునరావృత్తి చేశారు. ఆపై 'దుఃఖార్ణవమగ్నంబైన

గోకులంబు నుద్ధరింపుము రమానాథ' అని ప్రార్థించి విరహవేదన విడిచినారట. ఉద్ధవుడు వారు స్వస్థులయ్యేదాక బృందావనంలో కొన్ని మాసాలు గడిపాడట.

భాగవతంలో నందుడు రేపల్లె వదలి బృందావనం చేరుకొన్నాక అతని ఉనికి కనబడదు. అలాగే యశోదది కూడ. కాని కృష్ణుడు వారిని మగధకు పిలిపించుకొని

**'తండ్రింజూడము తల్లిఁజూడము యశోదాదేవియున్ నీవు మా**
**తండ్రిం దల్లియు నంచు నుండుదుము సద్ధర్మంబుల్ దొల్లి యే**
**తండ్రుల్ బిడ్డల నిట్లు పెంచిరి? భవత్సౌజన్యభావంబులన్**
**దండ్రీ! యింతటివార మైతిమి గదా తత్తద్వయోలీలలన్'**

**(10.1.1402)**

## కాళీయకాంతామణులు

యమునానదిలో లోతయిన ఒక మడుగు. ఆ మడుగులో కాళీయుడనే పెద్దసర్పం. విషాగ్నిజ్వాలలతో భయంకరంగా కనిపించే మడుగులో కాళీయుని స్వేచ్ఛావిహారం. ఆ మడుగు మీద ఎగరడానికి కూడా భయపడేవి పక్షులు. ఆ మడుగునుండి వీచే గాలుల కారణంగా ప్రాణులు చనిపోయేవి. అంతేకాదు సౌభరిముని ఆశ్రమం ఉండడంతో అతనికి గరుడ భయంకూడాలేదు. ఇవన్నీ తెలిసిన కృష్ణుడు, భుజగవిషవహ్నిదోషంబు తెలియజేసి సుజలగావించి యీ నది చూతునని కృష్ణుడు సంకల్పించాడు. మడుగు దగ్గరి కడిమిచెట్టెక్కి నడుముమీది బట్టను బిగించి కట్టుకొని జబ్బలు చరుస్తూ రెండు పాదాలను కూడ దీసికొని మడుగులోకి దూకాడు. ఆ సమయంలో కాళీయుడు దూకినవాడు బాలుండొక్కడని

**'కలఁచి పిఱుతివక మతియును**
**వెఱవక నిజవదనజనితవిషదహనశిఖల్**
**మెరయ ఁదననిడుద యొడలిని**
**నెఱి హరిఁ బెనఁగొనియె భుజగనివహపతి వడిన్'** **(644)**

కృష్ణుని కరిచింది. గోపాలకులు హాహానాదం చేశారు. అయినా శ్రీకృష్ణుడు కాళియ ఫణిఫణామండలో నళినలోచనవిఖ్యాతనర్తకుండు నిత్య నైపుణ్యమున నృత్యం జేశాడు. కాళీయుని చేవ చచ్చింది. పడగల నుండి రక్తమాంసాలు వెలిగ్రక్కాడు. కళ్ళనుండి విషం జారిపోయింది. చొరవతగ్గి నీరసించిపోయి కాళీయుడు తన నెత్తిమీది నెక్కినవాడు సామాన్య బాలకుడు కాడని గ్రహించాడు. కాళీయుడ నొచ్చి చచ్చినట్లుండగా కాళీయుని భార్యలయిన నాగాంగనలు కృష్ణుని శరణువేడారు.

'కృష్ణా! దుష్టశిక్షణకోసం అవతరించినవాడవు. కాళీయుని శిక్షించడం గుణమే గాని దోషం కాదు. నీవు సర్వసముడవు. నీ శిక్షతో విషం కలవారమనే పొగరు దిగిపోయింది. అయినా కాళీయుడు పుణ్యధనుడని విశ్వసిస్తున్నాం. శ్రీమహిళారత్నానికి దొరికిన పాదరేణుకణ సంస్పర్శాధికారం కాళీయునికి దక్కింది. మేము కాళీయుని సమర్థించడం లేదు. అతడు తామసుడు. రోషకలితుడు. నీవు సర్వసమర్థుడివి. సర్వవ్యాపకుడివి అయినా సంబంధం లేనివానిగా ఉండేవాడని సృష్టిస్థితిలయలకు సాక్షివి నీవే.

కృష్ణా! నీలో ఏ తప్పులేదు. తప్పు చేసినవాణ్ణి శిక్షించదలచు కొన్నావు. మా పెనిమిటి ఆలోచనలలోను, చేతలలోను, పొరబాట్లున్నాయి. అయినా సుతుల నేరమని తండ్రులు క్షమించడంలేదా. రాజు నేరము చేసినవారిని దండించడం సహజమే కదా. నీరము గల్గు మా విభుని కాపాడరాదా! మా పెనిమిటి బాలుడని మంచివాడని మీకు చెప్పడం లేదు. వాడు క్రూరుడే. దుశ్శీలుడే. అయినా మేము కాళీయుని పత్నులం,

వైధవ్యదుఃఖంనుండి మమ్ము కాపాడు. ఇక చాలు నీ పదతాండవం. పతిభిక్ష పెట్టి రక్షించరాదా, మా ప్రాణనాథుని ప్రాణాలు ప్రసాదించి అతనితో నీవు మాకు 'పెండ్లిసేయించు' ఎపుడో జరిగిన పెండ్లిపెండ్లికాదు సుమా! నీవు జరిపించేదే నిజమయిన పెళ్ళి. మేము హామీ ఇస్తున్నాం. ఇకపైన ఎవరిని బాధింపడు. భయపెట్టి పాపపు పనులు చేయడం నీ ఆజ్ఞలో సేవకుడయి ఉంటాడు. స్వామీ! మా యీశుప్రాణంబు మాకు నీవే' అని ప్రార్థించగా కృష్ణుడు తాండవం ఆపి పక్కకు తప్పుకొన్నాడు. అప్పుడు కాళీయుడు

**'నా పుణ్య మేమి సెప్పుదు**
**నీ పాదరజంబు ఁగంటినే సనకాదుల్**
**నీ పాదరజము గోరుదు**
**రే పదమందున్ననైన నింక మేలు హరీ'** **(10.1.693)**

ఈ సన్నివేశంలో రకరకాల సందేశాలున్నాయి. లోకంలో కొందరు సాధువుల వెనకచేరినా దుష్కర్మలు చేస్తూనే వుంటారు. వారిపట్ల జాగురూకత అవసరమని ఒక సందేశం. బలమున్నదికదా అని నిరపరాధులను ఇబ్బందిపెట్టరాదని మరియొక సందేశం. స్త్రీలు వైధవ్యాన్ని కోరికోరి తెచ్చుకోరు. కనుకనే కాళీయపత్నుల అభ్యర్థన. చివరగా పశ్చాత్తప్తుడయిన ఎలాంటివానినైనను క్షమించడం మంచిదని ఒక సందేశం. కాళీయుని శిక్షించుటయేగాక గరుడభయముండదని సముద్రవాసం మంచిదని సూచించడమూ ఆర్తత్రాణపరాయణంలోని విశేషధర్మాలు.

**ఇతరములు**

భాగవతంలో 'పురంజనోపాఖ్యానం' విశిష్టమయినది. ఈ ప్రకరణంలోనే పేర్లన్ని ఆధ్యాత్మరంగానికి సంబంధించినవి. నారదుడు

ఈ ఉపాఖ్యానాన్ని రాజకథావ్యాజంతో తెలిసిన ఆధ్యాత్మతత్త్వమని నారదుడే చెప్తాడు.

ఈ కథలు 'కామరూప' కాలకన్య, ప్రమదోత్తమ అనే వనితల పేర్లున్నాయి. పురంజనుడు ఒక ఉద్యానవనంలో దర్శించి పెళ్ళాడిన వనిత 'కామరూప'. కాని కామాత్మకుడై, బుద్ధి అనే మహిషిచే వంచితుడయ్యాడు. ఆపై నేలపొరలే కామరూపపై మమతపెంచుకొని రేయింబవళ్ళు క్రీడించాడు. అలాగే భార్యను స్మరిస్తూ శరీరం విడిచిన పురంజనుడు ప్రమదోత్తమగా జన్మించాడు.

ఈ వృత్తాంతంలో 'పరం' నవద్వార శరీరాన్ని 'కామరూప' మగవానిని తన అందచందాలతో మోహించి తన వశం చేసుకొనే స్థితిని తెలియజేస్తుంది. భార్యను స్మరిస్తూ స్త్రీగా పుట్టడం ప్రమదోత్తమగా పుట్టడం జననమరణాదులతోడి జన్మలను సూచిస్తాయి.

ఇలాంటివారిలో సంభాషణకు అవకాశం తక్కువ. ఏమయినా ఆధ్యాత్మిక తత్త్వాన్వితమైన వృత్తాంతమిది.

* * *